మల్లన్న.. అంతేనా..!

తెరపైకి వచ్చిన శ్రీశైలం అంశం!



శ్రీశైలం వ్యూ

పుణ్యక్షేత్రమైన శ్రీశైలం ప్రాంతం ఏ జిల్లాలో ఉండాలనే అంశంలో రాయలసీమ.. ప్రత్యేకించి ఉమ్మడి కర్నూలు జిల్లా రాజకీయ పెత్తనానిదే పైచేయిగా మారింది. ఫలితంగా అత్యంత చేరువలో ఉన్న జిల్లాకేంద్రానికి దూరంగా శ్రీశైలం మిగిలిపోతోంది. 1956లో కర్నూలు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆ తర్వాత 1970లో ప్రకాశం జిల్లా ఆవిర్భావ సమయంలోనూ అక్కడి రాజకీయ నేతలు చక్రం తిప్పి కర్నూలు జిల్లాలోనే శ్రీశైలంను ఉంచారు. ప్రస్తుతం కొత్తగా మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పడుతుండగా.. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. శ్రీశైలం పుణ్యక్షేత్ర ప్రాంతం అక్కడి ప్రజానీకానికి అనువైన జిల్లాలో ఉండాలా? లేదా? అన్న కీలక విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మొత్తంగా ఆ వ్యవహారంపై సీమ రాజకీయ ప్రభావం అధికంగా కనిపిస్తోంది.

- కొనసాగుతున్న సీమ పెత్తనం
- అప్పుడూ, ఇప్పుడూ అదే తంతు
- నాడు ప్రకాశం జిల్లాకు దూరం
- నేడు మార్కాపురంలోకి కష్టమే!
- రాజకీయానికే ప్రభుత్వం ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

శ్రీశైలం ప్రస్తుతం నంద్యాల జిల్లా పరిధిలో ఉంది. కొత్తగా ఏర్పడుతున్న మార్కాపురం జిల్లాలోకి శ్రీశైలంను కలపాలా? వద్దా? అన్న అంశం సమస్యాత్మకంగా మారింది. 1956లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కర్నూలు కేంద్రంగా రాజధాని కొద్దికాలం కొనసాగింది. ఆ తర్వాత ప్రకాశం జిల్లా ఏర్పాటు సమయంలోనూ, ఇప్పుడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకాబోతున్న సమయంలోనూ శ్రీశైలం ప్రాంతం ఏ జిల్లాలో కొనసాగాలి అన్న విషయం చర్చనీయాంశంగా మారింది. కర్నూలు నుంచి హైదరాబాద్ రాష్ట్ర రాజధానిగా అప్పుడు మార్పు జరిగింది. శ్రీశైలంతోపాటు ప్రస్తుత మార్కాపురం డివిజన్ ప్రాంతమంతా అప్పట్లో కర్నూలు జిల్లాలోకి చేర్చారు. అంతకు ముందు కడప జిల్లాలో ఉన్న గిద్దలూరు, మార్కాపురం, దోర్నాల ప్రాంతాలు కూడా కర్నూలు జిల్లాలోకి రావడంతో శ్రీశైలం కూడా అందులో చేరింది.


అప్పుడు మొండిచెయ్యి!

1970లో ఒంగోలు కేంద్రంగా మూడు జిల్లాల్లోని ప్రాంతాలను కలిపి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పుడు, ఇప్పుడు కూడా దోర్నాల నుంచి అటు హైదరాబాద్ ప్రాంతానికి వెళ్లేందుకు అనుకూలమైన రవాణా మార్గాలు శ్రీశైలానికి ఉన్నాయి. అయితే ప్రకాశం జిల్లా ఏర్పడే సమయంలో కర్నూలు జిల్లాలో ఉన్న గిద్దలూరు, మార్కాపురం, దోర్నాల ప్రాంతాల మొత్తాన్ని చేర్చారు. దోర్నాల నుంచి రవాణా మార్గమున్న శ్రీశైలం పుణ్యక్షేత్ర ప్రాంతంను మాత్రమే కర్నూలు జిల్లాలో

మిగతా 6వ పేజీలో

వారి ప్రభావమే అధికం

గత ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలు, లోక్‌సభ స్థానంలోనూ టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. దీంతో రాష్ట్రప్రభుత్వంపై నంద్యాల జిల్లాలో గెలుపొందిన టీడీపీ ప్రజాప్రతినిధుల ప్రభావం పనిచేస్తోంది. ఇటు మార్కాపురం జిల్లా ఏర్పాటును కోరుకునే వారు ప్రాంతాల కతీతంగా జిల్లా ఏర్పాటును సాధించాలనే లక్ష్యాన్నే ప్రథమ బాధ్యతగా పరిగణించగా, నంద్యాల జిల్లాలో ఉన్న నేతలంతా శ్రీశైలాన్ని ఆ జిల్లాలో ఉంచుకునేందుకు చూస్తున్నారు. దీంతో శ్రీశైలం విషయాన్ని తెరపైకి తెస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటుకే సమస్య రావచ్చనే ఆలోచనతో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా శ్రీశైలం డిమాండ్ పక్కనపెట్టి మార్కాపురం జిల్లా ఏర్పాటుకు మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఫలితంగా శ్రీశైలం ప్రాంతం ఏ జిల్లాలో ఉండాలనే అంశంలో సీమ ప్రాంత రాజకీయనాయకుల పెత్తనానికే ప్రాధాన్యత లభించినట్లు కనిపిస్తోంది.


నీటి కుంటలో నిలిచిన నీరు (ఇన్‌సెట్‌లో) నిండుకుండలా ఉన్న చెక్‌డ్యాం

వర్షపు నీటిని ఒడిసిపట్టారు

- సమగ్రంగా జల సంరక్షణ
- మెరుగైన నీటి యాజమాన్య పద్ధతులు
- ఆదర్శంగా నిలిచిన మురుగుమ్మి
- జాతీయ ఉత్తమ జల పంచాయతీ అవార్డుకు ఎంపిక

పీసీపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీరు వృథా కాకుండా ఒడిసిపట్టి.. భూగర్భంలోకి ఇంకించి జల సంరక్షణలో పీసీపల్లి మండలంలోని మురుగుమ్మి గ్రామం ఆదర్శంగా నిలిచింది. 6వ జాతీయ ఉత్తమ జల పంచాయతీ అవార్డుకు ఎంపికైంది. ఈనెల 18న ఈ అవార్డును నీటి యాజమాన్య సంస్థ ఉన్నతాధికారులు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ఢిల్లీలో అందుకోనున్నారు. మురుగుమ్మి ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. ఈ పంచాయతీలో 381కుటుంబాలు, 1,850మంది జనాభా ఉన్నారు. ఇక్కడ జల సంరక్షణలో భాగంగా సుమారు కోటి రూపాయల వ్యయంతో 47కు పైగా పనులు చేపట్టారు. నీటి కుంటలు, ఊట కుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించారు. వర్షపునీరు చెక్‌డ్యాంలు, ఊట కుంటలు, నీటి కుంటలలోకి

మిగతా 6వ పేజీలో

17న ఒంగోలులోనే 'మీ కోసం'

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమాన్ని ఈనెల 17న ఒంగోలులోనే నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.చినఓబులేశు ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అర్జీల స్వీకరణ ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రజలంతా గుర్తించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇంటిపన్ను చెల్లింపు సులభతరం

- కుటుంబ యజమానే నేరుగా ఫోన్ ద్వారా చెల్లించే అవకాశం
- నిధులు దారిమళ్లకుండా ఉండేందుకు సర్కారు సరికొత్త విధానం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే ఇంటి పన్నులు దారిమళ్లకుండా నేరుగా పంచాయతీ అకౌంట్లకు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అందుకోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ ద్వారా పన్ను చెల్లింపునకు అవకాశం కల్పించింది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీల పరిధిలో గృహాలు (అసెస్‌మెంట్లు) 4.75 లక్షలు ఉన్నాయి. ఏటా పంచాయతీలకు పన్నుల రూపంలో సుమారు రూ.31కోట్లకుపైగా వస్తోంది. దానితో గ్రామాల్లో జనరల్ ఫండ్ పేరుతో పలు రకాల పనులు చేసే అవకాశం ఉంది. అయితే పన్నులు పంచాయతీల్లో వసూలు చేస్తున్నా బ్యాంకుల్లో పూర్తిస్థాయిలో జమ కావడం లేదు. ఆ నిధులు దారిమళ్లడంతోపాటు అనేక పంచాయతీల్లో ఖర్చు చేయకుండానే చేసినట్లు బ్యాలెన్స్ నిల్ చూపుతున్నారు.

ఆధార్ అనుసంధానంతో..

పన్నుల ద్వారా పంచాయతీలకు సమకూరే సొమ్ము దారిమళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్మార్ట్ ఫోన్ ద్వారా స్కాన్ చేసి ఎంత పన్ను బకాయి ఉంటే అంత పంచాయతీ బ్యాంకు అకౌంట్‌కు జమయ్యేలా చర్యలు తీసుకుంది. ఇప్పటికే గ్రామాల్లో అసెస్‌మెంట్ల సర్వే పూర్తయింది. ఇంటి యజమాని



ఆధార్‌తోపాటు, ఫోన్ నంబరును కూడా అనుసంధానం చేశారు. గతంలో గృహాలకు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ ఆ ఇంటి యజమానికి

మిగతా 6వ పేజీలో



భారీగా పెండింగ్

- స్మార్ట్ రైస్ కార్డుల అందజేతలో ట్విస్ట్
- డీలర్ల వద్దనే 64,598 కార్డులు
- అందుబాటులో లేని లబ్ధిదారులు
- ఒంగోలులోనే అధికం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడంతో 64,598 పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్‌కార్డుల స్థానంలో రైస్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. జిల్లావ్యాప్తంగా 6,51,820 తెల్లరేషన్ కార్డులు ఉండగా వాటి స్థానంలో రైస్‌కార్డుల పంపిణీని అధికారులు ప్రారంభించారు. 38 మండలాల్లో ఇప్పటివరకు 5,87,222 మంది లబ్ధిదారులకు మాత్రమే రైస్‌కార్డులను అందజేశారు. ఇంకా 64,598 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాకేంద్రమైన ఒంగోలు అర్బన్, రూరల్ మండలాల్లో 64,148 కార్డులు ఉండగా ఇప్పటివరకు 53,140 మాత్రమే పంపిణీ చేశారు. ఇంకా 11,008 మిగిలిపోయాయి. జిల్లాకేంద్రమైన ఒంగోలులో వివిధ ప్రాంతాల నుంచి

మిగతా 6వ పేజీలో

గుప్తనిధుల తవ్వకాలకు సహకరించిన అధికారిపై వేటు

7


ఒంగోలు బ్రాంచ్ కాలువలో ప్రవహిస్తున్న సాగర్ జలాలు

సాగర్ కాలువలకు పెరిగిన నీటి పరిమాణం

- జిల్లాకు 2,406 క్యూసెక్కులు సరఫరా

దర్శి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలకు నీటి పరిమాణం పెరిగింది. ప్రస్తుతం కుడి కాలువకు డ్యామ్ నుంచి పదివేల క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా బుగ్గవాగుకు చేరుతోంది. బుగ్గవాగు నుంచి సాగర్ ప్రధాన కాలువకు 9,620 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. అందులో గుంటూరు బ్రాంచ్ కాలువకు 2,200 క్యూసెక్కులు, అద్దంకి బ్రాంచ్ కాలువకు 1,430 క్యూసెక్కులు, సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలుకు (ప్రకాశం సరిహద్దు) 2,406 క్యూసెక్కులు వస్తోంది. అంతకుముందు జిల్లాలోని సాగర్ కాలువలకు తక్కువగా నీరు విడుదలవుతుండటంతో మేజర్లు, మైనర్లకు అందక ఆయకట్టు రైతులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో సాగునీటి సమస్యను వివరిస్తూ కొద్దిరోజుల క్రితం 'అరకొరతో అయోమయం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. జిల్లాకు నీటి పరిమాణాన్ని కొంతమేరకు పెంచారు. జిల్లాకు విడుదలవుతున్న నీటిని దర్శి బ్రాంచ్ కాలువ పరిధిలోని రైతులు వాడుకోగా మిగిలిన నీరు పమిడిపాడు బ్రాంచ్ కాలువకు 420 క్యూసెక్కులు, ఒంగోలు బ్రాంచ్ కాలువ (ఓబీసీ)కు 705 క్యూసెక్కులు పంపిణీ

మిగతా 6వ పేజీలో



అరటి కాయల లారీ బోల్తా

బేస్తవారపేట మండలం పందిళ్లపల్లె వద్ద అనంతపురం - అమరావతి జాతీయ రహదారిపై లారీ తిరగబడింది. దానిలో ఉన్న అరటికాయలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. నంద్యాల జిల్లా మహానంది నుంచి అద్దంకి వైపునకు ఈ లారీ వెళ్తోంది. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

- ఆంధ్రజ్యోతి, బేస్తవారపేట

వెలిగొండ పనుల్లో వేగం పెంచాలి

7

- అధికారులకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశం

బాలల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా స్థాయి ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- మహిళల భద్రతకు శక్తి టీంలు నిరంతరం పనిచేయాలని సూచన

7

ఈసారి వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత

నేడు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

ఒంగోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ విడత స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అంశాలను ప్రధానాంశంగా కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఒక్కో అంశంపై ప్రజలను చైతన్యవంతులను చేయడం, పరిశుభ్రత కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్న విషయం విదితమే. అందులోభాగంగా ఈ శనివారం వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించింది. ప్రధానంగా బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేధం, చేతులు శుభ్రపర్చుకోవడంపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించింది. విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాలను విధిగా చేపట్టాలని స్పష్టం చేసింది. ఇతరచోట్ల కూడా ఎక్కువమంది ఒకేచోట పనిచేసే ప్రదేశాల్లోనూ నిర్వహించాలని ఆదేశించింది. అందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో టాయిలెట్ల పరిశుభ్రతపై దృష్టిపెట్టడం, బహిరంగ మల, మూత్ర విసర్జన వలన అనర్థాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను అధికారులు చేపట్టనున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో నిర్వహించనున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.



మల్లన్న అంతేనా!

(5వ పేజీ తరువాయి)

ఉంచారు. కర్నూలు జిల్లా నుంచి శ్రీశైలానికి ప్రకాశంలోని దోర్నాల నుంచే వెళ్లాలి. అది తప్పించి వేరే మార్గం లేదు. వెనుకబడిన దోర్నాల ప్రాంతాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చిన అప్పటి పాలకులు శ్రీశైలం ప్రాంతాన్ని మాత్రం కర్నూలు జిల్లాలో ఉంచారు. అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతల్లో ఉన్న ప్రముఖుల సూచనలకు అనుగుణంగానే ఆ మార్పు చేశారు. శ్రీశైలం సమీపంలో ఉన్న శిఖరం ముందుభాగం వరకు ప్రకాశంలో కలిపారు. శ్రీశైలం దేవస్థానం ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలో ఉంచారు. రాయలసీమలో కీలకమైన కర్నూలు జిల్లాలో పెత్తనం చేస్తున్న నేతల సూచనలకు అనుగుణంగానే వ్యవహారం సాగింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో మార్కాపురం డివిజన్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. 1970 తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీలిక, ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నేపథ్యంలో కొత్త జిల్లాల అంశం తెరపైకి రాలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2022లో అప్పటి వైఎస్ జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పుడు మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలన్న డిమాండ్ వచ్చింది. అయితే జగన్ ప్రభుత్వం దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా మార్కాపురం డివిజన్‌ను ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలోనే కొనసాగించింది. అప్పటి నుంచి మార్కాపురం కేంద్రంగా పశ్చిమ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలన్న డిమాండ్ కొనసాగింది.

నూతన జిల్లా ఏర్పాటుకు సిద్ధం

మార్కాపురం కేంద్రంగా జిల్లా కోసం ఉద్యమించిన వారు శ్రీశైలం అంశాన్ని పక్కన పెట్టి ఆందోళన చేశారు. జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాలను ప్రత్యేక జిల్లా చేశారు. తదనుగుణంగా శ్రీశైలంను నంద్యాల జిల్లాలోకి చేర్చారు. నాటి ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలకు ఆ నిర్ణయం సమంజసంగానే అనిపించడంతో స్వాగతించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటును జగన్ ప్రభుత్వం తోసిపుచ్చినా అటు శ్రీశైలం వాసులు కానీ, ఇటు మార్కాపురం వాసులు కానీ శ్రీశైలం కర్నూలులో ఉన్నా నంద్యాలలో ఉన్నా ఏంటి అని పట్టించుకోలేదు. దీంతో శ్రీశైలం ప్రాంతం అంశం పక్కనపెట్టి మార్కాపురం జిల్లా లక్ష్యంగా ప్రజలు తమ వాదనలు వినిపించారు. గత ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు కొత్త జిల్లా అంశాన్ని పరిగణనలోకి తీసుకొని తమ పార్టీ అధికారంలోకి వస్తే మార్కాపురం కేంద్రంగా ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చారు. అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తన పుట్టినరోజున మార్కాపురం ప్రాంతంలో పర్యటిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. తదనుగుణంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే నాటి హామీ అమలుకు ప్రభుత్వం శ్రీకారం పలికింది. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తదనుగుణంగా రేపోమాపో మార్కాపురం జిల్లా ఏర్పాటుకు రంగం సిద్ధం కూడా అయింది.

అనూహ్యంగా ప్రచారంలోకి శ్రీశైలం

ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రప్రభుత్వం ముందడుగు వేయడాన్ని మార్కాపురం ప్రాంత ప్రజానీకం పూర్తిగా స్వాగతించింది. తదనంతరం రాజకీయాలకతీతంగా సాధారణ ప్రజానీకం శ్రీశైలం ప్రాంతం అంశాన్ని తెరపైకి తెచ్చారు. నిజానికి ఏ రకంగా చూసినా శ్రీశైలం ప్రాంతం మార్కాపురం డివిజన్‌లో ఉండటమే ప్రజలకు ఉపయోగకరం. పూర్వం నుంచి ఈ ప్రాంతం నుంచే రాకపోకలు ఉండేవి. శ్రీశైలంలో నివాసం ఉండే వారిలో అధికం మార్కాపురం డివిజన్ వారే. అందుకు కారణం శ్రీశైలం డ్యాం నిర్మాణ సమయంలో కూలీలుగా ఈ ప్రాంతం వారే పని చేశారు. తర్వాత ఉద్యోగాలు ఇవ్వడంతో అక్కడే స్థిరపడ్డారు. కానీ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను కానీ, వాస్తవానికి అనుగుణంగా ఉన్న పరిస్థితులను కానీ పాలకులు పరిగణనలోకి తీసుకోవడం లేదు. మార్కాపురం ప్రాంత ప్రజలు మొదటి ప్రాధాన్యతను జిల్లా ఏర్పాటుకే ఇస్తూ శ్రీశైలం అంశంపై ఆచితూచి అడుగు వేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో అలాగే వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ప్రసుత్తం శ్రీశైలం ఉన్న నంద్యాల జిల్లా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మొత్తం పార్టీలకతీతంగా శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. వాస్తవాలకు అనుగుణంగా ముందుకు సాగలేని పరిస్థితి ప్రభుత్వంలోని పెద్దలకు ఏర్పడింది. కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం కూడా ఈ అంశాన్ని పరిశీలించింది.

వర్షపు నీటిని ఒడిసిపట్టారు!

(5వ పేజీ తరువాయి)



కొండప్రాంతంలో వర్షపు నీటిని నిలిపేందుకు తీసిన ఆనకట్టలు

చేరుతోంది. దీంతో ఆ గ్రామ పరిసరాల్లో ఉన్న వ్యవసాయ బోర్లు, చేతిపంపులు, భూగర్భ జలాల నీటిమట్టం అమాంతం పెరిగింది. దీంతో రైతులు వరి, శనగ, పొగాకు వంటి పంటలను విస్తారంగా సాగుచేశారు. ఇటీవల ఆగ్రామంలో పర్యటించిన అధికారుల బృందం నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జల సంరక్షణ పనులను పరిశీలించి జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది.

నాడు బీళ్లు.. నేడు సాగు భూములు



మా గ్రామ ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. కొందరు పంటలు సాగుచేస్తే, మరికొందరు వ్యవసాయ కూలిపనులకు వెళ్లేవారు. ఈప్రాంతంలో గతంలో సరైన జల సంరక్షణ పనులు చేపట్టకపోవడంతో వ్యవసాయ బోర్లన్నీ ఎండిపోయేవి. దీంతో పంటలు పండక వ్యవసాయ భూములు బీళ్లుగా మారాయి. గత రెండేళ్ల నుంచి నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నీటికుంటలు, ఊటకుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించారు. ఫలితంగా ఈ ఏడాది కురిసిన వర్షాలతో అవన్నీ నిండి నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. దీంతో భూగర్భ జల మట్టం పెరిగింది. నాడు బీళ్లుగా ఉన్న భూములు ఇప్పుడు పంట పొలాలుగా మారాయి.

- పెద్దిరెడ్డి వెంకట్రావు, రైతు, మురుగుమి

‘తల్లి’డిల్లిన పసి హృదయం!



బాలుడిని తండ్రికి అప్పగించిన ఎస్ఐ శ్రీరాం

- అమ్మానాన్నలు విడిపోయి ఎనిమిదేళ్లు
- అమ్మను చూడాలని ఇంటి నుంచి వచ్చేసిన బాలుడు
- రాత్రి గస్తీలో బాలుడిని గుర్తించిన పోలీసులు

కనిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కన్నతల్లిని చూడాలని ఓ బాలుడు కావలిలోని తన తండ్రికి చెప్పకుండా కనిగిరి వచ్చి తల్లి జాడ తెలియక పోలీసుల ఆశ్రయంలోకి చేరాడో బాలుడు. వివరాల్లోకి వెళితే కావలి ప్రాంతానికి చెందిన సుల్తాన్‌బాషా తన భార్య యాస్మిన్‌తో కుటుంబ కలహాల నేపథ్యంలో ఎనిమిదేళ్లుగా దూరంగా ఉంటున్నారు. అప్పటికే వారికి ఫర్హాన్ అనే కుమారుడున్నాడు. ప్రస్తుతం ఆ బాలుడి వయస్సు పన్నెండేళ్లు. అయితే తల్లిదండ్రుల మధ్య కలహాలు ఆ బాలుడిని కన్నప్రేమకు దూరం చేశాయి. దీంతో కన్నతల్లి కోసం ఆ బాలుడి మనస్సు తల్లడిల్లింది. తనతల్లి స్వగ్రామం కనిగిరి ప్రాంతమని, అక్కడ ఓ కొండ చాలా దగ్గరగా ఉంటుందని, ఐదేళ్ల వయస్సులో వచ్చినప్పుడు గుర్తులు అలాగే ఆ బాలుడి మదిలో ఉండిపోయాయి. కారణాలేమో గాని గత రెండు రోజుల క్రితం కావలి నుంచి ఒక్కడే బస్సులో ఒంగోలు వచ్చి అక్కడ నుంచి కనిగిరి బస్సుల ఎక్కి బయలుదేరాడు. గురువారం మధ్యాహ్నానికి కనిగిరి మండల పరిధిలోని నందనమారెళ్ల వద్ద ఉన్న కొండను చూసి ఇదే తన తల్లి ఉండే ప్రాంతమని పొరబాటున బస్సును దిగేశాడు. తెలియక నడుచుకుంటూ వచ్చి నందనమారెళ్ల రోడ్డు పక్కన ఉండిపోయాడు. రాత్రి కావస్తుంది తల్లిని చూడాలనే ఆవేదనలో ఆ బాలుడికి పేగు ఆకలిని తెలియనివ్వలేదు. రాత్రి కావస్తుండటంతో రోడ్డుకు సమీపంలోని ఓ చర్చిలోకి వెళ్లి పడుకున్నాడు. గ్రామస్థులు గమనించి ఆ రాత్రి సమయంలో కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండు వద్ద బైక్‌పై దించేసి వెళ్ళిపోయారు. దీంతో రాత్రి వేళ గస్తీ నిర్వహిస్తున్న పోలీసుల కంట పడ్డాడు. పోలీసులు ఆ బాలుడిని విచారించి స్టేషన్‌కు తరలించి ఆహారం పెట్టించి హాస్టల్‌కు తరలించారు. శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి బాలుడిని వివరాలు అడుగగా, కావలి నుంచి వచ్చానని మా అమ్మ కనిగిరిలో ఉంటుందని అమ్మను చూసేందుకు వచ్చానని చెప్పి తండ్రి పేరు వివరాలు చెప్పాడు. పోలీసులు తమ శాఖా గ్రూపుల్లో పెట్టగా కావలిలో గత రెండు రోజుల క్రితం బాలుడి మిస్సింగ్ కేసు నమోదైందని, ఆ బాలుడిని గుర్తించి బాలుడి తండ్రిని పోలీసులు కనిగిరికి పంపారు. దీంతో బాలుడి తండ్రి, జేజెమ్మ వచ్చి పోలీసుల వద్ద ఉన్న ఫర్హాన్‌ను తీసుకుని వెళ్ళిపోయారు. కానీ ఆ బాలుడికి మాత్రం తల్లిని చూసే అవకాశం రాలేదు. ఆ బాలుడి కళ్ళు తల్లి కోసం స్టేషన్ చుట్టూ పరికిస్తున్నా తండ్రి గుర్తించకపోవటం బాధాకరం. కానీ పోలీసులు మాత్రం తల్లి ఆచూకీపై విచారించగా, దేవాంగనగర్ ప్రాంతంలో ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. కానీ బాలుడి తల్లి ప్రేమ తండ్రి కఠినత్వం ముందు ఓడిపోవటంతో పోలీసులు కూడా తండ్రికి బాలుడిని అప్పగించాల్సి వచ్చింది. హృదయవిదారకమైన ఈ సంఘటన పోలీసుల కంటిని సైతం చెమర్చేలా కదిలించింది.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

విజ్ఞానానికి పుస్తక పఠనమే ఉత్తమ మార్గం

- కలెక్టర్ రాజాబాబు
- ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

ఒంగోలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన సముపార్జనకు, మేథో వికాసానికి పుస్తకపఠనం ఉత్తమ మార్గమని కలెక్టర్ పి.రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా మేయర్ గంగాడ సుజాతతో కలిసి సరస్వతిదేవి విగ్రహానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం తొలి ప్రధాని జవహర్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడాన్ని చిన్నతనం నుంచే అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, తాము సముపార్జన చేసిన విజ్ఞానాన్ని సమాజం కోసం ఉపయోగించాలని కోరారు. మేయర్ సుజాత మాట్లాడుతూ పుస్తక పఠన ఆవశ్యకత, స్వాతంత్ర్య సమర సమయంలో గ్రంథాలయాలు పోషించిన పాత్రను భావితరాలకు తెలియజేసేందుకే ప్రతి సంవత్సరం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి, డిప్యూటీ లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ, కమిటీ సభ్యులు బంతికట్ల నాగేశ్వరరెడ్డి, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే దామచర్ల



ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఏపీ విద్యుత్ శాఖ ఉద్యోగుల ఎంప్లాయిస్ యూనియన్ (327) ఒంగోలు ప్రాంతీయ శాఖ సర్వసభ్య సమావేశం శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ షేక్ రియాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, రియాజ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కంది రవిశంకర్, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈ హరిబాబు, యూనియన్ నాయకులు బెల్లంకొండ సురేష్, డీవీఎల్ ప్రసాద్, సి. వెంకట్రావు, కేవీ. రవి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బోర్డు అనుమతి మేరకే పొగాకు సాగు చేయాలి



మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్), నవంబరు14(ఆంధ్రజ్యోతి) : పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన మేరకు మాత్రమే పంటసాగు చేయాలని ఒంగోలు పొగాకు వేలంకేంద్రం-2 నిర్వహణాధికారి జె.తులసి స్పష్టం చేశారు. శుక్రవారం అమ్మనబ్రోలు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పొగాకు రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేయటం, అనధికారికంగా పంట ఉత్పత్తి చేయటం ద్వారా అమ్మకాలు సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌ను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ధరలు దాని ప్రకారం ఆధారపడి ఉంటాయని చెప్పారు. అధిక అద్దెలకు బ్యారన్‌లు, పొలాలను కౌలుకు తీసుకోవద్దని తెలిపారు. పెట్టుబడులు తగ్గించుకోవాలని సూచించారు. పొగనారును ఎక్కడ కొనుగోలు చేసిన రసీదును వేలంకేంద్రంలో తప్పక ఇవ్వాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటీసీ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వరరావు, ఐటీసీ మేనేజర్ వినోద్, రైతులు పాలొన్నారు.

కొవ్వొత్తుల కర్మాగారంలో అగ్నిప్రమాదం

మూడు ద్విచక్ర వాహనాలు, కొంత ముడి సరుకు ఆహుతి

సమాచారం అందుకుని మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

చీరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొవ్వొత్తుల కర్మాగారంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపల్ పరిధిలోని బొమ్మలతోట కొవ్వొత్తుల కర్మాగారంలో శుక్రవారం తెల్లవారుజామున ఆకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. స్థానికులు పరిస్థితి గ్రహించే సరికి చాలావరకు ప్రమాదం హద్దులు దాటడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే కర్మాగారంలో కొంత ముడి సరుకు, మిషన్‌తో పాటు పక్కనే పార్కింగ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రమాదంతో కొంతమేరకు స్థానికులు భీతిల్లారు.

లారీని వెనక నుంచి ఢీకొన్న వాహనం

మార్టూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : మధురై నుంచి గుంటూరుకు విద్యుత్ జనరేటర్‌ను తీసుకువెళుతున్న ఆటో ముందు వెళుతున్న లారీ వెనుకభాగాన్ని ఢీకొంది. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి హైవేపై మండల పరిధిలో యలవర్తి కోల్డ్ స్టోరేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదం జరగగానే ముందు లారీ వెళ్లిపోగా, ప్రమాదానికి కారణమైన ఆటో వాహనం డ్రైవరు సీటులోనే ఇరుక్కుపోయాడు. అర్ధరాత్రి సమయం కావడం, రోడ్డు మధ్య లైన్‌లో ప్రమాదం జరగడంతో ఎవరూ పట్టించుకోలేదు. వాహనాలు దూసుకెళ్తున్న క్రమంలో స్టేషన్‌లో విధులు ముగించుకొని చిలకలూరిపేటలోని ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతున్న ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషాలు ఆ ప్రమాదాన్ని గుర్తించారు. వెంటనే రోడ్డుపై వెళ్లే వాహనదారులను అప్రమత్తం చేస్తూ, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఏఎస్ఐ బాషా ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. డ్రైవింగ్ సీటులోనే ఇరుక్కుపోయిన డ్రైవరును అతికష్టంమీద ఎస్ఐ సైదా వాహనం నుంచి కిందకు దించారు. గాయపడిన డ్రైవరును 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై వారు నేషనల్ హైవే అధికారులకు, హైవే మొబైల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదానికి గురైన ఆటోను రోడ్డు పక్కకు తరలించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

విశ్రాంతి ఉద్యోగి ఇంట్లో చోరీ

వేటపాలెం(చీరాల), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెంలో ఓ విశ్రాంతి ఉద్యోగి ఇంట్లో గురువారం రాత్రి చోరీ చోటుచేసుకుంది. ఆయన కొద్ది రోజుల క్రితం నాయుడు పేటలోని బంధువుల వద్దకు వెళ్లారు. తిరిగి శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి పరిసరాలు అనుమానాస్పదంగా కనిపించాయి. పరిశీలించగా తాళాలు పగలకొట్టి రూ.10 వేలు అపహరించినట్లు గుర్తించాడు. ఈ మేరకు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్యాటకం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

చీరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం తీర ప్రాంతాలైన రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం ప్రాంతాల్లో సుమారు రూ.30 లక్షలతో పర్యాటకులకు స్నానాల గదులు, మరుగుదొడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తులు అడ్డుడిన సమయస్ఫూర్తితో ఎదుర్కొని పరిష్కారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇతర ప్రాంతాలకు మిన్నగా బీచ్ అభివృద్ధి జరుగుతుందని హామీ ఇచ్చారు. అలాగే కోర్టు ప్రాంగణంలో నిర్మించనున్న బార్ కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నక్కల నాగరాజు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొన్నారు.

బ్రైన్ స్ట్రోక్‌తో ఐటీడీపీ మండలాధ్యక్షుడు మృతి

- స్పందించిన రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్
- ఎక్స్ వేదికగా సంతాపం



అచ్యుత్ రెడ్డి(ఫైల్)

పెద్ద దోర్నాల,నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో ఐటీడీపీ మండల అధ్యక్షుడు అన్నపురెడ్డి అచ్యుత్ రెడ్డి(25) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని చిన్నదోర్నాల గ్రామానికి చెందిన అచ్యుత్ రెడ్డి ఉన్నపళంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మార్కాపురం తరలిస్తుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ‘తెలుగుదేశం పార్టీ యువ సైనికుడు ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని చిన్నదోర్నాలకు చెందిన అచ్యుత రెడ్డి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందారని తెలిసి షాక్‌కు గురయ్యాను. పార్టీనే ప్రాణంగా భావించిన తమ్ముడు అచ్యుత్‌కు అశ్రునివాళులు అర్పిస్తున్నాను. పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఎక్కడ ఏ కార్యక్రమం నిర్వహించినా తప్పనిసరిగా కనిపించే మన అచ్యుత్ హఠాన్మరణం చాలా బాధాకరం. ఈ కష్టసమయంలో అచ్యుత్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుంది’ అని ఎక్స్ వేదికగా నారా లోకేశ్ స్పందించారు.



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

జాతీయ చెస్ పోటీలకు ఏబీఎం కాలేజి విద్యార్థి ఎంపిక

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి పోటీలకు ఒంగోలు ఏబీఎం జూనియర్ కాలేజి విద్యార్థి కే.దినేష్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దేవడకొండ శ్రీవాణి తెలిపారు. ఈస్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 పోటీలలో దినేష్ ప్రతిభ చాటినట్లు తెలిపారు. ఆ తర్వాత ఈనెల 6,7 తేదీలలో మన్యం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో దినేష్ ప్రథమ స్థానంలో విజయం సాధించి డిసెంబర్ 6,7 తేదీలలో బెంగళూరులో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి దినేష్ జాతీయ స్థాయిలో విజయం సాధించి, ఒంగోలు ఏబీఎం కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గారపాటి పుష్పరాజ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పులగూర జయశీలరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చింపిరిరెడ్డి అభినందించగా, తెల్లబాడు హైస్కూలు పీఈటీ శంకర్, చిరంజీవి, దినేష్‌కు నగదు బహుమతి అందించి అభినందించారు.

ఓటర్ల క్లెయిమ్‌లను పరిష్కరించాలి

- డీఆర్వో ఓబులేశు

కొండపి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఓటర్ల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని డీఆర్వో ఓబులేశు ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి మండలాల సూపర్‌వైజర్లు, బీఎల్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనిలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశాలకు గైర్హాజరైనా, క్లెయిమ్‌లపై స్పందించకపోయినా ఉపేక్షించేది లేదన్నారు. ఈఆర్వో ఎ.కుమార్, కొండపి తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రామాంజనేయులు, ఎలక్షన్ డీటీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రేపు రెడ్డి వనభోజన మహోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం మల్లవరం రిజర్వాయర్ వద్ద ఈనెల 16వ తేదీన జరిగే రెడ్డి కార్తీక వన భోజన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని రెడ్డి జనాభ్యుద సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ.రమణారెడ్డి కోరారు. ఒంగోలులోని రెడ్డి హాస్టల్‌లో శుక్రవారం ఈమేరకు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పలగాని రామసుబ్బారెడ్డి, పోలవల్లి నరసింహారెడ్డి, హాస్టల్ ఫౌండర్ పి.వెంకటరామిరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, నల్లమలపు బ్రహ్మారెడ్డి, నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీగా పెండింగ్

(5వ పేజీ తరువాయి)

వలసదారులు గతంలో ఒకచోట ఉండి రేషన్‌కార్డు తీసుకోగా ఇప్పుడు మరోకచోటకు చేరడం, లేదా వారి సొంత ప్రాంతాలకు పోవడంతో ఎక్కువ రైస్‌కార్డులు మిగిలినట్లు సమాచారం. దర్శి మండలంలో 3,153, చీమకుర్తి మండలంలో 2,731, వైపాలెంలో 2,754, కనిగిరి మండలంలో 2,639, మార్కాపురంలో 2588, సింగరాయకొండలో 20,004, ఎన్‌జీపాడులో 1,923, గిద్దలూరులో 1838 రైస్ కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్ఎన్‌పాడు మండలంలో 1,826, పెద్దారవీడులో 1,703, పుల్లలచెరువులో 1,673, కొత్తపట్నంలో 1,621, దొనకొండలో 1,559, ముండ్లమూరులో 1,589, తాళ్లూరులో 1,474, కొండపిలో 1,442 రైస్‌కార్డులు ఇంకా పంపిణీ చేయాల్సి ఉంది.

అయోమయంలో డీలర్లు

రేషన్ షాపుల వారీగా ఈ కార్డులను ప్రభుత్వం పంపింది. ఆ పరిధిలో పెండింగ్‌లో ఉండిపోయిన రైస్ కార్డుదారులు లేరు. దీంతో వారు ఇప్పటివరకు ఎక్కడి నుంచి రేషన్ తీసుకున్నారనేది అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. పౌరసరఫరాల శాఖ అధికారులు డీలర్లపై ఒత్తిడి తెస్తున్నా ఆ ప్రాంతంలో కార్డుదారులు లేకపోవడంతో స్మార్ట్ కార్డులు ప్రస్తుతం డీలర్ల వద్దనే పెండింగ్‌లో ఉన్నాయి. ఈనెల 1వతేదీ నుంచి జిల్లావ్యాప్తంగా రేషన్ పంపిణీ ప్రారంభంకావడంతో కార్డుదారులు ఒక చోట కార్డు ఉండి మరోచోట రైస్‌కార్డ్ ఉండటంతో ఆ డీలర్ వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని సూచించారు. అలా కొంతమందికి రైస్ కార్డులను అందించగా మిగిలిన వాటిని అందించలేని పరిస్థితి ఏర్పడింది.

సాగర్ కాలువలకు పెరిగిన నీటి పరిమాణం

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ఒంగోలు బ్రాంచ్ కాలువకు మరికొంత నీరు విడుదల చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చివరి ఆయకట్టు భూముల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. ఓబీసీకి వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎగువ ప్రాంత రైతులు వాటాకంటే అధికనీరు వాడుకుంటున్నారు. కుడి కాలువకు గరిష్ఠంగా నీరు విడుదల అవుతున్నప్పటికీ ఎగువ ప్రాంత రైతులు అధికంగా వాడుకోవడంతో ఇంకా కోటా ప్రకారం చివరి ప్రాంతాలకు అందటం లేదు. ఈవిషయాన్ని గుర్తించి అధికారులు ఒంగోలు బ్రాంచ్ కాలువకు మరింత నీటి పరిమాణం పెంచాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఇంటి పన్ను చెల్లింపు సులభతరం

(5వ పేజీ తరువాయి)

ఎలాంటి ఆధారం ఉండేది కాదు. కానీ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఇంటి ద్వారా బ్యాంకుల్లో అవసరమైనప్పుడు రుణాలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంది. ఈ విషయాన్ని ఇప్పటికే పంచాయతీ అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లారు. తాజాగా క్యూఆర్ కోడ్ ద్వారా పన్నుల చెల్లింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా పంచాయతీలకు ఒనగూరే ప్రయోజనాలపై కూడా దృష్టి సారించారు.

స్కూలు అసిస్టెంట్లకు కాంప్లెక్స్ మీటింగ్‌లు

ఒంగోలు విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు బోధించేందుకు అసిస్టెంట్ల(సబ్జెక్టు టీచర్లు)కు స్కూలు కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ విధానం మారనుంది. ఇప్పటి వరకు స్కూలు అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు వేర్వేరుగా క్లస్టర్ స్థాయిలోనే స్కూలు కాంప్లెక్స్ సమావేశాలు జరిగేవి. అయితే ఈ సమావేశాలకు, సబ్జెక్టుకు ఒకరిద్దరు మాత్రమే హాజరవుతుండటంతో ఈ సమావేశాలు వెలవెలబోయేవి. దీంతో స్కూలు అసిస్టెంట్ల సబ్జెక్టు కాంప్లెక్స్ సమావేశాలను మండల కేంద్రాల్లోనే నిర్వహించాలని తాజాగా నిర్ణయించారు. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ అదేశాలు జారీ చేశారు. ఈనెల 22న జరగనున్న స్కూలు కాంప్లెక్స్ సమావేశాలకు సంబంధించి మండల కేంద్రాల్లోని పాఠశాలల్లోనే నిర్వహించనున్నారు. కాంప్లెక్స్ మీటింగ్ తేదీని ముందుగా మండల విద్యాధికారి, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ల ద్వారా తెలియజేయాలి. ఈ సమాశంలో సబ్జెక్టు టీచర్ల బోధనపై చర్చించాల్సి ఉంటుంది. స్కూలు అసిస్టెంట్లందరూ తప్పనిసరిగా కాంప్లెక్స్ సమావేశాలకు హాజరుకావాలి. మీటింగ్ రికార్డులు కాంప్లెక్స్ హెచ్‌ఎం ద్వారా ఎంఈవోకు పంపాలి.

పీడీసీసీ బ్యాంకులో సహకార వారోత్సవాలు


జెండా ఆవిష్కరిస్తున్న పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య

ఒంగోలు విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత సహకార వారోత్సవాలను శుక్రవారం స్థానిక పీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య సహకార జెండాను ఆవిష్కరించి వారోత్స వాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సీతారామయ్య మాట్లాడుతూ అత్మనిర్భర్ భారత్ సాధకాలుగా సహకార సంఘాలు ప్రధానాంశంగా ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు సహకార వారోత్సవాలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, నిర్వహణ సామర్థ్యం పెంపొందించేందుకు బ్యాంకు లావాదేవీల కంప్యూటరీకరణను పూర్తిచేసినట్లు తెలిపారు. సహకార సంస్థల ద్వారా గ్రామీణాభివృద్ధిని బలోపేతం చేయడంలో భాగంగా ఈనెల 16వ తేదీన బ్యాంకు సిబ్బంది, సహకార సిబ్బందితో ఒంగోలు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీతారామయ్య తెలిపారు. బ్యాంకు స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్యాంకు వ్యవస్థాపనకు ముఖ్యకారకులైన దివంగత పాటిబండ్ల గోపాలస్వామి సేవలను కొనియాడారు. జిల్లా సహకారాధికారి డి.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ సహకార వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. ఈకార్యక్రమంలో బ్యాంకు సీఈవో పిడివి శర్మ, సిబ్బంది ఉన్నారు.

● పీడీసీసీ బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో పీఎం సూర్యఘర్ రుణాలను పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ప్రారంభించారు. ఈ పథకం కింద ఇరువురికి రుణాలు మంజూరు చేసిన బ్యాంకు చైర్మన్ సీతారామాయ్య లబ్ధిదారులకు రుణాలకు సంబంధించిన చెక్కులను అందజేశారు.

సదస్సు ద్వారా పారిశ్రామిక విధానం స్పష్టం

● దామచర్ల సత్య


సదస్సులో మాట్లాడుతున్న దామచర్ల సత్య

టంగుటూరు (కొండపి), నవంబరు14 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరుగుతున్న సీఐఐ పారిశ్రామిక వేత్తల సదస్సు ద్వారా కూటమి ప్రభుత్వం పారిశ్రామిక విధాన దార్శనికతను, పారిశ్రామిక అనుకూల విధానాన్ని అతిథులకు స్పష్టం చేసిందని ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. విశాఖలో జరుగుతున్న సీఐఐ సదస్సు పదవ సెషన్‌లో శుక్రవారం పాల్గొన్న సత్య కూటమి ప్రభుత్వ విధానాన్ని పారిశ్రామిక వేత్తలకు వివరించారు. పారిశ్రామిక ప్రగతి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా సాగిన సదస్సు నిర్దేశాలకు అనుగుణంగా మారిటైంబోర్డు సహకరిస్తుందని సత్య అన్నారు.

ఎయిడ్స్ నివారణపై విస్తృత అవగాహన

● కలెక్టర్‌రాజాబాబు


జెండా ఊపి అంబులెన్స్ ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందని కలెక్టర్ పీ రాజాబాబు అన్నారు. అందులో భాగంగా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించేందుకు ఒక వినూత్నమైన వాహనాన్ని కేటాయించిందని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్ వాహనాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ముందుగా ఆ వాహనం లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులతోపాటు ఆ లక్షణాలు ఉన్న అనుమానితులు వైద్య పరీక్షలు చేయించుకోవడంతో కౌన్సెలింగ్ పొందేందుకు ప్రత్యేక వాహనాన్ని ప్రభుత్వం రూపొందించి జిల్లాకు అందించినట్లు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆ వాహనం వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ వాహనంలో ఒక వ్యక్తి మాత్రమే ఉండి పరీక్షలు చేయడంతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వడం వల్ల రోగి వివరాలను బయటకు తెలిసే అవకాశం లేదన్నారు.

చర్మరోగ పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలి

జిల్లాలో ఈనెల 17వతేదీ నుంచి చేపట్టనున్న చర్మరోగ(కుష్టు వ్యాధి) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజాబాబు అదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో శుక్రవారం సమన్వయ కమిటీ సమావేశానికి కలెక్టర్ రాజాబాబు అధ్యక్షత వహించారు. ఈనెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా ఈ చర్మరోగ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అందుకు సంబంధించిన అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడారు.

ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించాలి

ప్రజలతో పాటు విద్యాలయాలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ రాజాబాబు అన్నారు. అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, వసతిగృహాల అధికారులు, విద్యాశాఖాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాన్ని, మునిసిపాలిటీలను యూనిట్‌గా తీసుకొని ఎంతమంది ప్రజలు నివసిస్తున్నారు? తాగునీటి వనరుల లభ్యత ఎక్కడి నుంచివస్తోంది? ఎన్ని బోర్లు ఉన్నాయి? ఫ్లోరైడ్ శాతం ఎంత, ఎన్ని ఆర్వో పాంట్లు ఉన్నాయి? తదితర వివరాలతో సమగ్ర నివేదికతో పాటు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసి రెండు, మూడు రోజుల్లో అందించాలని కలెక్టర్ అదేశించారు. ఈ అంశంపై ప్రతివారం సమీక్ష జరుగుతుందని, అందువల్ల సంబంధిత శాఖల అధికారులు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆయాశాఖల అధికారులు చిరంజీవి, వెంకటేశ్వరరావు, బాల శంకరరావు, లక్ష్మానాయక్, సంజయ్‌కుమార్, జ్యోతి ఉన్నారు.

వెలిగొండ పనుల్లో వేగం పెంచాలి

● జేసీ ఆర్.గోపాలకృష్ణ


వెలిగొండ ప్రాజెక్టు సొరంగం వద్ద పనులను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

పెద్ద దోర్నాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన 2026కు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడమే లక్ష్యంగా పనులు వేగవంతం చేసేందుకు అధికారులను అప్రమత్తం చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్, ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా సొరంగాల్లోకి చేరిన వరద నీరు తొలగింపు పనులను జేసీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం దోర్నాలలోని వెలిగొండ ప్రాజెక్టు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మొదటి విడతలో భాగంగా వచ్చే ఏడాది ఖరీఫ్‌కు పూర్తి చేయాలన్న సంకల్పంతో ప్రాజెక్టు పెండింగు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు తాను వారం వారం అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని, ప్రతి గురువారం, లేదా శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానన్నారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులతో నిర్వహించాల్సిన పనులపై సమీక్షించినట్లు తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ వద్ద కొద్దిపాటి పనులున్నాయని, ఫిబ్రవరికి పూర్తయ్యేలా, టన్నెల్-2లో లైనింగ్ పనులు జనవరికి, ఫీడర్ కెనాల్‌పై స్ట్రక్చర్లు లైనింగ్, రిటైనింగ్ వాల్ ఫిబ్రవరికి, తీగలేరు ఎర్త్ వర్క్స్ 75శాతం పూర్తయిందని స్ట్రక్చర్లు మార్చికి పూర్తయ్యేలా కార్యాచరణను రూపొందించి తదనుగుణంగా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆర్‌అండ్‌ఆర్‌లో భాగంగా పునరావాస కాలనీల్లో చేపట్టాల్సిన అధిక భాగం పనులు ఇడుపూరు-2, దేవరాజు గట్టు, ఒందుట్ల, వేములకోట వద్ద మౌలిక వసతులు పూర్తి చేసేందుకు ఏజన్సీలతో చర్చించినట్లు చెప్పారు. భూసేకరణలో 726 మందికి అవార్డు ఇవ్వాల్సి ఉంది. 600 మందికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అన్ని పనులు సమాంతరంగా, వేగవంతంగా చేసి ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రాజెక్టు పూర్తికి ఏజన్సీలు, ఇంజనీరింగు అధికారులతో ప్రతి శుక్రవారం సమీక్షిస్తుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ శివ రామిరెడ్డి, ప్రాజెక్టు ఎస్‌ఈ అబూత్ ఆలి, డీఈ కృష్ణారెడ్డి, తహసీల్దారు అశోక్ కుమార్ రెడ్డి, వీఆర్‌వోలు నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఆనందరావు పాల్గొన్నారు.


పూలసుబ్బయ్య కాలనీలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

డాగ్‌స్క్వాడ్‌తో విస్తృతంగా తనిఖీలు

మార్కాపురం/మార్కాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు మార్కాపురంలో పోలీసులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సీఐ పి.సుబ్బారావు పర్యవేక్షణలో ఒంగోలు నుంచి వచ్చిన పోలీసు జాగిలం రాక్సీతో అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. ప్రధానంగా గంజాయి నిల్వ ఉంచడం, అక్రమంగా తరలించడంపై దృష్టిపెట్టిన పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, కంభం బస్టాండ్, దోర్నాల బస్టాండ్, చెన్నకేశవస్వామి దేవస్థానం ఏరియా, పూలసుబ్బయ్య కాలనీల్లో ప్రయాణికులు బ్యాగుల్లో సోదాలు చేశారు. పలు అనుమానిత దుకాణాలు, ఇళ్లలో కూడా జాగిలంతో సోదాలు నిర్వహించారు.

● మండలంలోని రాయవరం వద్దగల మార్కాపురం రైల్వేస్టేషన్‌లో సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్ఐ అంకమ్మరావు సిబ్బందితో కలిసి డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో నేరస్తులను, మందు గుండు సామగ్రిని గుర్తించడానికి ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న రాక్సీ, చీత డాగ్‌లతో రైల్వే స్టేషన్‌లోని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలంచి అనుమానితులు ఉన్న ప్రాంతలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో డాగ్ హ్యాండర్‌లు వెంకటేశ్వర్లు, విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

సరైన జీవనశైలితోనే మధుమేహం నియంత్రణ



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చక్కటి జీవన శైలితోనే మధుమేహాన్ని నియంత్రించొచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖలోని సమావేశపు హాలులో శుక్రవారం ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా తీసుకోవాల్సిన పలు అంశాలపై వివరించారు. మధుమేహం అనేది రక్తంలో గ్లూకోజ్(చక్కర) స్థాయిలు ఎక్కువగా ఉండే దీర్ఘకాలిక వ్యాధి అన్నారు. శరీరంలోని కణాలకు శక్తిని అందించేందుకు అవసరమైన ఇన్సులిన్ శరీరానికి సరిపడా ఉత్పత్తి చేయనప్పుడు లేదా దీనిని సరిగా ఉపయోగించు కోలేనప్పుడు ఇది ప్రబలుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌టీవో డాక్టర్ బాలాజీ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భగీరథి, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శ్రావణి, జిల్లా ఆరోగ్య విస్తరణ, మీడియా అధికారులు బెల్లం నరసింహరావు, సరోజిని, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00


మూగచింతల గ్రామంలో పొగాకు నారుమడులను పరిశీలిస్తున్న రీజినల్ టీం

పొగాకు నారుమడులను పరిశీలించిన రీజినల్ టీం

పొదిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ తరువాత దెబ్బతిన్న నారుమడులను శుక్రవారం వేలం నిర్వహణాధికారి గిరిరాజ్ కుమార్ ఆధ్వర్యంలో దక్షిణప్రాంత తేలిక నేలల రీజినల్ ఆఫీస్ సూపరింటెండెంట్ బృందం పలుగ్రామాల్లో పరిశీలించింది. మండలంలోని బట్టువారిపల్లి, మూగచింతల గ్రామాల్లో నారుమడి యజమానులను మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, దృఢమైన నారును మాత్రమే అమ్మాలని చెప్పారు. నాణ్యత లేని నారును అమ్మడం వల్ల రైతులు నష్టపోతారని, నష్టపోయిన రైతు నుంచి ఫిర్యాదు వస్తే తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రీజినల్ ఆఫీస్ సూపరిండెంట్ ఎం.సత్యశ్రీనివాస్, క్షేత్ర సహాయకులు మోతీలాల్, బోర్డు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఆర్చరీలో మేఘవర్షకు బంగారు పతకం



ఒంగోలు విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పాఠశాల క్రీడల్లో ఒంగోలు విద్యార్థిని కాట్రగడ్డ మేఘవర్ష రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఒంగోలు డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న మేఘవర్ష అల్లూరు సీతారామరాజు జిల్లా పాడేరులో జరిగిన ఆర్చరీ పోటీల్లో ప్రతిభను చూపి రాష్ట్రస్థాయి స్వర్ణ పతకం సాధించారు ఈనెల 19 నుంచి 21 వరకు వారణాసిలో జరగనున్న జాతీయ స్థాయి ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో మేఘ వర్ష పాల్గొనున్నారు. పతకం సాధించిన వర్షను శ్రీ హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డైరెక్టర్ జి.హర్షిత, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కవిత అభినందించారు.

బాలల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

● ఎస్పీ హర్షవర్ధనరాజు


చిన్నారులకు చాక్లెట్లు ఇస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణలో పోలీసు శాఖ ముందు వరుసలో ఉంటుందని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కల్యాణమండపంలో బాలల సంక్షేమ పోలీసు అధికారులు, మహిళా సహాయక కేంద్రం సిబ్బంది, శక్తి టీమ్స్‌తో జిల్లాస్థాయిలో ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోక్సో చట్టం, జువైనల్ జస్టిస్ యాక్ట్-2015, బాల్య వివాహాల నిర్మూలన తదితర చట్టాలపై పోలీసు అధికారులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా శక్తి బృందాలు బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు ముఖ్య కూడళ్ల వద్ద ఈవ్‌టీజింగ్ జరిగే ప్రదేశాల్లో పర్యటిస్తూ మహిళల భద్రత కోసం నిరతరం పనిచేయాలని అన్నారు. శక్తి టీమ్‌లు 3000పైగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, సీడీపీవో పి.ఇవాజిలెన్, సీడీపీవో పి.దినేష్, మహిళ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ వి.వి.రమణ, సీఐలు దేవప్రభాకర్, సుధాకర్ పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిషత్తు

పిల్లలు బాగా చదివి అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కార్యాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యాక్రమంలో చిన్నారులకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సోనియా గాంధీ నగర్‌లో అంగన్‌వాడీ పిల్లలు పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. పిల్లలతో ఎస్పీ ముచ్చటిస్తు బాలల దినోత్సవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ యం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాలకు సహకరించిన అధికారిపై వేటు


కరిముల్లా ఖాన్ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే అక్రమాలకు అండగా నిలుస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన సంపద ఉంటుంది. దానిని దోచుకునేందుకు ఎంతో మంది ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారి నుంచి అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులు లంచాలకు లొంగి వారి చేతిలో అటవీ సంపద పెడుతున్నారు. ఇటువంటి ఒక అధికారిని గుర్తించిన ఫారెస్టు ఉన్నతాధికారులు అతనిపై సస్పెండ్ వేటు వేశారు. ఎర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఆలయాలు, భూములు, పులులతోపాటు ఇతర విలువైన సంపద ఉంది. వాటిని దోచుకునేందుకు ఈ ఏడాది ఆగస్టు నెలలో కొందరు పక్కా ప్లాన్‌తో ఎక్స్‌కవేటర్, జీపు, కారులతో 10 మంది వరకు ఫారెస్టులోని చెక్‌పోస్టులను దాటుకుని మూడు రోజుల పాటు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. చెక్ పోస్టులను దాటుకొని తవ్వకాలు జరిపారంటే ఆ శాఖ వారి (అధికారి, సిబ్బంది) పాత్ర కూడా ఉండే ఉంటుందని ఆంధ్రజ్యోతి గతంలో కథనం ఇచ్చింది. అదే నిజమైందని రుజువైంది. ఆ సంఘటన జరిగిన కొద్ది రోజులకే మార్కాపురం డీఎఫ్‌వో బదిలిపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న మార్కాపురం ఫారెస్టు డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రవూఫ్ సీరియస్‌గా తీసుకుని స్వయంగా అయనే కేసును విచారణ చేపట్టారు. ఈ విచారణలో గంజివారిపల్లి సెక్షన్ అధికారి పఠాన్ కరిముల్లా ఖాన్ పాత్ర ఉన్నట్లు తెలడంతో కరిముల్లా ఖాన్‌పై డీడీ సస్పెండ్ వేటు చేశారు. అక్కడ పట్టుబడిన వాహనాలు, వ్యక్తులు దీనిపై ఇంకా విచారణ చేపడుతున్నట్లు సమాచారం. పూర్తి విచారణ అనంతరం మరికొంత మందిపై వేటు వేసి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

సింగన్నపాలెం సర్పంచ్ చెక్‌పవర్ తాత్కాలికంగా రద్దు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు మండలం సింగన్నపాలెం సర్పంచ్ కే గీతాంజలి చెక్‌పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సింగన్నపాలెం పంచాయతీల్లో ఎలాంటి తీర్మాణాలు లేకుండా ఆర్థిక సంఘం నిధులను దుర్వినియోగం చేశారని మాజీ సర్పంచ్ మనం నరసింహారావు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదుపై ఒంగోలు డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణకు అదేశించారు. ఈ విచారణ సమయంలో రికార్డులు పరిశీలించగా సర్పంచ్ గీతాంజలి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.98 లక్షలను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేసినట్లు గుర్తించారు. అందుకు సంబంధించి తీర్మాణాలు కానీ, ఇంజనీరింగ్ అధికారులు సర్టిపై చేసిన ఎం.బుక్‌కానీ విచారణలో చూపించలేదు. నిధులను పీఎఫ్‌ఎంఎస్ ద్వారా డ్రా చేయాల్సి ఉండగా సర్పంచ్ గీతాంజలి చెక్ ద్వారా వ్యక్తిగతంగా నిధులు డ్రా చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు డివిజనల్ పంచాయతీ అధికారి నివేదికను సమర్పించడంతో సర్పంచ్ గీతాంజలి ఆ నిధుల దుర్వినియోగంపై సంజాయిషీ ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులపై ఆమె స్పందించకపోవడంతో రూల్ 42(1) ప్రకారం మూడు నెలల పాటు చెక్కు డ్రాయింగ్ పవర్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ డీపీవో వెంకటేశ్వరరావు ఉత్తర్వులిచ్చారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే దామచర్ల
- పండుగ వాతావరణంలో పలు కమిటీల ప్రతినిధుల ప్రమాణ స్వీకారం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పిలుపునిచ్చారు. ఒంగోలు నియోజకవర్గ నగర, మండల, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కోన్వీనర్లు, గ్రామ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ వేడుక శుక్రవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో పండుగవాతావరణంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల ముఖ్య అతిథిగా హాజరై వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవులు అలంకరించిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్‌సిక్స్ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. గడిచిన ఏడాదిన్నర కూటమి ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కోరారు. అభివృద్ధిలో నియోజకవర్గం ముందుకెళుతోందన్నారు. ఇప్పటికే నగర సుందరీకరణ, అలాగే పేదలకు ఇంటి నిర్మాణాలు, రోడ్లు, డ్రైన్‌లు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ డ్రైన్‌ల సమస్యలు పరిష్కరించామని తెలిపారు. అలాగే పదవులను అలంకారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, తద్వారా కష్టపడి పనిచేసిన వారికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, అలాగే పార్టీ కోసం, ప్రజల కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని దామచర్ల తెలిపారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, మేయర్ గంగాడ సుజాత, ఏఎంసీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కొఠారి నాగేశ్వరరావు, వైవీ.సుబ్బారావు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, పక్కన సీతారామయ్య, సుజాత


ప్రమాణస్వీకారం చేస్తున్న పలు కమిటీల ప్రతినిధులు

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీకి సంబంధించి పలు శాఖల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో రాష్ట్ర పరిశీలకులు సీహెచ్.శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేయించారు. మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల అధ్యక్షుడుగా హరిబాబు, ప్రధానకార్యదర్శిగా రావులపల్లి వెంకటసురేష్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అబ్బూరి శ్రీనివాసరావు, తెలుగు యువత అధ్యక్షులుగా ముప్పరాజు శ్రీను తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు, మండల ఉపాధ్యక్షులు మల్లవరపు రామక్రిష్ణారెడ్డి, నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, తన్నీరు శ్రీను, నువ్వల మీరయ్య, చెన్నారావు, గోపీ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న హరిబాబు తదితరులు

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: టీడీపీ అనుబంధ కమిటీల నాయకుల ప్రమాణస్వీకారం మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉప్పుగుండూరులో అట్టహాసంగా జరిగింది. 9, 11వ క్లస్టర్‌ల పరిధిలోని కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు స్థానిక బీసీ కమ్యూనిటీహాలులో మండల పార్టీ క్లస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో నూరు శాతం విజయం సాధించి పార్టీకి అంకితం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, సీనియర్ నేత గుమ్మడి సాయిబాబు, కనగాల శ్రీనివాసరావు, బి.సెల్వం, మారెళ్ల శ్రీనివాసరావు, కుంచాల నాగరాజు, తిరుమలశెట్టి శ్రీను, పోట్లూరి నాగమల్లేశ్వరావు, ఇంటూరి శ్రీనివాసరావు, ముద్దన రవి, లంబు నాగేశ్వరరావు, జెట్టి వెంకటస్వామి, స్వర్ణ కిషోర్ బాబు, కొండా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నాయకులు

రేపు ఉచిత వైద్యశిబిరం

ఒంగోలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీసత్యసాయిబాబా 100వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 16వ తేదీన ఒంగోలు నగరం మంగమూరురోడ్డులోని శ్రీసత్యసాయిబాబా మందిరంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మందిర కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ వైద్యశిబిరంలో కంటి, గుండె, ఎముకలు, చిన్నపిల్లలు, జనరల్, స్త్రీల వైద్య నిపుణులు పాల్గొని ఉచితంగా పరీక్షలు చేస్తారని శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఆహ్వానపత్రం అందజేస్తున్న కన్వీనర్ శ్రీనివాసరావు

అరుణకు 'జీవన సాఫల్య పురస్కారం'

ఒంగోలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన ప్రముఖ గుత్తికొండ చారిటబుల్ ట్రస్ట్ జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి శుక్రవారం తెలిపారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లా రచయిత్రుల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు ఆయన సతీమణి స్వర్గీయ రామరత్నం పేరిట ప్రతి ఏడాది ఈ పురస్కారాన్ని అందజేస్తున్నారు. ఈ సంవత్సరం ఒంగోలుకు చెందిన ప్రముఖ రచయిత్రి అరుణ ఎంపికయ్యారు. ఈ నెల 23వ తేదీన మచిలీపట్నంలో అందజేయనున్నారు. ఈ సందర్భంగా అరుణను సాహితీవేత్తలు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మ రావు, కుర్రా ప్రసాద్‌బాబు, మహతి బాలాజీ, మిడసల మల్లిఖార్జున రావు, యూవీ.రత్నం, బీరం అరుణ, వి.ఝాన్సీదుర్గా, మున్నంగి రాజకుమారి, మారేపల్లి సూర్యకుమారి, నాళం నరసమ్మ అభినందనలు తెలియజేశారు.


అరుణ

క్విస్‌లో ఘనంగా స్వాగత వేడుకలు

ఒంగోలు విద్య, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఫార్మసీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరం ఫార్మసీ విద్యార్థుల స్వాగత వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో క్విస్ ఫార్మసీ కళాశాలను ఎంపిక చేసుకున్న విద్యార్థులను విద్యా సంస్థల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ గాయత్రి అభినందించారు. మొదటగా సరస్వతి పూజ నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతిప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కొప్పోలు సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ టి.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. అల్లూరు, కొప్పోలు, దశరాజుపల్లి, గుత్తికొండవారిపాలెం, చింతలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

25న డప్పు కళాకారుల మహాసభ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 25వ తేదీన జరగనున్న డప్పు కళాకారుల జిల్లా రెండవ మహాసభను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా డప్పులతో డప్పుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డప్పు కళాకారులు, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కంకణాల ఆంజనేయులు, రాఘవులు, మోజేష్, టి.రామారావు, కత్తి అంగల కుర్తి సూరిబాబు, బ్రహ్మయ్య, కాకుమాను సుబ్బారావు, రక్షణకుమార్, పెద్దలాజర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నాగులుప్పలపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు సూచించారు. కండ్లగుంట గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా లేదని, విషజ్వరాలు ప్రబలుతున్నాయని ఫిర్యాదులు అందడంతో జడ్పీ సీఈవో బి.చిరంజీవి, డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వరు, డీపీవో వెంకటేశ్వరరావు శుక్రవారం అక్కడ పర్యటించారు. వీధులను పరిశీలించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీరు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవాలని ఆదేశించారు. గ్రామంలో ఎలాంటి విషజ్వరాలు లేవని క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తేళ్ల రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో శిఖా సునీల్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బిహార్ ఎన్నికల్లో విజయంపై సంబరాలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం బాణసంచా పేల్చడంతో పాటు స్వీట్లు పంచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ఫలితంగానే బిహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుర్మార్గ రాజకీయాలను ప్రజలు పూర్తిగా ఓడించారని చెప్పారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రపంచ వ్యాప్తంగా దేశ ప్రతిష్ఠలను పెంచడంతో పాటు దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, ఓబీసీ మోర్చా మాజీ కార్యదర్శి రావులపల్లి నాగేంద్రయాదవ్, నాయకులు మాకినేని అమరసింహ, బొద్దులూరి ఆంజనేయులు, తోగంటి శ్రీనివాస్‌చౌదరి, తీగల సత్యవతి, బాలకోటయ్య, తిరుమలరావు, శిరీష, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.


బాణసంచా పేల్చుతున్న బీజేపీ నాయకులు

పల్లామల్లి సొసైటీ సేవలపై అవగాహన

చీమకుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పల్లామల్లి సొసైటీలో రైతుల ప్రయోజనార్థం అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. పల్లామల్లిలోని సొసైటీ ఆవరణలో, చంద్రపాడు గ్రామంలో కళాజాతాల ద్వారా ప్రజలకు సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పారా చంద్రశేఖర్‌రావు, సభ్యులు సారెకొక్కు జాన్సన్, పత్తి అంజయ్య, పీడీసీసీ బ్యాంకు మేనేజర్ పీవీ.రమణకుమార్, సూపర్‌వైజర్ సాయికుమార్, సీఈవో గుంజి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

చీమకుర్తి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణం గాంధీనగర్‌లోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. దాత గుండా శ్రీనివాసరావు 130మంది విద్యార్థులకు అట్టలు, వాటర్‌బాటిల్స్‌ను ముఖ్యఅతిథులుగా విచ్చేసిన కొమ్మి నరసింగారవు, ఎంఈవోలు నరసింహారావు, శివాజీల చేతులమీదుగా విద్యార్థులకు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చాట్ల శ్రీనివాసరావు, అంబటి వీరారెడ్డి, బొడ్డు శంకర్, బాలినేని కళ్యాణిరెడ్డి, బొడ్డపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ దొంతు నీలిమ, వైస్‌చైర్మన్ కరుణ, వెంకటరావు పాల్గొన్నారు.


విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

సహకార రంగాన్ని బలోపేతం చేసుకోవాలి

ఒంగోలు(రూరల్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): సహకార రంగాన్ని బలోపేతం చేసుకోవాలని డివిజనల్ సహకార సంస్థ అధికారి శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలులోని కోపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ (సూపర్‌బజార్) దగ్గర శుక్రవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సూపర్‌బజార్‌లో వ్యాపార లావాదేవీలు పెంచుకోవాలన్నారు. సహకార ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండీ సురేంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


జెండా వందనం చేస్తున్న ఉద్యోగులు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నాగులుప్పలపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ సూచించారు. ఉప్పుగుండూరులోని రెండు సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవడంతో ఆయనపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సూచించారు. సర్వే విధుల్లో ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే చర్యలకు వెనకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థులకు టీషర్ట్‌లు, అల్పాహారం అందజేత

ఒంగోలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని బొమ్మరిల్లు అనాథ పిల్లల ఆశ్రమంలో శుక్రవారం రాత్రి బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుహారీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్ ముఖ్యఅతిథిగా కేక్ కట్ చేసి 100 మంది పిల్లలకు టీషర్ట్‌లు, అల్పాహారాన్ని అందజేశారు. ఫౌండేషన్ అధినేత సాదనాల సురేష్‌బాబును అభినందించారు. కార్యక్రమంలో బండారుపల్లి రవితేజ, దాసరి శ్రీనివాస్, ఖాదర్‌బాషా, రవి, సుబ్బారావు, వాలేరు రవి, నున్న హరిప్రియ, సంధ్య, వెంకీ, సుప్రజ, ఉషా, రిషిక్, మోహన్, భార్గవ్, నిర్వాహకులు ఖాసిం, పి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న కంది రవిశంకర్

సీఎం సహాయనిధితో పేదలకు ఆరోగ్య భరోసా

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, నవంబరు14(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధితో పేదలకు ప్రభుత్వం ఆరోగ్యానికి భరోసా ఇస్తోందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి కింద 18 మంది లబ్ధిదారులకు రూ.7,22,450లను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమపరిపాలన అందిస్తూ, వాటి ఫలాలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేటట్లు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. సమస్యలపై వచ్చిన 20 అర్జీలను వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతానని ప్రజలకు హామీ ఇచ్చారు.


లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఘనంగా నాయీ బ్రాహ్మణ కార్తీక వనసమారాధన

ఒంగోలు కల్చరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర క్షౌరశాలల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన శుక్రవారం ఘనంగా జరిగింది. కందులూరులోని వీఆర్ఎన్‌కే గ్రీన్ సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు రెండు వేల మంది నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితులచే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, శివపార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ, శ్రీశైల దేవస్థాన పాలకమండలి సభ్యులు ఉప్పుటూరి బాలగురుస్వామి, రాజ్యలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి నాదెండ్ల రామచంద్రరావు, నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షుడు పిల్లుట్ల సుధాకర్, గ్రీన్‌సిటీ వెంచర్ అధినేత వల్లూరి వెంకటరామయ్య పాల్గొన్నారు.


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

డైట్‌లో వైద్యసేవలు

సంతనూతలపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మైనంపాడు డైట్ కళాశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం జిల్లా యునాని వైద్య విభాగం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సీనియర్ వైద్యురాలు ఎం.భ్రమరాంబ విద్యార్థులకు, అధ్యాపకులకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు. అలాగే మంగమూరు జడ్పీహైస్కూల్లో జరిగిన వేడుకల్లో డిప్యూటీ డీఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం బిక్షాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


నెక్స్‌జెన్ స్కూలులో బహుమతి అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



బాలాజీనగర్‌లో బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు


కె.ఉప్పలపాడు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్రాహైస్కూలులో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు కరస్పాండెంట్ బొమ్మల శ్రీనివాసరావు, డైరెక్టర్ బొమ్మల విజయలక్ష్మి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

గౌతమి మోడల్ స్కూలులో..

ఒంగోలు విద్య: స్థానిక భాగ్యనగర్‌లోని గౌతమి మోడల్ స్కూలులో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అదరగొట్టారు. పాఠశాల డైరెక్టర్ ఎం.కొండయ్య, ప్రిన్సిపాల్ ఎం.పద్మజ, అలెక్స్, టీచర్లు చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఉమా మనో వికాసకేంద్రంలో..

ఒంగోలు క్రైం: చిల్డ్రన్స్ డే సందర్భంగా ఒంగోలులో టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. తొలి ప్రధాని జవహరలాల్ నెహ్రూ పుట్టిన రోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన వివరించారు.

బొమ్మరిల్లులో..

స్థానిక భాగ్యనగర్‌లో గల బొమ్మరిల్లులో బాలల దినోత్సవం నిర్వహించారు. పిల్లలకు తాలుకా సీఐ విజయకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. పెన్నులు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.హరిబాబు, ఎండీ ఫిరోజ్, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

ఒంగోలు కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఒంగోలు బాలాజీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు వలేటి వీరేంద్ర, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, క్లబ్ కార్యదర్శి అద్దంకి శ్రీనివాసరావు, ఈపూరు శివప్రసాద్, మంజు విగ్నేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్స్‌జెన్‌లో.

ఒంగోలు కార్పొరేషన్: నగరంలోని నెక్స్ జెన్ స్కూలులో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత వారం రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ కె.మురళీధర్ రెడ్డి, కె.అరవింద, ప్రిన్సిపాల్ ఆర్ఎల్‌వీ.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగర్వాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో..

డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలులోని భాష్యం స్కూలు విద్యార్థుల సమక్షంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్ సాయి, డాక్టర్ శిరీష ప్రిన్సిపాల్ సుశీల పాల్గొన్నారు.

సంతనూలపాడులో..

సంతనూతలపాడు: బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సంతనూతలపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఎస్సీ వసతిగృహం విద్యార్థులకు, చిన్నారులకు ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్సై వి.అజయ్‌బాబులు స్వీట్స్ పండ్లను పంచిపెట్టారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై గౌరీప్రియ పాల్గొన్నారు.

కె.ఉప్పలపాడు..

కొండపి : కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం సుసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.రాఘవేంద్రశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొన్నలూరులో..

పొన్నలూరు: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రవిచంద్రబాబు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక మాస దీపోత్సవం

ఒంగోలు(రూరల్), నవంబరు14(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలు రోడ్డులోని బృందావనగార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి కీర్తిక మాస దీపోవత్సవం వైభవంగా కాలనీవాసులు నిర్వహించారు. ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. మహిళలు ఆవునెయ్యితో దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


కంభంలో కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న హిందువులు

ఢిల్లీలో బాంబు పేలుడుకు
కంభంలో శాంతియుత నిరసన

కంభం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు దాడికి నిరసనగా కంభం హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కంభంలో నల్ల రిబ్బన్లు, కొవ్వొత్తులతో నిరసన, మౌన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా హిందూ చైతన్య వేదిక సంఘం వారు మాట్లాడుతూ భారతదేశం శాంతి కాముక దేశమన్నారు. అన్ని మతాలను సమానంగా చూసే భారతదేశంలోనే ఉగ్రమూకలు దాడులు చేయడం హేయమైన చర్యని అన్నారు. ఎవరు ఎన్ని ఉగ్రకుట్రలు చేసినా భారతదేశాన్ని ఏమీ చేయలేరని వారు తెలిపారు. ఢిల్లీ దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కంభం రామాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి కొవ్వొత్తులతో శాంతియుతంగా నిరసన తెలిపారు.


గజ్జలకొండలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారునికి అందజేస్తున్న ఎంఎల్ఏ సతీమణి వసంత లక్ష్మి, టీడీపీ నాయకులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

మార్కాపురం రూరల్, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో అనారోగ్యంతో ప్రయివేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకున్న వారికిసీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఆయా గ్రామాలలోని లబ్ధిదారుల వద్దకు వెళ్లి శుక్రవారం ఎంఎల్ఏ కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి టీడీపీ నాయకులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. మార్కాపురం మండలంలోని దరిమడుగు, భూపతిపల్లి, చింతగుంట్ల, మాలపాటిపల్లి, మాల్యవంతునిపాడు, తిప్పాయపాలెం, వేములకోట, గజ్జలకొండ, పెద్దయాచవరం గ్రామాలలో లబ్ధిదారుల వద్దకు వెళ్లి రూ. 6.52 లక్షల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కాకర్ల శ్రీనివాసులు, అశోకొరెడ్డి, నారు వెంకటేశ్వరరెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.


ఆకస్మిక తనిఖీలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎంపీడీవో

కంభం సచివాలయం -4లో
ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

కంభం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కంభం సచివాలయం -4ను ఎంపీడీవో వీరభద్రాచారి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి మినీలో వేళలు పాటించని సచివాలయ సిబ్బంది అనే శీర్షికన ఖాళీ కుర్చీల ఫొటోలతో వచ్చిన ప్రత్యేక కథనానికి స్పందించిన ఎంపీడీవో సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ సబ్మిట్ చేయాలన్నారు. సర్వే చేసే విషయంలో సిబ్బందికి ఎవరికీ ఎలాంటి మినహాయింపు లేదన్నారు. డిజిటల్ అసిస్టెంట్ సంబంధించి ఏపీ సేవా సర్వీస్ పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు.


పాలుట్లలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

200 మందికి వైద్యపరీక్షలు

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన పాలుట్ల, నారుతడికల, నెక్కంటి ప్రాంతాలలో నివశించే చెంచు కుటుంబాలకు పాలుట్ల వైద్యులు, జిల్లా మలేరియాధికారి మధుసుధనరావు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 200 మందికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా మలేరియాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నివాస ప్రాంతాలలో, నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వర నాయక్, సబ్ యూనిట్ ఆధికారి భాస్కర్, స్టాఫ్ నర్సు అరుణ, హెల్త్ అసిస్టెంట్ అశోక్ నాయక్, ఏఎన్ఎం మాధవి లత, ల్యాబ్ టెక్నీషియన్ జానా రెడ్డి, వెంకట రామయ్య, కొండయ్య పాల్గొన్నారు.

చిన్నదోర్నాలలో ఉచిత వైద్యశిబిరం

పెద్ద దోర్నాల, :మండలంలోని చిన్నదోర్నాల గ్రామంలోని వేమన విద్యాలయంలో కందుల ఓబులరెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉత వైద్యశిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో ఎముకలు, కీళ్ల శస్త్ర కిత్సల వైద్య నిపుణులు కిరణ్‌కుమార్ రెడ్డి, గర్భిణుల వైద్య నిపుణురాలు తనూజ, ఎమర్జెన్సీ వైద్య నిపుణులు రమేష్ డాక్టర్ శ్రవణ్ భవాని 300 మంది రోగులను పరీక్షించారు.ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గుండారెడ్డి పోలమ్మ, బట్టు విద్యా సంస్థల చైర్మన్ బట్టు రమణా రెడ్డి, టీడీపీ మండల నాయకులు వెంగళరెడ్డి, ఆర్ఎంపీ బాలరాజు, జంకె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడలో ..

గిద్దలూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో నంద్యాలకు చెందిన శాంతిరామ్ ఆసుపత్రి వారు ఉచిత మెడికల్ వైద్యశిబిరం నిర్వహించారు. శాంతిరామ్ వైద్యులు కంటి పరీక్షలు, బీపీ, షుగర్‌తోపాటు పలు రకాల ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, మాజీ సర్పంచ్ బోదనబోయిన గోపా ల కృష్ణ టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, విజయరాజు, బోదనబోయిన అరుణ్ కుమార్ యాదవ్, తిరుమలయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

భూ అక్రమాలపై సమగ్ర విచారణ

జేసీ గోపాలకృష్ణ


భూ బాధితులతో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

పెద్దారవీడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తోకపల్లికి సంబంధించి ఆన్‌లైన్‌లో జరిగిన భూ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని జేసీ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జేసీని శుక్రవారం తోకపల్లి బాధితులు కలిశారు. గ్రామానికి చెందిన మేకల శంకర రావు అనే వ్యక్తి తమ భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో మార్చుకున్నారని, అందుకు మండల స్థాయి అధికారులు సహకారాలు అందించారని తెలిపారు. అక్రమాలపై పత్రికలలో కథనాలు ప్రచురించినప్పటికీ స్పందించడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ తోకపల్లి భూములకు సంబంధించి ఆన్‌లైన్ అక్రమాల విషయాన్ని సుమోటాగా తీసుకుంటామన్నారు. సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. అంతేకాక అక్రమాలకు పాల్పడిన వారిని, అందుకు సహకరించిన అధికారులను నిబంధనల మేరకు శిక్షిస్తామన్నారు. జేసీని కలిసిన వారిలో మల్లికార్జున, నరాల శ్రీనివాసులు, బిట్రా తిరుమలమ్మ, మేకల వెంకట నారాయణ, నరాల వెంకట్రావు, చింతా యోబు తదితరులు ఉన్నారు.

ఎస్‌డీసీ విచారణ

పెద్దారవీడు మండలంలో నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో అడ్డగోలు మార్చిన అంశాలపై విచారణాధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కళావతిని కలెక్టర్ రాజాబాబు నియమించారు. భూముల అడ్డగోలుగా అక్రమాలు శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు విచారించి చర్యలు తీసుకోవడానికి ఉపక్రమించారు. ఈ మేరకు ఎస్‌డీసీ కళావతి శుక్రవారం పెద్దారవీడు తహసీల్దార్ కార్యాలయంలో తోకపల్లిలో ఆన్‌లైన్‌లో మార్పులకు సంబంధించిన భూముల రికార్డులను పరిశీలించారు. భూముల మార్పిడికి సంబంధించి అధికారులు చేపట్టిన విధి విధానాలను సునిశితంగా పరిశీలిస్తున్నారు. విచారణ జరుగుతున్న సమయంలోనే జేసీ గోపాలకృష్ణ పెద్దారవీడు మీదుగా దోర్నాల వెళుతూ వారికి తగు సూచనలు ఇచ్చినట్లు సమాచారం.

బాలికల హాస్టల్‌ను పరిశీలించిన కమిషనర్

● తగుజాగ్రత్తలు తీసుకోవాలని సూచన


మాట్లాడుతున్న కమిషనర్ నారాయణరావు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో బాలికల పట్ల జాగ్రత్తలు వహించాలని మున్సిపల్ కమిషనర్ నారాయణరావు అన్నారు. స్థానిక రాజ్యలక్ష్మి కాలనీలోని సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు అందుతున్న ఆహారం, తాగునీరు, సౌకర్యాలపై సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం ఆర్వో ప్లాంటును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో నీటి నాణ్యత పరీక్షలు ఏ విధంగా చేయాలి, ఆ టెస్టుయొక్క రిజల్ట్‌ను ప్రయోగాత్మకంగా చేయించి చూపించారు. ప్రతి ఫ్లోర్‌లో డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, ఆహారం తయారు చేసే ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఎమినిటీ, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

పెద్ద దోర్నాల :విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి. దేవి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని తుమ్మల బైలు, చింతల ఆశ్రమ పాఠశాల, దోర్నాలలోని కస్తూర్బా గురుకుల ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మస్తాన్ నాయక్ డీఎస్‌వో పద్మ, సీడీపీవో లక్ష్మీబాయి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్యామ్ ప్రసన్నతాంజలి, ఎల్. అనూష, తదితరులు పాల్గొన్నారు.

జీవిత లక్ష్యాలను చేరుకోవడానికి క్రమశిక్షణ ముఖ్యం

- ఘనంగా బాలల దినోత్సవం

గిద్దలూరు టౌన్ , నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జీవిత లక్ష్యాలను చేరుకోవాలంటే క్రమశిక్షణ చాలా ముఖ్యమని మండల విద్యాశాఖాధికారి-1 అశ్వనీకుమార్ అన్నారు. మండలంలోని ముండ్లపాడులోని అమరావతి పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మం డల విద్యాశాఖాధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు జీవితంలో చదువు యొక్క గొప్పదనం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌ఐసీ అసిస్టెంట్ ఆఫీసర్ శేషు కుమారి, పాఠశాల కరస్పాండెంట్ కె.గణేష్‌యాదవ్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే కోటగడ్డవీధిలోని బీసీ బాలికల వసతి గృహంలో, పట్టణంలోని స్ప్రింగ్‌బోర్డు పాఠశాలలో, నల్లబండ బజారులోని సెయింట్ పాల్స్ ఎయిడెడ్ స్కూల్‌లో బాలల దినోత్సవాలు జరిగాయి. మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది మోడి పిచ్చయ్య, న్యాయవాది ఎం.ఎ.రైడర్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.


దేశ నాయకుల వేషధారణలో వాసవి పాఠశాల విద్యార్థులు

కంభంలో..

కంభం : బాలల బంగారు భవితకు వారధి వంటి మహోన్నత వ్యక్తి జవహర్‌లాల్ నెహ్రూ అని ఎంఈవో -1 టి. అబ్దుల్ సత్తార్ అన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక రంగా వీధి ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి ఆటపాటలతో సందడి చేశారు.

మార్కాపురంలో..

మార్కాపురం వన్‌టౌన్: భారత దేశ తొలి ప్రధాని జవహర్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో ప్రధానోపాధ్యాయులు కే.రంగయ్య, ఏవో రంజిత్ కుమార్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు జాతీయ నాయకులు వేషధారణలతో అలరించారు. సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ మస్తాన్ వలి, డైరెక్టర్ ప్రకాష్ రావులు నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెడ్డి మహిళా కళాశాలలో 10 మంది మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్ప్రింగ్‌బోర్డు పాఠశాలలో అందుకున్న బహుమతులతో విద్యార్థులు

ఏవన్ గ్లోబల్ కళాశాలలో

దేశం గర్వించ దగ్గ మహానేత నెహ్రూ అని ఏవన్ గ్లోబల్ కళాశాల చైర్మన్ డాక్టర్ షంషీర్ అలీ బేగ్ అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి ఉపవిద్యాశాఖ అధికారి మామిళ్లపల్లి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలులో..

కొమరోలు : భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను కొనసాగించాలని కొమరోలు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు


ఎర్రగొండపాలెంలో డ్రైవ్ చేస్తున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐ చౌడయ్య

ఎర్రగొండపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని సీఐ కె. అజయ్ కుమార్ అన్నారు. ఎర్రగొండపాలెంలో శుక్రవారం సాయంత్రం రహదారులను పరిశీలించారు. టూ వీలర్లు డ్రైవ్ చేస్తున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.ఎర్రగొండపాలెం టౌన్ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా రోడ్లు ఆక్రమణ చేసి దుకాణాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహన చోదకులను కోరారు. ఎర్రగొండపాలెం త్రిపురాంతకం రోడ్డు, ఎర్రగొండపాలెం మార్కాపురం రోడ్లపై ట్రాఫిక్‌ను పరిశీలించి,వాహనచోదకులకు సూచనలు చేశారు. ఎస్.ఐ పి చౌడయ్య పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

మార్కాపురం : ఎలాంటి డ్రైవింగ్ నిబంధనలు తెలియని మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వాహనాలు నడుపుతున్న మైనర్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న మైనర్లను స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. అలా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. చాలా వరకు ప్రమాదాలు డ్రైవింగ్ నిబంధనలు తెలియకపోవడంతోనే జరుగుతున్నాయన్నారు. అంతేకాక మైనర్లు వాహనాలను ఇష్టారీతిన అతివేగంతో నడుపుతున్నారన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎస్సైలు అంకమ్మ రావు, అహరోన్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ చేస్తున్న ఐదుగురు మైనర్లకు జరిమానా

పుల్లలచెరువు :మోటార్ సైకిళ్ల డ్రైవింగ్ చేస్తున్న ఐదుగురు మైనర్లను గుర్తించి వారికి 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు పుల్లలచెరువు ఎస్ఐ ఎల్.సంపత్ కుమార్ తెలిపారు.శుక్రవారం పుల్లలచెరువులో వాహనాలు తనిఖీ చేస్తుండగా 5 మంది మైనర్లను గుర్తించి వారికి రూ 5 వేల చొప్పున జరిమానా విధించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.మరోసారి మైనర్లు బండి నడుపుతూ పట్టుబడితే బండిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

రాచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం సహకారంతో గృహాలు నిర్మించుకోదలచిన అర్హులందరికీ న్యాయం చేస్తామని గిద్దలూరు గృహ నిర్మాణ శాఖ డీఈ షేక్ ఖదీర్ బాష అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజనలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని పలుగుంటిపల్లి గ్రామంలో మాట్లాడుతూ అర్హులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, సర్వే ద్వారా అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. దరఖాస్తుదారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, ఇన్‌కమ్, జాబ్ కార్డు పొజిషన్ సర్టిఫికెట్లతో ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అలా చేసుకున్న వారిని గుర్తించి మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గిద్దలూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంబవరం 33 కేవీ విద్యుత్ ఫీడర్ లైన్ నిర్వహణ, జంగిల్‌కటింగ్ కారణంగా ఈనెల 15వ తేదీ శనివారం పలుప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ బి.శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీఆర్‌కాలనీ, ముండ్లపాడు, బురుజుపల్లె, కంచుపల్లె, క్రిష్ణంశెట్టిపల్లె పరిధిలోని గ్రామాలలో గృహ, వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచే రంగనాయకస్వామి ఆలయంలో అభిషేకాలు

రాచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీ నెమలిగుండ్ల రంగ నాయకస్వామి ఆలయంలో శనివారం ఉదయం 5.30 నుంచే అభిషేకాలు జరుగుతాయని ఆలయ ఈవో ఎం. నాగయ్య తెలిపారు. అభిషేకాలు అనంతరం ఉదయం 9 గంటలకు మండపారాధన, 9.30గంటలకు కంకణధారణ, 10గంటలకు సుదర్శన హోమం ప్రారంభమవుతుందన్నారు.

రేపు బేస్తవారపేటలో ప్రజాదర్బార్

బేస్తవారపేట,నవంబరు14(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట పట్టణంలో ఈనెల 16వతేదీ ఉదయం 10 గంటలకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో విన్నవించుకోవాలని వారు తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

పెద్దదోర్నాల,నవంబరు14(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెద్ద బొమ్మలాపురం గ్రామ మాజీ సర్పంచ్ శాయపనేని ఉమా శంకర వరప్రసాద్(70) శుక్రవారం మృతి చెందారు. ఈయన 2006-11 సంవత్సరాల కాలంలో గ్రామ సర్పంచిగా పని చేశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈయనకు భార్యఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

దారి సమస్యను పరిష్కరించాలి

● ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్‌కు కాలనీవాసుల వినతి

మార్కాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఉన్న రహదారిని రైల్వేశాఖ మూసేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండలంలోని రాయవరం రైల్వే స్టేషన్ ఎదురుగా ఉండే కాలనీవాసులు శుక్రవారం ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాలుగా కాలనీవాసులకు దారి ఉండటంతో బస్సులు, చిన్నపాటి వాహనాలు తిరిగేవన్నారు. రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా కాలనీకి దక్షిణం వైపున ప్రహరీ నిర్మించిందన్నారు. కాలనీలోని 59 గృహాల ప్రజలకు రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా మారిందన్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా చుట్టూ చాలాదూరం తిరిగి పోవాల్సివస్తోందన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంలో, రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు అందించామన్నారు. అయినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కాలనీవాసుల ఇబ్బందులను తొలగించేందుకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌కె.జాకీర్, ఎస్‌కె హుసేన్, ఎస్.లక్ష్మయ్య, రసూల్, ఖాశిం తదితరులు ఉన్నారు.


ప్రజల వినతులు పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ప్రజాదర్బార్‌లో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం

● టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) ప్రజాదర్బార్‌లో తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. వృద్ధాప్య పింఛన్లు, భూసమస్యలు, రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలపై అర్జీలు అందజేశారు. కొన్ని సమస్యలను ఫోన్‌లో అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. పింఛన్లపై వచ్చిన వినతులను పరిష్కరించాలని ఎంపీడీవో ను కోరారు. ప్రజాదర్బార్‌లో దివ్యాంగుడు షేక్ మాబు సుబానీకి ట్రైసైకిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, పంచాయతీ కార్యాలయం నుంచి ట్రైసైకిల్ తెప్పించి వెంటనే దివ్యాంగునికి పంపిణీ చేశారు. ప్రజా దర్బార్‌లో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి. రామసుబ్బయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, దోర్నాల టీడీపీ అధ్యక్షుడు షేక్ మాబు, ఎర్రగొండపాలెం మండల టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

గిద్దలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు శాఖాగ్రంథాలయం ఆవరణలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సరస్వతీదేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాతాళ నాగేశ్వరస్వామి దేవస్థాన మాజీ చైర్మన్ శివపురం ఆంజనేయులు హాజరుకాగా గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కిశోర్, కార్యదర్శి ఫరూఖ్, పలుశాఖల రిటైర్డ్ ఉద్యోగులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దారవీడు : విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఏంఈవో శ్రీనివాసులు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. గ్రంథపాలకుడు వై.వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వారోత్సవాలను విజయవంతం చేయండి

రాచర్ల :గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని పశువైద్యాధికారి డి.హరిబాబు అన్నారు. రాచర్ల గ్రంథాలయంలో శుక్రవారం ఆయన 58వ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పుస్తక పఠనమే ప్రగతికి మార్గం

మార్కాపురం వన్‌టౌన్ : పుస్తక పఠనమే ప్రగతికి మార్గంఅని ఉప విద్యాశాఖ అధికారి మామిళ్లపల్లి శ్రీనివాసులు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ప్రజల భద్రత కోసమే ప్రత్యేక తనిఖీలు

● అర్బన్ సీఐ సురేష్

గిద్దలూరు టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అర్బన్ సీఐ కె.సురేష్ అన్నారు. శుక్రవారం గిద్దలూరు పట్టణంలో డాగ్‌స్క్వాడ్, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అర్బన్‌సీఐ కె.సురేష్, ఆర్ఐ డి.సురేష్ నేతృత్వంలో బృందాలు సంయుక్తంగా పట్టణంలోని కీలక ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించాయి. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, పాతాళ నాగేశ్వరస్వామి దేవాలయ పరిసరాలు, దిగువమెట్ట ప్రాంతాలలో డాగ్‌స్క్వాడ్‌ను ఉపయోగించి అనుమానాస్పద వస్తువులు, సంచులపై విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.

మధుమేహం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాచర్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధుమేహం రాకుండా బాలికలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ కమ్యూనిటీ అధికారి ఎన్. రామాంజనేయులు అన్నారు. ప్రపంచ మధుమేహ వ్యాధి దినోత్సవం సందర్భంగా రాచర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు మధుమేహంపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రత్యేక అధికారి డి. మాలకొండమ్మ, ఎంపీహెచ్ఈఓ వై. రంగనాయకులు, ఎంపీహెచ్‌ఎస్ ఎం. ప్రసాదు, హెచ్‌వీ వీరకుమారి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో అవగాహన ర్యాలీ

గిద్దలూరు : ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా గిద్దలూరులో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మధుమేహ వ్యాధి జాగ్రత్తల గురించి పలువురు వివరించారు. ఈకార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్యచంద్ర, శంకరవిజన్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నాదేళ్ల సుబ్రమణ్యంకు ప్రముఖుల నివాళి

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధినేత, పారిశ్రామిక వేత్త నాదేళ్ల పార్థివదేహాన్ని శుక్రవారం సందర్శించి, పలువురు నివాళులు అర్పించారు. స్థానిక అరవింద ఘోష్‌లోని నాదెళ్ల సుబ్రమణ్యం నివాసానికి ఆయన పార్థివదేహాన్ని శుక్రవారం తెల్లవారు జామున తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు కేపీ కొండారెడ్డి, అన్న రాంబాబు, కేపీ నాగార్జున రెడ్డి, క్రాంతి విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, రాక్‌వెల్ పాఠశాల చైర్మన్ వెన్న పోలిరెడ్డి, మాజీ కౌన్సిలర్ నారాయణ రెడ్డి, సుబ్రహ్మణ్యం పార్థివదేహానికి నివాళులు అర్పించారు. పలువురు పుర ప్రముఖులు అధికారులు, రాజకీయ, వామపక్ష, వివిధ సంఘాల నాయకులు నాదెళ్ల పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నేడు అంతిమ యాత్ర

నాదెళ్ల సుబ్రమణ్యం అంతిమ యాత్ర శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు చంద్రమౌళి తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు

- నిర్ణీతకాలంలో సమస్యలను పరిష్కరిస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి
- ప్రజాదర్బార్‌లో 149 అర్జీల స్వీకరణ


ప్రజాదర్బార్‌లో అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జవాబుదారీ పాలనే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి ప్రాంగణంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసమస్యలను పరిష్కరించే దిశగా తగిన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్టు చెప్పారు. ప్రజాదర్బార్‌లో ఇచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఆయా శాఖలకు పంపుతామన్నారు. దీంతో అధికారుల నుంచి అర్జీదారులకు బాధ్యతాయుతమైన సేవలు అందుతాయన్నారు. అర్జీదారుల సమస్య పరిష్కరించదగినదిగా లేకుంటే, ఏమార్గంలో పరిష్కారం చేసుకోవాలో తెలియ చెప్పటంతో పాటు ఎందుకు పరిష్కరించలేకపోయారో కూడా అధికారుల నుంచి జవాబుదారీ సమాధానంతో రిసీప్ట్ ఇవ్వటం జరుగుతుందన్నారు. పరిష్కారానికి వీలుకాని సమస్యపై పదేపదే ప్రభుత్వ కార్యాలయాలు, గ్రీవెన్స్ కార్యక్రమాలకు ఇచ్చే అర్జీలు తిరస్కరణకు గురవుతాయనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. అలాగే, ఇరువర్గాల మధ్య భూవివాదాలు ఏర్పడితే వాటికి సంబంధించిన ఆధారాలు ఆయా రెవెన్యూ రికార్డులను అనుసరించి మాత్రమే అధికారులు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. సంబంధిత వ్యక్తుల అభ్యంతరాలను, న్యాయపరమైన చిక్కులతో కూడిన వివాదాలను న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్ళి తద్వారా పరిష్కారం మార్గం పొందాలని సూచించారు. ప్రజాదర్బార్‌లో 149 అర్జీలు వచ్చినట్లు ఎమెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు. ఈ అర్జీలను నిర్ణీత కాలంలో పరిష్కరించటం జరుగుతుందన్నారు. ఇకనుంచి తరచూ ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తామన్నారు. ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ జయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, హౌసింగ్ డీఈ కోటిరెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ ఉమాకాంత్, కనిగిరి పామూరు సీఐలు ఖాజా వలి, శ్రీనివాసరావు, ఆరుమండలాల అధికారులు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మండలపార్టీ కన్వీనర్ పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, పార్టీ అధ్యక్షుడు కొండాకృష్ణారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, గాయం తిరుపతిరెడ్డి, బాలు ఓబులురెడ్డి, కుందురు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడుచక్రాల బండి ఇప్పించండి సారూ..

- దొంతా నారాయణ, హెచ్‌ఎంపాడు మండలం



మూడుచక్రాల బండి ఇప్పించాలని కోరుతూ హెచ్‌ఎంపాడు మండలంలోని దొంతంవారిపల్లి గ్రామానికి చెందిన దొంతా నారాయణ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి విన్నవించాడు. తాను దివ్యాంగుడిని కావటంతో నడిచేందుకు ఎంతో ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. మూడు చక్రాల బండి ఉంటే ఆదరువుగా ఉంటుందని తెలిపారు. దీంతో డాక్టర్ ఉగ్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్ళి మూడుచక్రాల బండి ఇప్పించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కన్న కొడుకులు నాభూమిని కాజేయాలని చూస్తున్నారు..

- రాయ రామలక్ష్మయ్య, వెంగపల్లి



నాకున్న ఆస్తిని కన్నబిడ్డలకు పంచినా, అవసాన దశలో తన పేర ఉంచుకున్న మరికొంత భూమిని కాజేసేందుకు కన్న కొడుకులు కుట్రపన్నారని హెచ్‌ఎంపాడు మండలంలోని వెంగపల్లి గ్రామానికి చెందిన రాయ రామలక్ష్మయ్య ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రకు ఫిర్యాదు చేశాడు. తనకు ఏడుగురు సంతానం కాగా, వారిలో నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు. వారికందరికి వివాహాలు చేసి తనకున్న 30 ఎకరాల్లో కుమారులు నలుగురితో పాటు మరో కుమార్తెకు కలిపి ఒక్కొక్కరికి ఐదు ఎకరాలు చొప్పున పంపిణీచేసినట్టు చెప్పారు. మిగతా 5 ఎకరాలు తన పేరనే ఉంచుకున్నానని తెలిపారు. అప్పటికి తన చివరి కుమార్తెకు వివాహం కాలేదని తెలిపారు. 12ఏళ్ల క్రితం తనభార్య మృతిచెందారన్నారు. నానా తంటాలు పడి కుమార్తెకు వివాహం చేసినట్లు వివరించారు. తనకు ఏ కొడుకు నుంచి ఆదరణ లేకపోవటంతో ఆకుమార్తె వద్ద ఉంటున్నట్లు వృద్ధుడు తెలిపారు. నా ఆలనాపాలనా ఆమెనే చూస్తుందని చెప్పాడు. కన్నకొడుకులు ఎవరూ పట్టించుకోకపోగా, తన పేర ఉన్న ఐదు ఎకరాలను వారికి రాసివ్వాలని ఒత్తిడి చేస్తూ మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని ప్రజాదర్బార్‌లో కన్నీరు పెట్టుకోగా ఎమ్మెల్యే సముదాయించారు. హెచ్‌ఎంపాడు మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ, తహసీల్దార్‌కు రామలక్ష్మయ్య సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ ఉగ్ర ఆదేశించారు

ఎమ్మెల్యే డాక్టర్ శివప్రసాదరెడ్డిపై కేసు నమోదు

దర్శి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిపై దర్శి పోలీసులు కేసు నమోదుచేశారు. ఆయన ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ కార్యకర్తలు, నాయకులు అనుమతి లేకుండా నిరసన ర్యాలీ చేశారు. దీంతో ఆయనతో పాటు మరో 30 మందిపై గురువారంరాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.మురళి తెలిపారు. అధికారుల అనుమతి లేకుండా ర్యాలీ, ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసినందుకు 189(2), 223,285, 127(2)సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్టు ఆయన వివరించారు.

మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరిగిన ఆదరణ


పామూరు: బీహార్ ఎన్నికల ఫలితాలపై హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

పామూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వం పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు అన్నారు. అందుకు బీహార్ అసెంబ్లీ ఫలితాలే నిదర్శనమన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశానికి మండల అధ్యక్షుడు ఉమ్మడి శ్రీను అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బీహార్ ఎన్నికల ఫలితాలను స్ఫూర్తిగా తీసుకొని పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం బీహార్ ఎన్నికల ఫలితాల పట్ల హర్షం వ్యక్తంచేస్తూ బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నరాల శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాడి వెంకటనారాయణ, కేవీ రమణయ్య, వద్దిపాటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కాగా, బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంతో కూటమి శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. శుక్రవారం స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఉప్పలపాటి హరిబాబు, బి.జయరామిరెడ్డి, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, ఉమ్మడి శ్రీను, జె.చినసుబ్బయ్య, జనసేన నాయకులు దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

దర్శి: బీహార్‌లో ఎన్డీఏ ఘనవిజయం సాధించడంతో స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం రాత్రి సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాడపాలకుల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం వద్ద స్వీట్లు పంచి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.నారాయణరెడ్డి, కాకర్ల నాగసాయి, అచ్యుత గురువర్ధన్, అమరేశ్వరరావు, శరత్, జనసేన నాయకుడు పుప్పాల పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

దొనకొండ: బీహార్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించటం హర్షనీయమని బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి రొడ్డా వెంకటరావు అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

వెలిగండ్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం, వార్తాపత్రికలు చదవడం వల్ల విజ్ఞానవంతులవుతారని గ్రంథాలయాధికారి అలా భాస్కర్ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెలిగండ్లలోని కస్తూర్బా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులతో బాలనటుడు పుష్కర్

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని బాల నటుడు పుష్కర్ అన్నారు. స్థానిక సెయింట్ మార్క్ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన బాలల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను విద్య అభ్యసిస్తూనే తండేల్, దేవర, మిరాయి లాంటి చిత్రాల్లో బాల నటుడుగా నటిస్తున్నానని తెలిపారు. అనంతరం పుష్కర్‌ను ప్రిన్సిపాల్ ఎం.జయకుమార్ ఘనంగా సన్మానించారు.

బొట్లగూడూరులో నర్సరీ ప్లాంట్ ఏర్పాటు

పామూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పామూరు మండలంలోని బొట్లగూడూరులో వనసంరక్షణ సమితి కింద నర్సరీ ఏర్పాటుచేస్తున్నట్టు డీఎఫ్‌వో వినోద్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని అడవి స్థలంలో అనువైనవైన ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించారు. వనసంరక్షణ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో ఉమమహేశ్వ రరెడ్డి, డిప్యూటీ రేంజర్ వెంకటేశ్వరరెడ్డి, సుభద్ర, బెన్ని పాల్గొన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి


వాహన చోదకులతో మాట్లాడుతున్న ఎస్ఐ కమలాకర్

ముండ్లమూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ధరించాలని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. లేకుంటే వారి వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ పి.హనుమంతరావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణదాసు, మాజీ సర్పంచ్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పామూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నర్రమారెళ్ల గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో జననీ చారిట్రబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త సహకారంతో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నర్రమారెళ్లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ఘనంగా బాలల దినోత్సవం

వీసీపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంగళాయపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు. అలాగే ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, వెంగళాయపల్లి ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

దర్శి: బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం దర్శి మండలంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా స్థానిక బీసీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు సీఐ వై.రామారావు, ఎస్ఐ ఎం.మురళీ నోట్ పుస్తకాలు, ప్యాడ్లు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. అందరూ కలిసిమెలిసి సోదరభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమాధికారి, విద్యార్థులు పాల్గొన్నారు.


వీసీపల్లిలో వెంగళాయపల్లి పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


దర్శిలో హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ప్యాడ్లు పంపిణీ చేస్తున్న సీఐ రామారావు, పాల్గొన్న ఎస్ఐ మురళీ తదితరులు

పామూరు: బాలల దినోత్సవ వేడుకలను పామూరు, సీఎస్‌పురం, కేజీబీవీ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పామూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్, ప్రిన్సిపాల్ కటకం సజన, తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌పురం కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో ఆషా, ప్రిన్సిపాల్ షేక్ రేష్మా, తదితరులు పాల్గొన్నారు. పామూరు మండలంలోని వగ్గంపల్లి అంగన్‌వాడి కేంద్రంలో, పడమటకట్టకిందపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలలదినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీఎస్‌పురం మండలంలోని అంబవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

దొనకొండ: తొలి ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా మండలంలోని పోలేపల్లి ఎస్సీ కాలనీలోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఏ.ప్రభుదాస్, సర్పంచ్ జాన్‌ప్రకాష్, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఎం.రమేష్‌లు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ వేడుకలు నిర్వహించారు.

ముండ్లమూరు: బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముండ్లమూరులోని హెచ్‌డబ్ల్యూ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ఎంఈవో- 1 షేక్ కాలేషావలి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, టాన్యా, సింగరకొండ రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాచిన పూర్ణచంద్రరరావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని పాఠశాలల్లో నెహ్రూ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏబీసీ స్కూల్‌లో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిన్నారులు పుస్తక పఠనంపై శ్రద్ధ వహించాలన్నారు. శివరాంపురంలో ఎంఈవో సుబ్బయ్య, బొద్దికూరపాడు హైస్కూల్‌లో ఎస్ఎంసీ ఛైర్మన్ శివారెడ్డి, వెలుగువారిపాలెంలో హెచ్‌ఎం పోలంరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీఏబీసీ స్కూల్‌లో టి.శ్రీనివాసరెడ్డి, కాలేషావలి తదితరులు పాల్గొన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అన్నదాన సత్రం పత్రాలు అధికారులకు అందజేత

తాళ్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ట్రస్ట్‌పేరుతో సత్రాన్ని మార్పుచేసిన ఆలయకమిటీ మాజీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం శుక్రవారం ఒంగోలులో దేవదాయశాఖ అధికారులకు సత్రంకు సంబంధించిన పత్రాలు, తాళాలు అందజేశారు. 'రూ.కోటి ఆస్తికి టెండర్' శీర్షికన ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఆలయ కమిటీ తాజా మాజీ ఛైర్మన్ గురుబ్రహ్మం గుంటిగంగమ్మ ఆలయకమిటీ ఆధ్వర్యంలో దాతలు, భక్తుల నుంచి నిధులు సమకూర్చి అన్నదాన సత్రం భవనాన్ని నిర్మించారు. ఆసత్రాన్ని శ్రీగంగమ్మ అన్నదాన ట్రస్ట్ సత్రంగా మార్పుపై ప్రచురితమైన కథనంపై దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు స్పందించారు. ఇందుకుసంబంధించి ఆలయ ఈవో వాసుబాబు నివేదిక ఇచ్చారు. దేవదాయశాఖ చట్టానికి విరుద్ధంగా వ్యవహరించి, అన్నదాన సత్రాన్ని ఆలయానికి అప్పగించనందున మాజీ ఛైర్మన్ కోసనా గురుబ్రహ్మంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈవో వాసుబాబు గురువారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చేసిన తప్పును అంగీకరించిన మాజీ ఛైర్మన్ గురుబ్రహ్మం ఒంగోలులో దేవదాయశాఖ అధికారులు వాసుబాబు, ప్రసాద్‌కు దేవస్థాన సత్రం తాళాలు, సంబంధిత రికార్డులను అప్పగించారు.


దేవస్థాన సత్రం తాళాలు, రికార్డులు అందజేస్తున్న ఆలయ మాజీ ఛైర్మన్ గురుబ్రహ్మం

విజ్ఞాన బాండాగారం గ్రంథాలయాలు

- తహసీల్దార్ జయలక్ష్మి

కనిగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని తహసీల్దార్ జయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథలయంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాల పఠనం ద్వారా ఎంతో విజ్ఞానాన్ని పొందవచ్చునని చెప్పారు. గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజునే బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు షరీఫ్, జేవీవీ నాయకుడు గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమీపంలోని కొత్తూరులో ఎస్‌కేఆర్ మానసిక బధిరుల పాఠశాలలో జరిగిన బాలల దినోత్సవంలో సీఐ ఖాజావలి పాల్గొన్నారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టి ఆట వస్తువులు, విద్యాసామగ్రి బహుమతులుగా అందజేశారు. పట్టణంలోని ఐకిడ్స్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో బాలల హక్కులపై ప్రిన్సిపాల్ షరీఫ్ వివరించారు.


నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన తహసీల్దార్ జయలక్ష్మి తదితరులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పీసీపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల్లో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం, సహకార బ్యాంకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా జిల్లా సహకార బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని పీసీపల్లి, గుదేవారిపాలెం, పెదయిర్లపాడు గ్రామాల్లో శుక్రవారం కళాజాత ద్వారా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాజాత బృందంలోని కళాకారులు పాటలు, ప్రదర్శనలతో ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ పరపతి సంఘం సీఈవో బాషా, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి సాయం

పీసీపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సత్తెనపల్లి రమణయ్య కుటుంబానికి టీడీపీ, జనసేన నాయకులు ఆర్థిక సహాయం చేశారు. రమణయ్య భార్య సంపూర్ణ అనారోగ్యానికి గురై బాధపడుతోంది. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, జనసేన నాయకుడు మాదాసు రమేష్ పార్టీశ్రేణులతో కలిసి శుక్రవారం సంపూర్ణను పరామర్శించి ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు పరిమి శర్మ, నాగేంద్రబాబు, వెంకటేశ్వరరెడ్డి, చినబ్రహ్మయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

దొనకొండ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో శ్రీవిజయాంజనేయస్వామి దేవాలయంలో ధర్మకర్త బాలిరెడ్డి నేతృత్వంలో అయ్యప్పస్వామి మహ పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వినుకొండ అయ్యప్పస్వామి దేవాలయ అర్చకులు పొట్టి శ్రీనివాసరావు అయ్యప్పస్వామికి అభిషేకాలు, అర్చనలతో ప్రత్యేక పూజలు చేశారు. నరసరావుపేటకు చెందిన కుమారస్వామి భజనమండలి బృందం ఆలపించిన అయ్యప్పస్వామి భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి.

సమయపాలన పాటించకపోతే చర్యలు

పామూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య హెచ్చరించారు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి గ్రామ సచివాలయాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయాల్లో అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

దర్శి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ అఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో దర్శి మున్సిపాలిటీలోని శివరాజ్‌నగర్ ప్రాథమిక పాఠశాలకు క్యారమ్ బోర్డులు, షటిల్ బ్యాట్‌లు, స్కిప్పింగ్ తాళ్లు, తదితర ఆటవస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. ఎంఈవో కె.మాలకొండయ్య వీటిని అందజేశారు. కార్యక్రమంలో స్నేహ క్లబ్ నిర్వాహకులు ఏ.వెంకటకోటేశ్వరరావు, సీహెచ్ ఇస్సురెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి, లయన్స్‌క్లబ్ జిల్లా మార్కెటింగ్ ఛైర్మన్ కె.విద్యాసాగర్‌రెడ్డి, బి. ఆంజనేయులు, పానుగంటి సత్యనారాయణ, అంబటి గోవిందరెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు

తాళ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్రలకు పెండింగ్ జీతాలు చెల్లించాలని జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశంలో ఆదేశించినా తాళ్లూరు డిప్యూటీ ఎంపీడీవో డి.నాగమల్లేశ్వరి పట్టించుకోకపోవడంతో జిల్లాపంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. కలెక్టర్ రాజాబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో క్లాప్ మిత్రల పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఖాళీగా ఉన్న క్లాప్‌మిత్ర పోస్టులను భర్తీ చేయాలని కూడా ఆదేశించారని డీపీవో ఉత్తర్వులో పేర్కొన్నారు.

అయితే, మండలంలోని క్లాప్‌మిత్ర ల జీతాలు చెల్లించలేదు. డిప్యూటీఎంపీడీవో నాగమల్లేశ్వరి పనితీరు 23 శాతం మాత్రమే ఉన్నందున షోకాజ్ నోటీస్ జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నోటీసు అందుకున్న ఒకరోజులోపు వివరణ ఇవ్వాలని తెలిపారు. క్లాప్ మిత్రలకు జీతాలు చెల్లించని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు అందించి డీపీవో కార్యాలయానికి కాపీలు అందజేయాలని ఉత్తర్వు లో పేర్కొన్నారు. తగువివరణ, నివేదికల తరువాత డిప్యూటీ ఎంపీడీవోపై శాఖాపర చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

పెండింగ్ విద్యుత్ బకాయిలు వసూలుచేయాలి

ముండ్లమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను స్పెషల్ డ్రైవ్ వసూలుచేయాలని ఆశాఖ దర్శి డివిజన్ ఈఈ పాలగిరి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ముండ్లమూరులోని సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా వ్యవసాయ, గృహ వినియోగదారులకు సంబంధించి రెండు కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఈనెలాఖరుకు 50 శాతం మేర వసూలు చేయాలన్నారు. లేకుంటే సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ టి.చిన అంకబాబు, లైన్‌మెన్‌లు పి.ఆంజనేయులు, సోమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా వృద్ధి చెందాలి

తాళ్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న యాంత్రిక పరికరాలను ఉపయోగించుకుని రైతులు ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మహేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్కవరం రైతు సేవాకేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏవో ప్రసాదరావు, వీఏఏ భార్గవి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బి.హనుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




కర్లపాలెం కానిస్టేబుల్‌కు జూడోలో గోల్డ్‌మెడల్

బాపట్ల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఆలిండియా పోలీసు జూడో క్లస్టర్‌లో కర్లపాలెం కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర గోల్డ్‌మెడల్ సాధించారు. పెన్‌కాక్ సిలాట్ విభాగంలో జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారని.. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్ నరేంద్రను శుక్రవారం వారి కార్యాలయాల్లో అభినందించారు. 2018, 2024, 2025లో జాతీయస్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీల్లో పాల్గొని.. పెన్‌కాక్ సిలాట్ విభాగంలో మెడల్స్ సాధించినట్లు నరేంద్ర తెలిపారు. నరేంద్ర రాబోయే రోజుల్లో మంచి శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. పోలీసు విభాగంలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

ఖాతాల్లో.. రూ.కోట్లు

- బ్యాంకుల్లో మూలుగుతోన్న నగదు
- క్లెయిమ్ చేసుకునేందుకు ముందుకు రాని వైనం
- ఒక్క గుంటూరు జిల్లాకు సంబంధించే రూ.149 కోట్లు
- పల్నాడు, బాపట్ల జిల్లాల్లో లక్షల్లో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తోన్న లీడ్ బ్యాంకు అధికారులు
- ఉద్గం పోర్టల్‌లో వివరాలు చూసుకునే అవకాశం కల్పించిన ఆర్‌బీఐ

బ్యాంకు ఖాతాల్లో ఎవరూ క్లెయిమ్ చేయని ప్రజల డబ్బు రూ.కోట్లలో ఉంది. వివిధ బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు, కరెంట్ అకౌంట్లు, టర్మ్ డిపాజిట్లు వంటి ఖాతాల్లో పదేళ్లకు పైగా ఎవరూ క్లెయిమ్ చేయకుండా ఉన్న వాటిని అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లుగా పరిగణిస్తారు. అలాంటి ఖాతాల్లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ఖాతా దారులు లక్షల్లో ఉండగా.. వారికి చెందిన నగదు రూ.కోట్లలో మూలుగుతోంది. ఇలా ఒక్క గుంటూరు జిల్లా వరకు చూస్తే ఇప్పటి వరకు గుర్తించిన 7,48,948 ఖాతాల్లో రూ.149 కోట్లు ఉన్నట్లు బ్యాంకుల అధికారులు తేల్చారు. అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు, అందులోని నగదుకు సంబంధించి రిజర్వు బ్యాంకు ఆదేశాలతో ఎక్కడికక్కడ బ్యాంకులు ఆయా వివరాలను ఇటీవల ప్రకటించాయి. ఆయా ఖాతాలకు సంబంధించి లీడ్ బ్యాంకు అధికా రులు ప్రజ ల్లో అవగాహన కల్పిస్తూ వివరాలు అంద జేసి నగదు ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నారు.



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

మనలో చాలామందికి బ్యాంకుల్లో పొదుపు ఖాతా (ఎస్‌బీ), కరెంట్ ఖాతాలు లేదా టర్మ్ డిపాజిట్లు ఉంటాయి. కొంతమంది తమ ఖాతాలను రెగ్యులర్‌గా నిర్వహిస్తుంటారు. మరికొంత మంది వాటిని సరిగా నిర్వహించరు.. లేదంటే ఏదో ఒక కారణంతో మర్చిపోతారు. ఒక్కోసారి ఖాతాదారుడు లేదా డిపాజిటర్ చనిపోతే వారి వారసులకు వాటి వివరాలు తెలియక పోవచ్చు. బ్యాంకుల్లో క్లెయిమ్ చేయని డిపాజిట్లు ఏటేటా పెరిగిపోతున్నాయి. మరుగున పడిన ఖాతాలు లక్షల్లో ఉండగా.. డిపాజిట్లు రూ.కోట్లలో ఉన్నట్లు రిజర్వు బ్యాంకు ఆదేశాలతో జిల్లాల వారీగా, బ్యాంకుల వారీగా (మిగతా 6వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి

జిల్లా పరిషత్‌లో సమావేశం...

అన్‌క్లెయిమ్డ్ సొమ్ముపై అవగాహన కల్పించేందుకు లీడ్ బ్యాంకు శుక్రవారం గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు అధికంగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సీఎస్‌ఎల్ బృందం, బ్యాంకు మిత్రల సమన్వయంతో అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు తగ్గేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్బీఐ ఎల్‌డీఓ రోహిత్ అగర్వాల్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ సత్యజిత్ కటి, ఎస్‌బీఐ గుంటూరు రీజినల్ మేనేజర్ కిశోర్‌కుమార్, ఎల్ఐసీ ఏడీఎం సుజాతతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, ఇన్సూరెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతికి.. పెట్టుబడుల వరద



- రాజధానిలో 20 ఎకరాల్లో టైటాన్ ఇన్‌టెక్ సంస్థ
- సీఐఐ సదస్సులో సీఆర్‌డీఏతో పలు సంస్థల ఒప్పందాలు
- హర్షం వ్యక్తం చేస్తోన్న రాజధాని వాసులు, సీఆర్‌డీఏ వర్గాలు

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టి పరిశ్రమలు స్థాపించేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. విశాఖపట్టణంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) భాగస్వామ్య సదస్సు - 2025లో వివిధ సంస్థలు ఏపీసీఆర్‌డీఏతో ఒప్పందం చేసుకున్నాయి. బయో టెక్నాలజీ, విద్య, ఫ్యాషన్, రియల్‌ఎస్టేట్ తదితర రంగాల్లో ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టనున్నాయి. సీఐఐ సదస్సు లో తొలిరోజునే దాదాపుగా రూ.32 వేల కోట్ల పెట్టుబడులను ఏపీసీఆర్‌డీఏ ఆకర్షించింది. ఎనిమిది సంస్థలు ఒప్పందాలు చేసుకోవడంపై అటు రాజధాని వాసులు, ఇటు సీఆర్‌డీఏ వర్గాల నుంచి హర్షం వ్యక్తమౌతున్నది. మరికొన్ని సంస్థలు కూడా శనివారం వాటి పెట్టుబడులు గురించి ప్రకటించే అవకాశం (మిగతా 6వ పేజీలో)

ఒప్పందాలు చేసుకున్న సంస్థలు..

- మణిపాల్ గ్రూపు(యూట్యూబ్ మీడియా టెక్నాలజీ హబ్) రూ.15 వేల కోట్లు
- బెర్జాయ గ్రూపు(రెసిడెన్షియల్, కమర్షియల్, థీమ్ పార్కు, వేస్టు మేనేజ్‌మెంట్) రూ.8300 కోట్లు
- అమరావతి లైఫ్ సైన్సెస్(బయోటెక్ పార్కు) రూ.2 వేల కోట్లు
- మైసిటీ/మలేషియా సిటీ(సిటీ విత్ ఇన్ సిటీ) రూ.2 వేల కోట్లు
- వివెన్స్ గ్రూపు విక్టోరియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(అంతర్జాతీయ విద్యా సంస్థలు) రూ.2 వేల కోట్లు
- పెఫ్-ఫ్యాషన్ ఎంటర్‌ప్రెన్యూర్ ఫండ్ (వెంచర్ స్టూడియో అండ్ ఎకో సిస్టమ్ బిల్డర్ ఫర్ ఫ్యాషన్ లైఫ్‌స్టయిల్ రిటైల్ అండ్ మీడియా) రూ. 1200 కోట్లు
- ఏస్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్(మైస్ హబ్) రూ.1800 కోట్లు పెట్టుబడి
- ఫిరా బార్సిలోనా ఇంటర్నేషనల్ సంస్థ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్.



సమస్యలపై నిర్లక్ష్యం విడనాడాలి

- వీఆర్వోలు పనితీరు మెరుగుపరుచుకోవాలి
- కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే ఆనందబాబు హెచ్చరిక

అమృతలూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం, అలసత్వం విడనాడాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. ప్రజా సమస్యలపై శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించే వారు మాత్రమే ఇక్కడ ఉండాలని, లేకుంటే వెళ్లిపోవచ్చని తెలిపారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు రావడంతో వీఆర్వోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీఆర్వోల పనితీరును పర్యవేక్షించాలని తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబుకు సూచించారు. కార్యక్రమంలో వేమూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, ఎంపీపీ నరేంద్రకుమార్, ఎంపీడీవో మారుతీ శేషమాంబ, డిప్యూటీ ఎంపీడీవో జొన్నలగడ్డ వినయ్ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు పాల్గొన్నారు.


వీఆర్వోలను హెచ్చరిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అద్దంకి.. అభివృద్ధి

- గ్రానైట్ సరసన రెన్యువబుల్ ఎనర్జీ
- మంత్రి గొట్టిపాటి చొరవతో భారీ ప్రాజెక్టు
- వెయ్యి ఎకరాల్లో ఆర్‌ఈఎంజెడ్‌కు అనుమతి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పారిశ్రామికంగా అద్దంకి అభివృద్ధిలో దూసుకుపోనున్నది. ఇప్పటికే గ్రానైట్‌తో అంతర్జాతీయంగా అద్దంకి ఘనత పొందింది. ఈ పరిస్థితుల్లో వెయ్యి ఎకరాల్లో రెన్యువబుల్ ఎనర్జీ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (ఆర్‌ఈఎంజెడ్) కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న ఆర్‌ఈఎంజెడ్ జోన్‌కు అద్దంకి నియోజకవర్గం గమ్యస్థానంగా మారనున్నది. ఆర్‌ఈఎంజెడ్ విషయంలో కేంద్రంతో పలు మార్లు సంప్రదింపులు జరిపిన మంత్రి గొట్టిపాటి ఎట్టకేలకు దానిని సాధించడంలో సఫలీకృతులయ్యారు. సున్నితమైన భూ సేకరణ ఘట్టాన్ని ఓ కొలిక్కి తేవడానికి కూడా ఆయన ప్రణాళికాబద్ధంగా అడుగులేస్తున్నారు. రేపోమాపో పనులు ప్రారంభం కానున్నాయి. దాదాపు 6,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ జోన్ ద్వారా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. విద్యుత్ రంగంలో భారీ సంస్కరణలకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా అడుగులేస్తున్నది. ఇందులో భాగంగా సోలార్, విండ్, వాటర్, బయోమాస్, హైబ్రీడ్, బ్యాటరీ స్టోరేజీ ఇలా ఉన్న అన్ని అవకాశాలను ఒడిసి పట్టి విద్యుత్ పునరుత్పాదకత చేపట్టేదిశగా ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. ఇందుకు కావాల్సిన మెషినరీ అవసరాలకు ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ ఆర్‌ఈఎంజెడ్ ద్వారా వీటి తయారీ ఇక్కడే జరగనుంది. దీని ద్వారా స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి లభించడం తో పాటు రాష్ట్ర అవసరాలు తీరిన తర్వాత ఎగుమతులకు కూడా వీలుంది. ఈ జోన్‌కు సంతమాగులూరు, బల్లికురవ మండలాల పరిధిలోని ప్రాంతాన్ని ఎంచుకున్నారు. బల్లికురవ మండల పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, సంతమాగులూరు మండల తూర్పు కుందుర్రు రెవెన్యూల పరిధిలోని వెయ్యి ఎకరాల్లో రెన్యువబుల్ ఎనర్జీ జోన్ ఏర్పాటు కానుంది. ఇక్కడ సోలార్ ఫొటో వోల్టాయిక్ ప్లేట్లు, విద్యుత్ నిల్వలకు ఉపయోగపడే బ్యాటరీ, విండ్ టర్బయిన్లు, ఎలక్ట్రొలైజర్ల తయారీతో పాటు మరికొన్ని పునరుత్పాదక పరికరాల తయారీకి గమ్యస్థానంగా ఈ జోన్ నిలవనున్నది.


కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్‌యెస్సోనాయక్‌తో చర్చిస్తున్న మంత్రి రవికుమార్ (పాత చిత్రం)

బాలలతో పనులు చేయిస్తే చర్యలు

- బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
- సమీక్షలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్నాలుగేళ్ల లోపు బాల, బాలికలతో దుకాణాలు వాణిజ్య కేంద్రాలు, హోటళ్లు, దాబాలు, బడ్డిబంకుల్లో పనిచేయించడం నేరమని, వారితో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థా నిర్మూలన జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలకార్మిక రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను క్షేత్రస్థాయిలో గుర్తించి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

పనితీరుపై ఆగ్రహం..

టాస్క్‌ఫోర్స్ కమిటీ పనితీరుపై సమగ్ర నివేదిక లేకపోవడం ఏమిటని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. గడిచిన నెలరోజుల్లో కమిటీ పనితీరు సరిగ్గాలేదన్నారు. అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. టాస్క్‌ఫోర్స్‌కమిటీ క్షేత్రస్థాయిలో ఆకస్మిక దాడులు నిర్వహించాలన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు ప్రక్రియ వేగంగా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో 3.84 లక్షల మంది కార్మికులను నమోదు చేయించాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు కేవలం 1.83 లక్షల మంది నమోదు కావడంపై ఆరాతీశారు. ప్రతీ నెల కనీసం 10 వేలమందిని సభ్యులుగా చేర్పించడం లక్ష్యంతో అధికారులు పనిచేయాలన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భం గా గోడపత్రాలను కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ముందస్తుగానే వైద్యపరీక్షలు చేయించుకుని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 19న వ్యక్తిగత మరుగుదొడ్ల దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించారన్నారు.

పనులు లేక.. వలసలు

- నిత్యం 2 వేల మంది పయనం
- పొరుగు జిల్లాల్లో ముమ్మరంగా సాగు పనులు
- రవాణా ఖర్చులు పోను ఒక్కొక్కరికి రూ.300 గిట్టుబాటు

బల్లికురవ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పనులు దొరకడంలేదు. ఇదే సమయంలో పొరుగు జిల్లా, మండలాల్లో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బల్లికురవ, మండలంలోని పలు గ్రామాల నుంచి నిత్యం కూలీలు పెద్దసంఖ్యలో వలసబాటు పడుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న నిరుపేద కుటుంబాలకు పనులు లేకుంటే పస్తులు ఉండాల్సి వస్తోంది. దీంతో వారు రోజు కూలీ పనులు వెతుక్కొని వెళ్తున్నారు. మండలంలో ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగు అవుతున్నా సరిపడ పనులు పెద్దగా లేవు. ఏటా ఉపాధి పనులు జరిగేవి. అయితే ఈ ఏడాది ఉపాధి పనులు లేకపోవడంతో కూలీలు పల్నాడు జిల్లాలోని పలు గ్రామాలకు మిర్చి కోతలకు, పత్తి తీసేందుకు తరలిపోతున్నారు. రోజు వారీగా సరాసరిన సుమారు 30 వాహనా ల్లో 2 వేల పైచిలుకు కూలీలు వలస పోతు న్నారు. అంబడిపూడి, వల్లాపల్లి, గుంటుపల్లి, బల్లికురవ, వైదన, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, కొప్పెరపాడు, కొణిదెన, మల్లాయపాలెం, కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, ఎస్ఎల్‌గుడి పాడు, వెలమవారి పాలెం, కొణిదెన, గంగ పాలెం, ఉప్పుమాగులూరు, రాజుపాలెం తదితర గ్రామాల నుంచి కూలీలు ప్రతి రోజు ప్రత్యేక వాహనాల్లో పనులకు వెళుతు న్నారు. ఉదయం 7 గంటల సమయంలో కూలీల వాహనాలతో రోడ్లు రద్దీగా ఉంటు న్నాయి. ఒక్కో కూలీకి రవాణా చార్జీలు పోను రోజుకు రూ.300 కూలి గిట్టుబాటు అవుతుందని కూలీలు తెలిపారు.


కూలీల వాహనాలతో రద్దీగా ఉన్న బల్లికురువలోని ప్రధాన రోడ్డు



పొంచి ఉన్న ప్రమాదాలు

ఉపాధి బాట పట్టిన వలస కూలీలకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. కూలీలను తరలించే వాహనాలు పరిమితికి మించి ప్రయాణిస్తున్నాయి. ఒక్కో ఆటోలో పదుల సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. గతంలో కూలీల ఆటోలకు ప్రమాదాలు జరిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పదుల కిలోమీటర్ల మేర పనులకు వెళ్లి వస్తున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందో అని కూలీల కుటుంబ సభ్యులు ఒక వైపు ఆందోళన చెందుతున్నారు.

ఆరుతడి పంటలకే సాగునీరు

- డెల్టాలో రబీకి సంబంధించి ఆదేశాలు జారీ
- రైతులకు అవగాహన కల్పించాలని రైతు సంఘాలకు సూచన

రేపల్లె, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ సీజన్‌కు సంబంధించి ఆరుతడి పంటలకే సాగునీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రైతులు వరికి ప్రత్యామ్నాయం వేరే పంటలు సాగు చేసుకోవాలని సూచించింది. దీనిపై నీటిపారుదల శాఖ అధికారులు, సాగునీటి సలహా సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు రైతులకు అవగాహన కల్పించాలని కోరింది. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి భారీగా వరద ప్రవాహం వచ్చినందున ఖరీఫ్‌లో అటు తూర్పు, ఇటు పశ్చిమ డెల్టాలు, గుంటూరు ఛానల్, ఎన్



ఎస్‌పీకి కలిపి మొత్తంగా 222 టీఎంసీల నీరు ఇప్పటివరకు విడుదలైంది. ఖరీఫ్ సీజన్‌లో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజ్ పరిధిలో ఉన్న పంటలకు ఇంకా 208 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉన్నది. 2026 మే నెలాఖరు వరకు తాగునీటికి 20 టీఎంసీల నీరు అవసరం ఉన్నట్లు అంచనా వేశారు. ఖరీఫ్‌లోని పంటలు, తాగునీటి అవసరాలకు కలిపి 228 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. అయితే రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఇప్పటి వరకు వినియోగం పోను మరో 118 టీఎంసీలు మాత్రమే లభ్యత ఉన్నది. పులిచింతలలోని 40 టీఎంసీలను తాగునీటికి వచ్చే ఏడాది ఖరీఫ్ పంటకు ముందస్తుగా జూన్‌లో నీటి విడుదలకి వినియోగించాల్సి ఉన్నది. వీటిని పరిగణనలోకి తీసుకుని రబీలో ఆరుతడి పంటలకు మాత్రమే నీటిని విడుదల చేసే అవకాశం ఉందని కృష్ణా డెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబు తెలిపారు. ఏటా పశ్చిమ డెల్టాలో ఆరుతడి పంటలనే చాలావరకు రైతులు సాగు చేస్తారు. బాపట్లలో మాత్రం దాళ్వా కింద వరి సాగు చేస్తారు. అయితే నీటి లభ్యత సరిగా లేని కారణంగా అక్కడ కూడా ఆరుతడి పంటలే సాగు చేసుకోవడం ఉత్తమమని అధికారవర్గాలు సూచిస్తున్నాయి. డెల్టా నేలలో తేమ శాతం అధికంగా ఉంది. దీని వల్ల మూడు, నాలుగు తడులు ఇస్తే మినుము, మొక్కజొన్న, పెసర వంటి పంటలు సులభతరంగా రబీలో సాగు చేసుకునే అవకాశం ఉంది.

సహకార సమన్వయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

పర్చూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వేదికగా స్థానిక రోటరీ భవనంలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ సహకార సమన్వయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగొర్ల జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు గ్రెగోరి, కిషోర్‌బాబు, ఏపీసీసీ కార్యదర్శి గంట అంజిబాబు హాజరవుతారని తెలిపారు.

షుగర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

పంగులూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ డయాబిటీస్ దినోత్సవం శుక్రవారం పంగులూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి శివచెన్నయ్య మాట్లాడుతూ చక్కెరవ్యాధి దరి చేరకుండా విద్యార్థులు క్రీడలలో పాల్గొనడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎక్కువగా దాహంవేయడం, తరచూ మూత్రవిసర్జన, అలసట, గాయాలు నెమ్మదిగా తగ్గడం చక్కెరవ్యాధి లక్షణాలుగా వివరించారు. ప్రతిరోజూ కనీసం 30నిమిషాలు వ్యాయామం చేయడం, పండ్లు, కూరగాయాలు, తక్కువ నూనె ఉన్న పదార్థాలు ఆహారంగా తీసుకోవాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, హెచ్‌ఈ అనూరాధ, హెల్త్ విజిటర్ భానుమతి పాల్గొన్నారు.

రెన్యువల్ కోసం డాక్యుమెంట్‌లు ఇస్తే బురిడీ

కళాశాలను కుటుంబసభ్యుల పేరుతో మార్చుకున్న మీ సేవ నిర్వాహకుడు

కేసు నమోదు

అద్దంకి, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : గురు వెంకటసాయి ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బేస్తవారిపేట మండలం పి.వెంకటాపురానికి చెందిన శ్రీనివాసులు అద్దంకి మండలం తిమ్మాయపాలేనికి చెందిన మరికొందరితో కలిసి పట్టణంలో బీఎడ్ కళాశాల నిర్వహిస్తున్నాడు. కళాశాలకు సంబంధించి అనుమతులు రెన్యువల్ చేసేందుకు అవసరమైన అన్ని డాక్యుమెంట్‌లను అప్‌లోడ్ చేసేందుకు ఒంగోలులోని మీసేవ నిర్వాహకుడు మురళీకి ఇచ్చాడు. ఆ డాక్యుమెంట్‌ల ఆధారంగా కళాశాల నిర్వహణ కమిటీలో పాత పేర్లు తొలగించి తమ కుటుంబసభ్యుల పేర్లు చేర్చాడు. విషయం తెలుసుకున్న శ్రీనివాసులు శుక్రవారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయులు

వేటపాలెం(చీరాల), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఉద్యోగుల సివిల్ సర్వీసెస్ ఆటల పోటీలకు వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇరువురు ఎంపికయ్యారు. గత బుధ, గురువారాల్లో బాపట్లలో నిర్వహించిన జిల్లా క్రీడా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయురాలు జరుబుల శ్రావణీ కబడ్డీ పోటీల్లో, భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు అత్తులూరి వెంకట సుబ్బారావు చదరంగంలో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. వీరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులు వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

ఈసారి వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత

నేడు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలు

ఒంగోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈ విడత స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అంశాలను ప్రధానాంశంగా కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఒక్కొక్క అంశంపై ప్రజలను చైతన్యవంతులను చేయడం, పరిశుభ్రత కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్న విషయం విదితమే. అందులోభాగంగా ఈ శనివారం వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అంశంపై కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రధానంగా బహిరంగ ప్రదేశాల్లో మల, మూత్ర విసర్జన నిషేదం, అలాగే చేతులు శుభ్రపర్చుకోవడంపై విస్తృతంగా ప్రజలకు ప్రత్యేకంగా విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అందుకోసం విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాలను విధిగా చేపట్టాలని ప్రభుత్వం మార్గదర్శకాలలో సూచించింది. ఇతరచోట్ల కూడా ఎక్కువమంది ఒకేచోట పనిచేసే ప్రదేశాల్లోనూ నిర్వహించాలని ఆదేశించారు. అందులో భాగంగా ఆయా ప్రాంతాల్లో టాయిలెట్లు పరిశుభ్రంపై దృష్టిపెట్టడం, బహిరంగ మల, మూత్ర విసర్జన అనర్థాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఈ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నారు. పలుచోట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

వాడవాడలా గ్రంథాలయ వారోత్సవాలు

చినగంజాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాలను ఎంఈవో అజయ్‌బాబు ప్రారంభించారు. నెహ్రూ జయంతిసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్యాషన్ డ్రెస్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రంథపాలకులు ఎ.మోహనలక్ష్మి నరసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో చినగంజాం, మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు వెంకటేశ్వరరావు, మల్లారెడ్డి పాల్గొన్నారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మి, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం షేక్ నాయబ్‌రసూల్‌ల ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామచంద్రానగర్ పాఠశాలలోని విద్యార్థులకు నెహ్రూ జయంతి సందర్భంగా చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 బి.అజయ్‌బాబు, చినగంజాం జడ్పీ పాఠశాల స్టాఫ్ కార్యదర్శి చిలకా కుమార్, ఎన్‌సీసీ ఉపాధ్యాయులు సుబ్బారావు, పీడీలు గంటా అంకమ్మ, కృష్ణారావు, ఉపాధ్యాయులు కోటిరెడ్డి, నాగేశ్వరరావు, రామచంద్రానగర్ పాఠశాల ఉపాధ్యాయులు నాగమల్లేశ్వరరావు, చినగంజాం క్లస్టర్ సీఆర్‌పీ సురేంద్రకుమార్ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

మార్టూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలతోపాటు బాలల దినోత్సవం కార్యక్రమం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథపాలకులు శకుంతల ఆధ్వర్యంలో పిల్లలకు జవహర్‌లాల్ నెహ్రూ జీవిత విశేషాలను తెలియచేసే పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొప్పలపూడి శ్రీనివాసరావు, పద్య కళాకారులు రామిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.


చినగంజాంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఈవో అజయ్‌బాబు

పంగులూరులో...

పంగులూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు ఆధ్వర్యంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బత్తులవారి వీధిలోని పండిట్ నెహ్రూ విగ్రహానికి ఎన్‌ఆర్‌ఐ చిలుకూరి నాగేశ్వరరావు, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల వీరనారాయణ, రాయిణి రామారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్యక్రమంలో నాగబోయిన రంగారావు, డాక్టర్ బండారుపల్లి రమేష్, రోటరీ క్లబ్ క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, షేక్ కాలేషావలి, ఐ.సుబ్బారావు, కరణం హనుమంతరావు, గుర్రం ఆంజనేయులు, వినోద్, కోటయ్య, పోతిన ప్రసాద్, ఆర్.వి.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో 10 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరిక

మార్టూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామంలో వైసీపీకి కీలకనేతలుగా వ్యవహరిస్తున్న 10 కుటుంబాల వారు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీ తీర్థంపుచ్చుకున్నాయి.పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పార్టీ కండువాలను కప్పి సగౌరవంగా పార్టీలోకి స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో తాతా శ్రీనివాసరావు, తాళ్లూరి సాంబశివరావు, తాతా సాంబశివరావు,కుంచపు నరేష్, కుంచపు వీరాంజనేయులు ఉన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోలలపూడికి చెందిన తాటి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు తాటి నాగార్జున, సర్పంచ్ మోరపాకుల సతీష్, కందిమళ్ల కొండల రావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో కోలలపూడికి చెందిన 10 మంది వైసీపీ కుటుంబాలు

ఖాతాల్లో.. రూ.కోట్లు

(5వ పేజీ తరువాయి)

అధికారులు లెక్కలు తేల్చారు. ఖాతాల్లో మూలుగుతున్న నగదును వాటి అసలు ఖాతాదారులు లేదా వారి వారసులకు అప్పగించేందుకు భారతీయ రిజర్వ్ చర్యలు చేపట్టింది. ఇందుకోసం అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్-గేట్‌వే టు యాక్సెస్ ఇన్ఫర్మేషన్ (ఉద్గమ్) పేరుతో ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ ద్వారా బ్యాంకు ఎస్‌బీ/కరెంట్ అకౌంట్ ఖాతాదారులు లేదా టర్మ్ డిపాజిటర్లు లేదా వారి వారసులు ఆ ఖాతాల్లోని మొత్తాలను క్లెయిమ్ చేసుకునే అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా లీడ్ బ్యాంకుల అధికారులు గ్రామ, గ్రామాన ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఖాతాల్లో సొమ్ము ఉండి వాటిని వెనక్కి తీసుకోని వారి కోసం జల్లెడ పడుతున్నారు. అలా అన్‌క్లెయిమ్డ్‌గా(వెనక్కి తీసుకోని) ఉన్న సొమ్ము గుంటూరు జిల్లాలోనే అక్షరాలా రూ.149 కోట్లు ఉన్నట్లు ఆర్‌బీఐ (రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా) వెల్లడించింది. జిల్లాలో 7,48,948 అన్‌క్లెయిమ్డ్ ఖాతాలు ఉన్నట్లు తెలియజేస్తుంది.అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు ఉంటే వాటిని రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలోని డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవార్నెస్ ఫండ్‌కు బదిలీ చేస్తారు. ఆ డబ్బులను తిరిగి ఇచ్చేందుకు, చట్టపరమైన వారసులను గుర్తించేందుకు ఆర్‌బీఐ వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం సెంట్రలైజ్డ్ వెబ్ పోర్టల్ https://udgam.rbi.org. in (అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్స్ గేట్ వే టూ యాక్సెస్ ఇన్ఫర్మేషన్) అందుబాటులోకి తెచ్చింది.

పదేళ్ల పాటు నిర్వహణలో లేకపోతేనే..

బ్యాంకులోని ఏదైనా ఎస్‌బీ/కరెంట్ ఖాతాను పదేళ్ల పాటు నిర్వహణ చేయకపోతే బ్యాంకులు దాన్ని ఇన్‌ఆపరేటివ్ ఖాతాగా పరిగణించి ఆ ఖాతాలోని మొత్తాన్ని ఆర్‌బీఐ నిర్వహించే డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(డీఈఏ) ఫండ్‌కు బదిలీ చేస్తాయి. గడువు దాటిన పదేళ్లలోపు వెనక్కి తీసుకోని టర్మ్ డిపాజిట్లను కూడా అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లుగా పరిగణించి డీఈఏ ఫండ్‌కు మళ్లిస్తారు. వాణిజ్య, సహకార బ్యాంకుల్లోని ఖాతాలకూ ఈ నిబంధన వర్తిస్తుంది.

నామినీలకు నగదు చెల్లింపు

బ్యాంకుల్లో సొమ్ము డిపాజిట్ చేసిన తర్వాత కొందరు హఠాత్తుగా మరణిస్తూ ఉంటారు. ఆ వివరాలు కుటుంబ సభ్యులకు చాలా సందర్భాల్లో తెలిసే అవకాశం ఉండదు. అటువంటి ఖాతాల వివరాలు తెలుసుకునేందుకు ఆర్‌బీఐ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆ పోర్టల్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేస్తే వారి పేరుతో నగదు ఎక్కడ, ఏ ఖాతాలో ఉన్నా తెలుస్తుంది. ఆ తర్వాత సంబంధిత బ్యాంకు అధికారులను కలిస్తే నామమాత్రపు డాక్యుమెంట్లు అందజేసి నగదు వెనక్కు తీసుకోవచ్చు. కొంతమంది అనేక బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నా వాటిని వినియోగించరు. ఆయా ఖాతాల్లో ఉన్న నగదు కూడా వెనక్కి తీసుకునే అవకాశం ఆర్‌బీఐ కల్పించింది.

అమరావతికి.. పెట్టుబడుల వరద

(5వ పేజీ తరువాయి)

ఉన్నట్లుగా అంచనా. ఈ నేపథ్యంలో ఒప్పందం చేసుకున్న సంస్థలు సాధ్యమైనంత త్వరగా పెట్టుబడులు పెట్టేలా చూసే బాధ్యత అటు ప్రభుత్వం, ఇటు సీఆర్‌డీఏ తీసుకోవాల్సి ఉంది. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అమరావతి రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు సీఆర్‌డీఏతో ఒప్పందం చేసుకోవడంతో వాటి నిర్మాణ దశ, పూర్తి అయిన తర్వాత వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అనుబంధంగా ఆయా సంస్థలకు ముడిసరుకులు సరఫరా చేసే సంస్థల ద్వారా కూడా ఉద్యోగాలు లభిస్తాయని అధికారవర్గాలు తెలిపాయి.

రూ.250 కోట్ల పెట్టుబడితో టైటాన్

రాజధాని అమరావతిలో మరో సంస్థ కొలువుదీరనున్నది. ముంబైకి చెందిన టైటాన్ ఇన్‌టెక్ సంస్థ ఎలక్ట్రానిక్స్ డిస్‌ప్లే తయారీ సంస్థను అమరావతి పరిధిలో ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ)తో శుక్రవారం ఒప్పందం చేసుకుంది. విద్యుత్ ఉపకరణాలకు అవసరమైన అత్యాధునిక డిస్‌ప్లే తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నది. రూ.250 కోట్ల పెట్టుబడితో 20 ఎకరాల్లో సంస్థను ఏర్పాటు చేస్తామని దక్షిణ కొరియాకు చెందిన ప్రతినిధులు తెలిపారు. ఇక్కడ మినీ, మైక్రో ఎల్‌ఈడీ బ్యాక్‌లిడ్ మాడ్యూల్స్, అడ్వాన్స్‌డ్ కంట్రోలర్లు, 2డీ/3డీ వీడియో ఇంజన్లు రూపొందిస్తారు.

మల్లన్న అంతేనా..!

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తెరపైకి వచ్చిన శ్రీశైలం అంశం!
కొనసాగుతున్న సీమ పెత్తనం..
అప్పుడు, ఇప్పుడే అదే తంతు
నాడు ప్రకాశం జిల్లాకు దూరం
నేడు మార్కాపురంలోకి వచ్చేనా?
రాజకీయానికే ప్రభుత్వం ప్రాధాన్యత

శ్రీశైలం ప్రస్తుతం నంద్యాల జిల్లా పరిధిలో ఉంది. కొత్తగా ఏర్పడుతున్న మార్కాపురం జిల్లాలోకి శ్రీశైలంను కలపాలా వద్దా అనే అంశంపై సమస్య ప్రారంభమైంది. 1956లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కర్నూలు కేంద్రంగా కొద్దికాలం కొనసాగింది. ఆ తర్వాత ప్రకాశం జిల్లా ఏర్పాటు సమయంలోను, ఇప్పుడు మార్కాపురం జిల్లా ఏర్పాటుకాబోతున్న సమయంలోను శ్రీశైలం ప్రాంతం ఏ జిల్లాలో కొనసాగాలా అనే అంశం చర్చనీయాంశంగా మారింది. కర్నూలు నుంచి హైదరాబాద్ రాష్ట్ర రాజధానిగా అప్పుడు మార్పుచేయగ శ్రీశైలంతోపాటు మార్కాపురం డివిజన్ ప్రాంతమంతా కర్నూలు జిల్లాలోకి చేర్చారు. ఇంతకు ముందు కడప జిల్లాలో ఉన్న గిద్దలూరు, మార్కాపురం, దోర్నాల ప్రాంతాలు కూడా కర్నూలు జిల్లాలో ఉండటంతో శ్రీశైలం కూడా కర్నూలు జిల్లాలో చేరింది.

అప్పుడు మొండిచెయ్యే!

1970లో ప్రకాశం జిల్లా ఏర్పాటు చేశారు. ఒంగోలు కేంద్రంగా మూడు జిల్లాల్లోని ప్రాంతాలను కలిపి ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారు. అప్పుడు ఇప్పుడు కూడా దోర్నాల నుంచి అటు హైదరాబాద్ ప్రాంతానికి వెళ్లేందుకు అనుకూలమైన రవాణా మార్గాలు శ్రీశైలానికి ఉన్నాయి. ప్రకాశం జిల్లా ఏర్పడే సమయంలో కర్నూలు జిల్లాలో ఉన్న గిద్దలూరు, మార్కాపురం, దోర్నాల ప్రాంతాల మొత్తాన్ని ప్రకాశం జిల్లాలోకి చేర్చారు. దోర్నాల నుంచి రవాణా మార్గమున్న శ్రీశైలం పుణ్యక్షేత్ర ప్రాంతంను మాత్రమే కర్నూలు జిల్లాలో ఉంచి మిగిలిన ప్రాంతాన్ని కొత్తగా ఏర్పడిన ప్రకాశం జిల్లాలో చేర్చారు. అప్పట్లో కర్నూలు జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న గిద్దలూరు, మార్కాపురం ప్రాంతాల్లో ఉన్న రాజకీయ ప్రముఖుల అభిప్రాయాలను తోసిపుచ్చి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న రాజకీయ నాయకుల ప్రభావానికి అనుగుణంగా ప్రస్తుతం మార్కాపురం డివిజన్ మొత్తాన్ని దోర్నాల ప్రాంతంతో సహా ప్రకాశం జిల్లాలో చేర్చి శ్రీశైలం ప్రాంతంను మాత్రం కర్నూల్ జిల్లాలో ఉంచారు.

శిఖరం వరకు ప్రకాశమే..

కర్నూలు జిల్లా నుండి శ్రీశైలం వెళ్లాలంటే ప్రకాశం జిల్లాలోని దోర్నాల నుంచే వెళ్లాలి. అది తప్పించి వేరే మార్గం లేదు. వెనుకబడిన దోర్నాల ప్రాంతాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చిన అప్పటి పాలకులు శ్రీశైలం ప్రాంతాన్ని మాత్రం కర్నూలు జిల్లాలో ఉంచారు. అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక బాధ్యతల్లో ఉన్న ప్రముఖుల సూచనలకు అనుగుణంగానే ఆ మార్పు చేశారు. శ్రీశైలం సమీపంలో ఉన్న శిఖరం ముందుభాగం వరకు ప్రకాశం జిల్లాలో కలిపి శ్రీశైలం దేవస్థానం ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలో ఉంచటం గమనార్హం. రాయలసీమలో కీలకమైన కర్నూలు జిల్లాలో పెత్తనం చేస్తున్న నేతల సూచనలకు అనుగుణంగానే వ్యవహారం సాగింది. ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో మార్కాపురం డివిజన్ ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. 1970 తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చీలిక ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు నేపథ్యంలో కొత్త జిల్లాల అంశం తెరపైకి రాలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2022లో అప్పటి వైఎస్ జగన్ సారథ్యంలోని వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పుడు మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేయాలనే అంశం తెరపైకి వచ్చింది. అయితే జగన్ ప్రభుత్వం ఆ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోకుండా అప్పటి మార్కాపురం డివిజన్‌ను ఒంగోలు కేంద్రంగా ఉన్న ప్రకాశం జిల్లాలోనే కొనసాగించింది.

నూతన జిల్లా ఏర్పాటుకు సిద్ధం

మార్కాపురం కేంద్రంగా జిల్లా కోసం ఉద్యమించిన ఉద్యమకారులు శ్రీశైలం అంశంను పక్కన పెట్టి ఆందోళన చేశారు. జగన్ ప్రభుత్వం వారి ఆందోళనలను ఏమాత్రం పట్టించుకోలేదు. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాలను ప్రత్యేక జిల్లా చేశారు. తదనుగుణంగా శ్రీశైలంను నంద్యాల జిల్లాలోకి చేర్చారు. నాటి ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలకు ఆ నిర్ణయం సమంజసంగానే అనిపించటంతో నంద్యాలలో శ్రీశైలం ఉండటాన్ని స్వాగతించారు. మార్కాపురం జిల్లా ఏర్పాటును జగన్ ప్రభుత్వం తోసిపుచ్చినా అటు శ్రీశైలం వాసులు కానీ ఇటు మార్కాపురం వాసులు కానీ శ్రీశైలం కర్నూలులో ఉన్నా నంద్యాలలో ఉన్నా ఏంటి అని పట్టించుకోలేదు. దీంతో శ్రీశైలం ప్రాంతం అంశం పక్కనపెట్టి మార్కాపురం జిల్లా లక్ష్యంగా ప్రజలు తమ వాదనలు వినిపించారు. గత ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు కొత్త జిల్లా అంశాన్ని పరిగణనలోకి తీసుకొని తమ పార్టీ అధికారంలోకి వస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేస్తామంటూ హామీల వర్షం కురిపించారు. అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తన పుట్టినరోజున మార్కాపురం ప్రాంతంలో పర్యటిస్తూ మార్కాపురం జిల్లా ఏర్పాటుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. తదనుగుణంగా అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర సమయంలోనే నాటి హామీ అమలుకు ప్రభుత్వం శ్రీకారం పలికింది. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు.

అనూహ్యంగా ప్రచారంలోకి శ్రీశైలం

ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రప్రభుత్వం ముందడుగు వేయటాన్ని ఆ ప్రాంత ప్రజానీకం పూర్తిగా స్వాగతించింది. తదనంతరం రాజకీయాలకతీతంగా సాధారణ ప్రజానీకం శ్రీశైలం ప్రాంతం అంశాన్ని తెరపైకి తెచ్చారు. నిజానికి ఏ రకంగా చూసినా శ్రీశైలం ప్రాంతం మార్కాపురం డివిజన్‌లో ఉండటమే ప్రజలకు ఉపయోగకరం. పూర్వం నుంచి ఈ ప్రాంతం నుంచే రాకపోకలు ఉండేవి. శ్రీశైలంలో నివాసం ఉండే వారిలో అధికం మార్కాపురం డివిజన్ వారే. అందుకు కారణం శ్రీశైలం డ్యాం నిర్మాణం సమయంలో కూలీలుగా ఈ ప్రాంతవారే పనిచేశారు. తర్వాత ఉద్యోగాలు ఇవ్వడంతో అక్కడే స్థిరపడ్డారు. కానీ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను కానీ వాస్తవానికి అనుగుణంగా ఉన్న పరిస్థితులను కానీ పాలకవర్గాలు పరిగణనలోకి తీసుకోవటం లేదు. మార్కాపురం ప్రాంతం ప్రజలు మొదటి ప్రాధాన్యతను జిల్లా ఏర్పాటుకే ఇస్తూ శ్రీశైలం అంశంపై ఆచితూచి అడుగు వేస్తున్నారు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో అలాగే అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ప్రస్తుతం శ్రీశైలం ఉన్న నంద్యాల జిల్లా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు మొత్తం పార్టీలకతీతంగా శ్రీశైలం నంద్యాల జిల్లాలోనే ఉండాలని డిమాండ్ చేస్తున్నారు. వాస్తవాలకు అనుగుణంగా ముందుకు సాగలేని పరిస్థితి ప్రభుత్వంలోని పెద్దలకు ఏర్పడింది. కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం కూడా ఈ అంశాన్ని పరిశీలించింది.

వారి ప్రభావమే అధికం

గత ఎన్నికల్లో నంద్యాల జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లోను, లోక్‌సభ స్థానంలోను టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. మార్కాపురం డివిజన్‌లోని వైపాలెం అసెంబ్లీ, చేరువలో ఉన్న దర్శి స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందగా మిగిలినచోట మాత్రం టీడీపీ వారు గెలుపొందారు. దీంతో రాష్ట్రప్రభుత్వంపై నంద్యాల జిల్లాలోని గెలుపొందిన టీడీపీ ప్రజాప్రతినిధుల ప్రభావం పనిచేస్తోంది. ఇటు మార్కాపురం జిల్లా ఏర్పాటును కోరుకునే వారు ప్రాంతాలకతీతంగా జిల్లా ఏర్పాటును సాధించాలనే లక్ష్యాన్నే ప్రథమ బాధ్యతగా పరిగణించగా, నంద్యాల జిల్లాలో ఉన్న నేతలంతా శ్రీశైలాన్ని ఆ జిల్లాలో ఉంచుకునేందుకు చూస్తున్నారు. దీంతో శ్రీశైలం విషయాన్ని తెరపైకి తెస్తే మార్కాపురం జిల్లా ఏర్పాటుకే సమస్య రావచ్చనే ఆలోచనతో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా శ్రీశైలం డిమాండ్ పక్కనపెట్టి మార్కాపురం జిల్లా ఏర్పాటుకు మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసినట్లుగా తెలిసింది. ఫలితంగా శ్రీశైలం ప్రాంతం ఏ జిల్లాలో ఉండాలనే అంశంలో సీమ ప్రాంత రాజకీయనాయకుల పెత్తనంకే ప్రాధాన్యత లభించినట్లుగా కనిపిస్తోంది.

అవీఇవీ

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయవాదులు

అద్దంకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది మార్తా శ్రీను చెప్పారు. అద్దంకి పట్టణంలోని బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులకు శుక్రవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలకార్మిక నిరోధ చట్టం, బాల్య వివాహ నిరోధ చట్టం, విద్యా హక్కు చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పోక్సో యాక్ట్‌ల గురించి అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ కౌన్సిల్ న్యాయవాదులు షేక్ మహ్మద్ రఫీ, ఎం ప్రకాష్, హెచ్‌డబ్ల్యూవో పద్మావతి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం


థాంక్యు సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముస్లింలు

అద్దంకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇమామ్‌లు, మౌజన్ ల గౌరవ వేతనాల బకాయిల చెల్లింపుల కోసం 90 కోట్ల రూపాయలు విడుదల చేయటంపై పలువురు ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తూ అద్దంకి మండలంలోని మణికేశ్వరంలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ శుక్రవారం సాయంత్రం ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, అజ్మతుల్లా, ముస్తాఫా, రహీం, బాజీ, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బిహార్‌లో ఎన్‌డీఏ గెలుపుతో బీజేపీ సంబరాలు

పంగులూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బిహార్ రాష్ట్రంలో ఎన్‌డీఏ సాధించిన ఘన విజయంతో బీజేపీ మండల మాజీ అధ్యక్షులు నరసరాజు నేతృత్వంలో శుక్రవారం బైటమంజులూరులో పార్టీ నేతలు సంబరాలు చేశారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు.

కారంచేడు ఖ్యాతిని అమెరికాలో చాటిన లేఖాజ్

జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ డైరెక్టర్‌గా నియామకం

హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు


డాక్టర్ దగ్గుబాటి లేఖాజ్‌తో కుటుంబ సభ్యులు

కారంచేడు(పర్చూరు), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా, కారంచేడుకు చెందిన డాక్టర్ దగ్గుబాటి లేఖాజ్ అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ డైరెక్టర్‌గా నియమితులై దేశప్రతిష్ఠను ఇనుమడింపజేశారు. సర్జికల్ న్యూరో అంకాలజీ విభాగంలో ఈయనకు అరుదైన గౌరవం దక్కింది. లేఖాజ్ అమెరికాలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రికార్డో కొమోటార్, డాక్టర్ మైఖేల్ ఇవాన్ వద్ద శిక్షణ పొందారు. ఇతని భార్య అనన్య న్యూజెర్సీలో ఎమర్జెన్సీ విభాగంలో డాక్టర్‌గా పనిచేస్తున్నారు. కారంచేడు గ్రామానికి చెందిన దగ్గుబాటి శ్రీనివాస్ ప్రసాద్, స్వరూపా కుటుంబం గత 27 ఏళ్ల క్రితం అమెరికాలో స్థిరపడింది. పెద్దకుమారుడైన లేఖాజ్ విశేష ప్రతిభతో అంకాలజీ సర్జికల్ విభాగంలో విశేష ప్రతిభను చూపి అమెరికాలోని ప్రముఖ యూనివర్సిటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఒక గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు ఇంతటి ఖ్యాతిని సాధించటంపై పలువురు అభినందనలు తెలిపారు.

'శింగరకొండ'కు లక్ష రూపాయల విరాళం


లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న మానికొండ నాగరాజు,శారద దంపతులు

అద్దంకి, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి మండపం నిర్మాణానికి అద్దంకికి చెందిన మానికొండ నాగరాజు, శారద దంపతులు 1,01,116 రూపాయలను ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్, ఈవో తిమ్మానాయుడులకు శుక్రవారం అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం నాగరాజు, శారద దంపతులను ఆశీర్వదించి, సత్కరించారు. ధర్మకర్తల మండలి డైరెక్టర్ పద్మజ, మానికొండ నాగేశ్వరరావు, ఆదిలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

శ్రీరేణుకమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీకశోభ


లలితా సహస్రనామం చేస్తున్న మహిళలు

పంగులూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందలూరు గ్రామంలో శుక్రవారం కార్తీకమాస శోభ సంతరించుకుంది. చిట్టాబత్తిన వంశస్తులు తమ ఇంటి ఇలవేల్పుగా భావించే వంశదేవర శ్రీరేణుకమ్మ అమ్మవారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పంగులూరుకు చెందిన అవధూతేంద్ర భక్తబృందం లలితాసహస్రనామం పఠించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మిర్చి ధర పెరగటంతో సాగుపై ఆసక్తి

ఇంకొల్లు ప్రాంతంలో పెరగనున్న విస్తీర్ణం..

ఇంకొల్లు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ఇంకొల్లు ప్రాంతంలో మిర్చి సాగు పెరగనుంది. గత నెల రోజులలో ఎండు మిర్చి ధర రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో రైతులు మిర్చి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రెండు మూడేళ్లుగా రైతులు మిర్చి పంటసాగు చేసి నష్టపోయారు. దీంతో మిర్చి సాగుకు దూరమై ప్రత్యామ్నాయంగా పొగాకు, శనగపంటలు సాగు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో ఏ పంట వేయకుండా భూములు ఖాళీగా ఉన్నాయి. అడపాదడపా మొక్కజొన్న, పత్తి సాగు చేశారు. ప్రస్తుతం మిర్చినాట్లకు రైతులు సిద్ధమయ్యారు.

నేడు చీరాలలో విద్యుత్ సేవలకు అంతరాయం

చీరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాకు పలుచోట్ల అంతరాయం ఏర్పడుతుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మూడు రోడ్లు సెంటర్, రామాపురం రోడ్డు, పాపాయిపాలెం, లక్ష్మీశ్రీనివాస్ కాలనీ, అలాగే ఉదయం 9 నుంచి 10 గంటల వరకు జాండ్రపేట, పాత చీరాల, రామకృష్ణాపురం, దేవాంగపురి, దండుబాట, హరిప్రసాద్‌నగర్, గాంధీనగర్, సాల్మన్ సెంటర్, కొత్తపాలెం, విఠల్ నగర్, ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని చెప్పారు. ఇదిలా ఉంటే ఉదయం 9 గంటల నుండి 10.30.ని వరకు సాయి కాలనీ, రామనగర్, కొత్తపేట, పేరాల ప్రాంతాల్లో సేవలకు అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

నేడు మార్టూరు మండలంలోనూ...

మార్టూరు, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : కోనంకి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఇసుకదర్శి గ్రామానికి వెళ్లే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ లైన్ వేస్తున్నందువలన శనివారం సబ్ స్టేషన్ పరిధిలోని నాలుగు గ్రామాలలో విద్యుత్ కోత ఉంటుందని ఏఈ వీరాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిలో జొన్నతాళి, చిమ్మిరిబండ, రాజుగారిపాలెం, ఇసుకదర్శి గ్రామాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు అంబడిపూడిలో కార్తీక వన సమారాధన

బల్లికురవ, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినఅంబడిపూడి గ్రామ శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా శనివారం కార్తీక వన సమారాధనలో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులు హాజరై ప్రత్యేక పూజలలో పాల్గొనాలని కోరారు.

నేడు మహారుద్రాభిషేకం

పంగులూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకూరు గ్రామంలో కొండపై గల శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి శనివారం మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు అర్చక స్వామి వెంకటేష్ తెలిపారు. స్వామివారి సన్నిధిలో శాస్త్రోక్తంగా జరిగే ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు.

మళ్లీ తుఫాన్ వస్తే భారీ నష్టం!

భారీ వర్షాలకు రాజుగారిపాలెంలో కోతకు గురైన వరద కట్ట

నేటికీ ఆ నష్టాలను పరిశీలించని అధికారులు



చెక్ డ్యాం, పొలంకట్ట మధ్య గండిపడిన ప్రదేశం



వరదనీటి ఉధృతికి ఎస్సీ కాలనీ సమీపంలో కట్టకు కోతపడిన ప్రదేశం

మార్టూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : వారం రోజులలో మరో తుఫాన్ వస్తుందన్న సమాచారంతో మండలంలోని రాజుగారిపాలెం వాసులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల బీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ కారణంగా మండలంలోని రాజుగారిపాలెంలో నష్టం జరిగింది. వరదనీరు ఉధృతికి వరదకట్ట తెగిపోయింది. ఆ సమయంలో ఎస్సీ కాలనీలోకి వరద నీరు వస్తుందని భయంతో కాలనీ వాసులు వణికిపోయారు. అనూహ్యంగా వరదనీరు తగ్గడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. అప్పుడు భారీ వర్షాలకు మార్టూరు నుంచి రాజుగారిపాలేనికి వెళ్లే రోడ్డులో తూముల చప్టాపై ఐదు అడుగులపైనే వరదనీరు పారింది. ఈ కారణంతో వాగు ఎగువన ఉన్న చెక్ డ్యాం గోడపడిపోయింది. అంతేగాకుండా చెక్ డ్యాంకు, సమీపంలోని పొలంగట్టుకు మధ్య సుమారు 20 అడుగుల వరకు మట్టి కోతకు గురయ్యింది. చెక్ డ్యాం కొంతమేర కుంగిపోయింది. ఇంకా రాజుగారిపాలెం నుంచి జొన్నతాళి వెళ్లే తారురోడ్డు కోతకు గురయ్యింది. అన్నింటికన్న ముఖ్యమైన విషయం వరదనీరు కారణంగా గ్రామం చుట్టూ ఏర్పాటు చేసిన వరద కట్టకు సుమారు 50 అడుగులు మేర కోతకు గురయ్యింది. మరో 24 గంటలు వరదనీటి ప్రవాహం కొనసాగినట్లయితే, వరదకట్ట తెగిపోయి ఎస్సీ కాలనీ ముంపుబారినపడేది.

నాడు సీఎం చంద్రబాబు గ్రామ రక్షణకు రూ.25 లక్షలు మంజూరు

వాస్తవంగా 1998లో ప్రస్తుత, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజుగారిపాలెంలో పర్యటించారు. ఆ సమయంలో గ్రామానికి వాగు పొంగి వరదనీరు తరచూ చుట్టుముడుతున్నదని సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో చంద్రబాబు గ్రామం చుట్టూ వరద కట్ట నిర్మాణానికి 25 లక్షలు రూపాయలు మంజూరుచేయగా వరదకట్ట నిర్మాణం జరిగింది. మొంథా తుఫాన్ సమయంలో ఈ వరదకట్టకు 50 అడుగులు మేర కోతపడింది. ఇంతవరకు రాజుగారిపాలెంలో జరిగిన నష్టాన్ని అధికారులు పరిశీలించలేదు.

మరో వారం రోజులలో మరో తుఫాన్ రానున్నదని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో మరింత నష్టం జరిగే అవకాశం ఉంటుందని గ్రామస్థులు అంటున్నారు. మరి అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

కష్టపడిన ప్రతికార్యకర్తకు గుర్తింపు

టీడీపీ కమిటీల ప్రమాణస్వీకార మహోత్సవంలో షమీన్‌ఖాన్



కమిటీ సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయిస్తున్న పరిశీలకులు పఠాన్ షమీన్‌ఖాన్

పంగులూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసిన ప్రతికార్యకర్తకూ తగిన గుర్తింపు లభిస్తుందని నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పఠాన్ షమీన్‌ఖాన్ చెప్పారు. మండలంలోని ముప్పవరం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మండల, గ్రామ, క్లస్టర్ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు షమీన్‌ఖాన్ సభ్యులచేత ప్రమాణస్వీకారం చేయించారు. మండల పార్టీ అధ్యక్షుడిగా రావూరి రమేష్, తెలుగు యువత అధ్యక్షుడిగా జొన్నలగడ్డ బంగారురాజు, తెలుగుమహిళ అధ్యక్షురాలుగా గుంటుపల్లి రాధారాణి, తెలుగు రైతు అధ్యక్షుడిగా గుదిబండ్ల చినఆదిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా అద్దేపల్లి యోహాను, బీసీ సెల్ అధ్యక్షుడిగా సుబ్బయ్య, ఆయా కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, చింతల సహదేవుడు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, గొల్లపూడి అంజయ్య, శింగరకొండ, బత్తుల వెంకటరావు, పూనాటి రామాంజనేయులు, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, ఎనికపాటి శ్రీనివాసరావు, గరిమిడి జగన్, పిచ్చిరెడ్డి, కోమటి ప్రసాద్, కాటా అంజయ్య, నార్నె శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, అచ్చిరాజు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు

గతంలో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు బీపీఎస్ ద్వారా రెగ్యులరైజ్‌కు అవకాశం



అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు నిలిపేయిస్తున్న మున్సిపల్ అధికారులు

అద్దంకి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ముందస్తు అనుమతులు లేకుండా కొత్తగా ఇళ్ల నిర్మాణం చేపడితే చర్యలు తీసుకోవటంతోపాటు తొలగిస్తామని టౌన్‌ప్లానింగ్ అధికారి లక్ష్మి హెచ్చరించారు. అద్దంకి పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు పరిశీలన చేసి అప్పటికప్పుడే తొలగిస్తున్నారు. పట్టణంలోని గాజులపాలెంలో శుక్రవారం అనుమతులు లేకుండా ఇళ్ల పునాదులు వేస్తుండగా టౌన్‌ప్లానింగ్ అధికారి లక్ష్మి ఆధ్వర్యంలో వెళ్లి పనులు నిలుపుదల చేయించటంతో పాటు తొలగింపజేశారు. ముందస్తుగా కచ్చితమైన అనుమతులు తీసుకున్న తరువాతే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని ఆమె తెలిపారు. 2025 ఆగస్టు 31వ తేదీలోపు అనధికారికంగా చేపట్టిన ఇళ్లు, అదనపు అంతస్తులకు సంబంధించి బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ద్వారా క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. అద్దంకి పట్టణంలో అనధికారింగా నిర్మాణం జరిగి బీపీఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉన్న భవనాలు సుమారు 200 వరకు ఉండవచ్చని మున్సిపల్ అధికారులు అంచనా వేశారు.

లింకురోడ్లు గురించి పట్టించుకోరా?

కరెంటు సమస్యలను పరిష్కరించరా

సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



అధికారులను అడుగుతున్న ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు

మార్టూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలేల మధ్య లింకురోడ్డు వేయాలని ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోరా.. గ్రామాలలో కరెంట్ తీగలు కిందకు వేలాడుతున్నా సరి చేయరా, శిథిలమైన స్తంభాలను తొలగించరా అంటూ బొబ్బేపల్లి ఎంపీటీసీ సభ్యుడు దండా హరిబాబు, కోలలపూడి సర్పంచ్ సతీష్ కుమార్ అధికారులను నిలదీశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో 2026-27 సంవత్సరం బడ్జెట్ ఆమోదానికి మండలంలోని ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి ఎంపీపీ భుక్యా శాంతిబాయి అధ్యక్షత వహించారు. గ్రామాలలో విద్యుత్ సమస్యలను అధికారులు పట్టించుకోడంలేదని పలువురు ప్రజాప్రతినిదులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వలపర్ల గ్రామంలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేస్తున్నారని, ఈ సమయంలో లైట్లు పగిలిపోతున్నాయని, స్తంభం కింద భూమిలో ఉన్న మంచినీటి పైపు లైన్లు ధ్వంసం అవుతున్నాయని, ముందుగా గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకువస్తే జాగ్రత్తలు తీసుకుంటామని సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య కోరారు. ఏవో రాంబాబు బడ్జెట్‌ను చదివి వినిపించగా ఆమోదించారు. సమావేశంలో తహసీల్దారు ప్రశాంతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈవో వస్రాం నాయక్, వ్యవసాయఅధికారి లావణ్య, ఉద్యానశాఖ అధికారి హనుమంత్ నాయక్, సీడీపీవో సుభద్ర, ఏపీవో లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ రాహుల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అందించటం అభినందనీయం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు, ఈవో శైలేంద్ర కుమార్

అద్దంకి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని ఎంఈవో శ్రీనివాసరావు చెప్పారు. అద్దంకి పట్టణంలోని కాకాని కుంట నిర్వహణకు సంబంధించి 11 ఎకరాల భూమి ఉండగా కౌలు ద్వారా వచ్చే మొత్తంలో 62 వేల రూపాయలను అద్దంకి పట్టణంలో పలు ప్రభుత్వ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి చదువుతున్న 62 మంది విద్యార్థులకు దేవదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక భవానీసెంటర్‌లోని ఎల్ఆర్ ఎయిడెడ్ స్కూలులో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ అద్దంకి గ్రూపు దేవస్థానాల ఈవో శైలేంద్రకుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సింగు సుబ్బాయమ్మ, కాకాని అశోక్, నాగులపాడు సొసైటీ అధ్యక్షుడు ఏనుగంటి వెంకటరామయ్య(బాబు), దుర్గాభవాని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లకు మరమ్మతులు.. ప్రమాద సూచికలు

యుద్ధప్రాతిపదికన స్పందించిన హైవే అధికారులు



పర్చూరు - గుంటూరు వెళ్ళే రోడ్డులో ప్రమాదాలు జరగకుండా సూచికలతో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

పర్చూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేగ నిరోధకాల ఏర్పాటులో నిబంధనలకు తిలోదకాలిస్తూ వాహనదారుల ప్రాణాలకు ముంపు వాటిల్లే విధంగా ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా నూతన జాతీయ రహదారి వాడరేవు-పిడుగురాళ్ల 167(ఏ) రోడ్డు నిర్మాణంలో భాగంగా పర్చూరు వైజంక్షన్ సమీపంలో గుంటూరు వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన వేగ నిరోధకం అత్యంత ప్రమాదభరితంగా తయారైంది. అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురై వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ఈనేపథ్యంలో నిబధనలకు స్పీడ్ బ్రేక్ అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో హైవే అధికారులు స్పందించారు. యుద్ధప్రాతిపదికన స్పీడ్ బ్రేకర్లకు మరమ్మతులు చేయించటంతోపాటు, ప్రమాద సూచకలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అవీఇవీ

కొవ్వొత్తుల కర్మాగారంలో అగ్నిప్రమాదం

మూడు ద్విచక్ర వాహనాలు, కొంత ముడి సరుకు ఆహుతి

సమాచారం అందుకుని మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది



కొవ్వొత్తుల కర్మాగారంలో చెలరేగుతున్న మంటలు

చీరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొవ్వొత్తుల కర్మాగారంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... మున్సిపల్ పరిధిలోని బొమ్మలతోట కొవ్వొత్తుల కర్మాగారంలో శుక్రవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. స్థానికులు పరిస్థితి గ్రహించే సరికి చాలావరకు ప్రమాదం హద్దులు దాటడంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే కర్మాగారంలో కొంత ముడి సరుకు, మిషన్‌తో పాటు పక్కనే పార్కింగ్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రమాదంతో కొంతమేరకు స్థానికులు భీతిల్లారు.

లారీని వెనక నుంచి ఢీకొన్న వాహనం

డ్రైవరును కాపాడిన ఎస్ఐ, ఏఎస్ఐ



ప్రమాదానికి గురైన ఆటో

మార్టూరు, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : మధురై నుంచి గుంటూరుకు విద్యుత్ జనరేటర్‌ను తీసుకువెళుతున్న ఆటో ముందు వెళుతున్న లారీ వెనుకభాగాన్ని ఢీకొంది. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి హైవేపై మండల పరిదిలో యలవర్తి కోల్డ్ స్టోరేజీ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదం జరగగానే ముందు లారీ వెళ్లిపోగా, ప్రమాదానికి కారణమైన ఆటో వాహనం డ్రైవరు సీటులోనే ఇరుక్కుపోయాడు. అర్ధరాత్రి సమయం కావడం, రోడ్డు మధ్యలైన్‌లో ప్రమాదం జరగడంతో ఎవరూ పట్టించుకోలేదు. వాహనాలు దూసుకెళ్తున్న క్రమంలో స్టేషన్‌లో విధులు ముగించుకొని చిలకలూరిపేటలోని ఇంటికి ద్విచక్రవాహనంపై వెళుతున్న ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషాలు ఆ ప్రమాదాన్ని గుర్తించారు. వెంటనే రోడ్డుపై వెళ్లే వాహనదారులను అప్రమత్తం చేస్తూ, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ఏఎస్ఐ బాషా ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. డ్రైవింగ్ సీటులోనే ఇరుక్కుపోయిన డ్రైవరును అతికష్టంమీద ఎస్ఐ సైదా వాహనం నుంచి కిందకు దించారు. గాయపడిన డ్రైవరును 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై వారు నేషనల్ హైవే అధికారులకు, హైవే మొబైల్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి ప్రమాదానికి గురైన ఆటోను రోడ్డు పక్కకు తరలించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

విశ్రాంతి ఉద్యోగి ఇంట్లో చోరీ

రూ. 10 వేలు అపహరణ

వేటపాలెం(చీరాల), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెంలో ఓ విశ్రాంతి ఉద్యోగి ఇంట్లో గురువారం రాత్రి చోరీ చోటుచేసుకుంది. ఆయన కొద్ది రోజుల క్రితం నాయుడు పేటలోని బంధువుల వద్దకు వెళ్లారు. తిరిగి శుక్రవారం వచ్చి చూసేసరికి ఇంటి పరిసరాలు అనుమానాస్పదంగా కనిపించాయి. పరిశీలించగా తాళాలు పగలకొట్టి రూ.10 వేలు అపహరించినట్లు గుర్తించాడు. ఈ మేరకు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడిన రెండు ఇసుక ట్రాక్టర్లు

వేటపాలెం(చీరాల), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు గురువారం రాత్రి వేటపాలెం పోలీసులకు పట్టుబడ్డాయి. పందిళ్లపల్లి నుంచి వేటపాలెం వైపు వెళుతున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ఇరువురి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.

పర్యాటకం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం తీరంలో పలు పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే కొండయ్య



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. శుక్రవారం తీర ప్రాంతాలైన రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం, కఠారిపాలెం ప్రాంతాల్లో సుమారు రూ.30 లక్షలతో పర్యాటకులకు స్నానాల గదులు, మరుగుదొడ్లుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తులు అడ్డుడిన సమయస్ఫూర్తితో ఎదుర్కొని పరిష్కారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇతర ప్రాంతాలకు మిన్నగా బీచ్ అభివృద్ధి జరుగుతుందని హామీ ఇచ్చారు. అలాగే కోర్టు ప్రాంగణంలో నిర్మించనున్న బార్ కౌన్సిల్ హాల్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నక్కల నాగరాజు, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పాల్గొన్నారు.

పుస్తకపఠన శక్తి ప్రపంచాన్ని జయిస్తుంది



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

అద్దంకి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠన శక్తి ప్రపంచాన్ని జయిస్తుందని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల తెలుగు లెక్చరర్ డాక్టర్ ఆనంద్ చెప్పారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక బంగ్లా రోడ్డులోని గ్రంథాలయం వద్ద విద్యార్థుల చేత జాతీయ జెండా ఆవిష్కరణ చేయించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మరో గ్రంథాలయ ఉద్యమం రాష్ట్ర శాఖ సభ్యులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో గ్రంథాల య ఉద్యమం స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రంథాలయం అధికారి వసుంధరా దేవి, జ్యోతి చంద్రమౌళి, గాడేపల్లి దివాకర్‌దత్, బుజ్జిబాబు, సుగుణరావు, రమేష్‌గాంధీ, శశిధర్ పాల్గొన్నారు.



ఉత్సాహం

మనుబోలు బాలికల ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

భారత మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులతో కేకులు కట్ చేయించి, అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆటపాటలతో బాలలు అలరించారు. వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు.

25న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 25న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సీఈవో శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రణాళిక, ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలకు సంబంధించి స్థాయీ సంఘ సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకు జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి స్థాయీ సంఘ స్టాండింగ్ కమిటీ చైర్మన్లు, సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.



రండి బాబు రండి!

కిలో మటన్ రూ.500లే

సాధారణంగా కిలో మటన్ వెయ్యి రూపాయలు. ప్రాంతాలను బట్టి ఈ ధరలో మార్పు ఉంటుంది. అయితే, నెల్లూరులోని బీవీ నగర్ ప్రాంతంలో శుక్రవారం రూ.500లకే కిలో మటన్ ఇస్తున్నారని తెలియడంతో జనం ఎగబడ్డారు. క్యూలో నిలబడి మరీ మటన్ కొనుగోలు చేశారు. ఇంత తక్కువ ధరకు ఎందుకు ఇస్తున్నారని ఆరా తీస్తే సదరు దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా వ్యాపారి ఈ బంపర్ ఆఫర్ ఇచ్చాడని తెలిసింది. ఏదైతేనేం... సగానికి సగం ధరకే కిలో మటన్ దొరకడంతో ప్రజలు మాత్రం ఎగబడ్డారు. కొసమెరుపు ఏమిటంటే గొడవలు జరగకుండా ఓ కానిస్టేబుల్ పహారా కాయడమే.

సోమశిల జలాశయం నీటిమట్టం

అనంతసాగరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి శుక్రవా రం ఎగువ ప్రాంతాల నుంచి 6,828 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. ఇక డ్యాంలో 72.710 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

● **రాపూరు :** కండలేరు డ్యాంలో 58.24 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమశిల నుంచి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 800 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు.



నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్

- రేపటి నుంచి అందుబాటులోకి..
- 7 ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ
- ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్, అండర్‌బ్రిడ్జిలకు మరమ్మతులు
- 45 రోజులపాటు మూత
- ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోండి
- కార్పొరేషన్ కమిషనర్ నందన్

- వివరాలు 8లో..



అధికారుల

నిర్లక్ష్యం

సోమశిల ఉత్తర కాలువకు ముప్పు

- వివరాలు 8లో..

‘మీ సేవ’లన్నీ ఇక సీఎస్‌సీలోనే!

వివిధ ధ్రువపత్రాలు, సేవల కోసం ఇప్పటి దాకా మీసేవా కేంద్రాలు, సచివాలయాలను ఆశ్రయిస్తున్నాం. ఇకపై ఈ సేవలన్నీ ఒకేచోట అందించడానికి నగరం, పట్టణ ప్రాంతాలలో కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. మహిళలకు ఉపాధి చూపడంతోపాటు వారికి ఆర్థిక తోడ్పాటు అందించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రైల్వే, బస్సు, విమాన టికెట్ల బుకింగ్, ఫోన్, కరెంటు బిల్లుల చెల్లింపులు, పోస్టల్, బ్యాంకింగ్ సేవలు, పాస్‌పోర్టు స్లాట్ బుకింగ్, వివిధ ధ్రువపత్రాల అందజేత తదితర 712 సేవలు ఈ సెంటర్ల ద్వారా ప్రజలకు అందనున్నాయి.



- మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో 315 కేంద్రాలు
- కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఏర్పాటు
- పొదుపు మహిళల ఆర్థిక స్వావలంబనకే..

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని మెప్మా పరిధిలో ఉన్న నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల పరిధిలో 315 కామన్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. నెల్లూరులో 171, కావలిలో 64, కందుకూరులో 41, ఆత్మకూరులో 28, బుచ్చిలో 11 కేంద్రాలను ఈ నెలాఖరులోపు ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరులోని రాంనగర్‌లో ఈ నెలాఖరులోగా తొలి సీఎస్‌సీ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. మెప్మా పొదుపు సంఘంలో 10వ తరగతికి పైబడి చదివి, కంప్యూటర్‌లో పరిజ్ఞానం ఉన్న మహిళలను సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటు కోసం ఎంపిక చేశారు.



నెల్లూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కామన్ సర్వీస్ సెంటర్

● **ఒక్కో సెంటర్‌కు రూ.2.92 లక్షలు**

ఒక్కో సెంటర్‌ను రూ.2.92లక్షలతో ఏర్పాటు చేయనున్నారు. వీటిలో బంకుతో పాటు కంప్యూటర్లు, స్కానర్‌లు, బిల్లింగ్ మిషన్లు, కుర్చీలు తదితరాలు ఉంటాయి. ఇందుకు అవసరమయ్యే రుణాన్ని యూనియన్ బ్యాంకు ద్వారా ఇప్పించడానికి మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సెంటర్ల నిర్వహణ ద్వారా పొదుపు మహిళకు నెలకు రూ.10వేల నుంచి 50 వేల వరకు ఆదాయం వస్తుందని అధికారులు తెలిపారు. సర్వీస్ చార్జీ రూపంలో ఈ ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు.

సీసీఆర్‌సీలు అందేనా!?

- కౌలు రైతులకు ప్రయోజనం చేకూరేనా..
- కార్డుల పంపిణీ లక్ష్యం 38వేలు.. ఇచ్చినవి 20,451

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సొంత భూములున్న రైతులతోపాటు కౌలు రైతులకు కూడా సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు(సీసీఆర్‌సీలు)లు మంజూరు చేస్తోంది. అవగాహన లోపం కారణంగా ఎక్కువమంది కౌలురైతులకు ఇవి దక్కడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వీటి ఉపయోగాలు చెబుతున్నారు. అయినా భూయజమానులను ఒప్పించి కౌలు రైతులకు కార్డులు మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారులు వెనుకబడిపోతున్నారు.



సీసీఆర్‌సీ పత్రం

● **కార్డు వల్ల ప్రయోజనాలివే..**

సీసీఆర్‌సీ ద్వారా సాగుదారు బ్యాంకు నుంచి రూ.1.60లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా రుణం పొందవచ్చు. రుణం చెల్లింపు బాధ్యత పూర్తిగా సాగుదారుపైనే ఉంటుంది. పంట నష్టపరిహారం, పంటల బీమా పథకం, సున్నా వడ్డీ లబ్ధి, కనీస మద్ధతు ధర చెల్లిస్తూ ప్రభుత్వం వారు చేసే పంట కొనుగోళ్లకు కూడా ఉపయోగపడుతుంది. వ్యవసాయశాఖ ద్వారా అందించే పచ్చిరొట్ట విత్తనాలతోపాటు వివిధ పైర్ల విత్తనాలను రాయితీపై పొందవచ్చు. రైతుకు పెట్టుబడి సాయం అందించే అన్నదాత సుఖీభవ పథకానికి సైతం అర్హత పొందవచ్చు.

● **పంపిణీ లక్ష్యం 38వేలు**

జిల్లాకు రబీ సీజన్‌లో ఏడు లక్షల ఎకరాలకుపైగా సాగునీరు అందిస్తున్నట్లు ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో ప్రకటించారు. జిల్లాలో సుమారుగా రెండు లక్షల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈఏడాది 38వేల సీసీఆర్‌సీ ఇవ్వాలనేది వ్యవసాయశాఖ లక్ష్యం. ఇప్పటి వరకు

- మిగతా 8లో..



ఇంటర్ పరీక్షల్లో సమూల మార్పులు

- ఎంపీసీలో మ్యాథ్స్‌కు ఒకటే పరీక్ష
- బైపీసీలో జువాలజీ, బోటనీ కలిపి బయాలజీ
- ఫిజిక్స్, కెమిస్ట్రీలకు మార్కుల పెంపు

నెల్లూరు(విద్య), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ విద్యలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం ప్రధాన పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీకి 500 మార్కులు ఉండగా వీటిలో రాత పరీక్షకు 470, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15, ఫిజిక్స్ 15) 30 మార్కులు ఉంటాయి. గతంలో మ్యాథ్స్ సబ్జెక్టును రెండు పేపర్లుగా నిర్వహిస్తుండగా పేపర్-1ఏకు 75, పేపర్-1బీకి 75 మార్కులు కలిపి 150 మార్కులు ఉండేది. ఈ ఏడాది నుంచి దీనిని కుదించి మొత్తం 100 మార్కులు ఒకే పేపర్‌ను నిర్వహించనున్నారు. అలాగే ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85, ఫస్ట్, సెకండ్ లాంగ్వేజెస్‌కు 100 మార్కులు చొప్పున రెండు పరీక్ష పత్రాలు అందించనున్నారు. మ్యాథ్స్‌కు 35 పాస్ మార్కులుగా నిర్ధారించారు. అలాగే బైపీసీకి 500 మార్కులు ఉండగా ఇందులో రాత పరీక్షలకు 455 మార్కులు, ప్రాక్టికల్స్ (కెమిస్ట్రీ 15, ఫిజిక్స్ 15, బోటనీ, జువాలజీ 15) 45 మార్కులు ఉంటాయి. గతంలో బోటనీ 60 మార్కులకు, జువాలజీ 60 మార్కులుగా ఉండేవి. ఈ ఏడాది నుంచి ఈ రెండు ప్రశ్నపత్రాలను కలిపి ఒకే ప్రశ్నపత్రంగా 85 మార్కులుగా అందించనున్నారు. ఆన్సర్‌షీట్‌లు మాత్రం రెండుగా ఉండనున్నాయి. బోటనీ 43, జువాలజీ 42 మార్కులుగా ప్రశ్నలుంటాయి. దీనికి 29 మార్కులు వస్తే ఉత్తీర్ణతగా ప్రకటిస్తారు. ఫిజిక్స్ 85, కెమిస్ట్రీ 85 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఫస్ట్, సెకండ్ లాంగ్వేజ్‌లకు 100 మార్కుల చొప్పున పరీక్ష పత్రాలను అందించనున్నారు. ఈ విధానంలో ఫస్టియర్

- మిగతా 8లో..

‘నక్ష’ పరిధిలోకి ప్రభుత్వ ఆస్తులు

నెల్లూరు(సిటీ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు, భవనాలు, ఆలయాలు, ప్రధాన మార్గాలు, మేజర్ కాలువలన్నీ నక్ష ప్రాజెక్టు ద్వారా మ్యాపింగ్ చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. శుక్రవారం ఎన్‌ఎంసీలో నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులుతో మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన ఆస్తులన్నీటిని నక్షలో పొందుపరచాలని చెప్పారు. ఈ ప్రాజెక్టు పై పూర్తి అవగాహనతో వ్యవహరించాలన్నారు. అనంతరం రిత్విక్ ఎన్‌క్లేవ్, జకీర్‌హుస్సేన్‌నగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. అనంతరం పలు విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.



ఆర్టీసీ కార్మికుల పోరుబాట

- వివరాలు 7లో..

గ్రంథాలయాలకు చేరువ కావాలి

8లో

కోల్డ్ రూము నిర్మాణానికి రాయితీలు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంట కోత అనంతరం ఉత్పత్తులను కాపాడుకునేందుకు కోల్డ్ రూము నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ అందిస్తోందని ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పండ్లు, పూలు ఎక్కువ రోజుల నిల్వ ఉంచేందుకు కోల్డ్ రూంలను ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. ఒక రైతు గరిష్ఠంగా 70 మెట్రిక్ టన్నుల వరకు పరిమితి ఉన్నట్లు తెలిపారు. ఒక కోల్డ్ రూం నిర్మాణానికి మొత్తం రూ.12.5లక్షలకు రూ.4.3 నుంచి 5లక్షల వరకు రాయితీ లభిస్తుందని తెలిపారు. పండ్ల తాజాదనం, రంగు, రుచి ఆకృతిని పాడుచేయకుండా పక్వానికి రావడం కోసం రైపనింగ్ చాంబర్స్ ఉపయోగపడతాయని, ఈ నిర్మాణానికి రూ.లక్షక గాను 35శాతం రాయితీ అందుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా ఉద్యానశాఖ అధికారి, 7995086780 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.



హౌసింగ్ పీడీతో చర్చిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

పేదల ఇళ్లను నాణ్యతగా నిర్మించండి

- వారి సొంతింటి కల నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం
- హౌసింగ్ అధికారులకు నుడా చైర్మన్ ఆదేశం

నెల్లూరు (జడ్పీ), నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో పీఎంఏవై కింద నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి నుడా కార్యాలయంలో హౌసింగ్ పీడీ వేణుగోపాల్, అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. గత ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు అత్యంత నాసిరకంగా ఉన్నాయన్నారు. అధికారులు జాగ్రత్తలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. గతంలో తాము నిర్మించిన టిడ్కో ఇళ్లను నిరుపేదలకు ఇస్తే టీడీపీకి మంచిపేరు వస్తుందన్న దుర్బుద్ధితో గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వలేదని కోటంరెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ఇళ్లను నాణ్యతగా నిర్మించి, పేదలకు పదికాలాల పాటు ఇబ్బందులు లేకుండా ఉండేలా సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా హౌసింగ్ అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ వహించి, ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గత ప్రభుత్వంలో కాంట్రాక్టరు అవినీతి చేసి తిన్న ప్రతిపైసా కక్కిస్తామని, ఇందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ సమస్య సరే.. మాకేంటి!?

మహిళా పోలీసు స్టేషన్‌లో పరిస్థితి ఇదీ!

డీఎస్పీ సస్పెన్షన్‌తో రాష్ట్రవ్యాప్తంగా కలకలం

కుటుంబ వివాదాలను గోప్యంగా, సామరస్యంగా పరిష్కరించాలన్న ఉద్దేశంతో నెలకొల్పిన మహిళా పోలీసు స్టేషన్.. కొంతమంది అధికారులు, సిబ్బంది తీరుతో అభాసుపాలవుతోం ది. ఇక్కడకు ఫిర్యాదు చేసేందుకు వెళుతున్నారంటే జేబుల్లో డబ్బులు పెట్టుకొని వెళ్లాలన్నంత తీవ్ర ఆరోపణలు ఉన్నా యి. స్టేషన్‌లో ఇరు వర్గాల నుంచి అందినకాడికి పిండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఈ స్టేషన్ డీఎస్పీ సస్పెన్షన్‌కు గురవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నారని ఓ మహిళ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం, విచారణలో అది వాస్తవమని తేలడం మహిళా పోలీసు స్టేషన్‌లో పరిస్థితిని ప్రతిబింబిస్తోంది. ఏకంగా డీఎస్పీపైనే చర్యలు తీసుకోవడం పోలీసు వర్గాల్లో కలకలం రేపింది.

నెల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల సమస్యలు, భార్యాభర్తల మధ్య వివాదాలను సర్దుబాటు చేయడంలో మహిళా పోలీసు స్టేషన్ కీలక మధ్యవర్తి (కౌన్సెలింగ్ సెంటర్)గా ఉంటుంది. అక్కడ సిబ్బందిని నియమించే విషయంలోనూ ఉన్నతాధికారులు గతంలో సునితంగా పరిశీలించేవారు. పోలీసు అధికారుల గత ట్రాక్ రికార్డును పరిశీలించడంతో పాటు స్కిల్స్‌ను పరీక్షించాకనే ఈ స్టేషన్‌కు విధులు కేటాయించేవారు. ఇక్కడ పనిచేసే అధికారులు, సిబ్బందికి వారి జీతంతపాటు మరో 30 శాతం అదనంగా వేతనం లభిస్తుంది. అయితే ఇటీవల కాలంలో వివాదాస్పద అధికారులు, సిబ్బందే మహిళా పోలీసు స్టేషన్‌కు ఎక్కువగా వస్తున్నారు. అదనపు జీతంతోపాటు పైఆదాయం వస్తుండటం, అదే సమయంలో ఒత్తిడి లేని ఉద్యోగం కావడంతో రాజకీయ సిఫార్సు ఉన్న వారు ఇక్కడ తిష్ఠ వేస్తున్నారు. ఇక్కడ ఏం జరుగుతోంది? కేసుల పరిష్కారం ఎలా ఉంది? బాధితులకు న్యాయం జరుగుతుంది.? అన్నది ఇటీవల కాలంలో ఉన్నతాధికారులు కూడా పట్టించుకోకపోతుండటం కూడా అవినీతిపరులకు కలిసొస్తోంది.





● **అంతర్గత వివాదాలు!**

మహిళా పోలీసు స్టేషన్‌కు రోజుకు సరాసరి ఐదుకుపైగా ఫిర్యాదులు అందుతుంటాయి. అయితే వాటిలో కేసులు కట్టేవి చాలా తక్కువ. సరాసరి రోజుకు ఒక ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాదు. చాలా ఫిర్యాదులు కౌన్సెలింగ్ దశలోనే ముగుస్తుంటాయి. ఈ ప్రక్రియలోనే మతలబు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ మహిళ వచ్చి తన భర్తతోపాటు వారి కుటుంబ సభ్యులపై ఫిర్యా దు చేస్తే వారందరినీ పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నారు. చివరగా ఆ పార్టీ నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. ఇక కేసు నుంచి ఒక వ్యక్తిని తప్పించాలంటే దానికీ ఇక్కడ అవకాశముందని చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన ఫ్యామిలీ కేసుల్లో అయితే ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉందన్న ప్రచారముంది. అయితే ఇవన్నీ వ్యక్తిగత సమస్యలు కావడంతో బాధితులు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. ఇదే మహిళా పోలీసు స్టేషన్‌లో పనిచేసేవారికి అవకాశంగా మారింది. వచ్చే ఫిర్యాదులను విభజించడంలో ఇటీవల వివాదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. డబ్బులొచ్చే కేసుల విషయంలో పోటీ నెలకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు సిబ్బందే డీఎస్పీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయించారన్న ప్రచారం కూడా ఉంది. జరుగుతున్న వ్యవహారాలపై విచారణ జరిపిస్తే అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	136
స్కిన్ చికెన్	244
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 600

బాలల హక్కులపై అవగాహన

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు పోకూరి కోటయ్య, సంపత్‌కుమార్, ముప్పవరపు కిషోర్‌లు మాట్లాడుతూ బాలల హక్కుల గురించి, బాల బాలికలకు భారతరాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవిజ్ఞాన సదస్సులో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో పాల్గొన్న న్యాయవాదులు, హెచ్ఎం

నీటి గుంటలు అన్యాక్రాంతం!

● చెంచుగానిపాలెంలో 150 ఏళ్ల చరిత్ర కనుమరుగు ● ఒక్కో గుంట స్థలం విలువ రూ.30-50 లక్షలు ● పట్టించుకోని అధికారులు



రామాలయం ఎదురుగా ఆక్రమణలతో కుంచించుకుపోయిన గుంట

కావలిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంచుగానిపాలెంలో 150 ఏళ్ల చరిత్ర కలిగి పచ్చటి పైరులు, పక్షుల కిలకిలరాగాలతో ఊరు చుట్టూ ఆహ్లాదకరమైన నీటి గుంటలు అన్యాక్రాంతమయ్యాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ గ్రామంలో సుమారు 400 కుటుంబాలు నివశిస్తున్నారు. ఈ గ్రామం చుట్టూ పూర్వం బ్రాహ్మణులు నాలుగు గుంటలు తవ్వించి ఆ గుంటల నిండా చెరువు, వర్షాల నీటి నింపేవారు. ఆ గుంటల్లో మొలచే నీలి ఆకులను పెంచేవారని, వాటికి అనుసంధానంగా బొంతరాయి తొట్టెలు ఏర్పాటు చేసుకుని వాటిలో నీలి ఆకులు నానబెట్టి ఆయుర్వేద మందు తయారు చేసిన తరువాత ఆ నీటిని మళ్లీ గుంటలకు వదిలేవారని గ్రామస్థులు చెబుతున్నారు. మందు తయారు చేసి గ్రామ ప్రజలకు వివిధ రోగాలకు అందజేసేవారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇంతటి చరిత్ర కలిగిన బొంతరాయి తొట్టెలను 15 ఏళ్ల క్రితం ధ్వంసం చేసి గుంటల ఆక్రమణకు గ్రామంలోని కొందరు శ్రీకారం చుట్టారు. సుమారు 30 సెంట్ల నుంచి 50 సెంట్ల విస్తీర్ణం లో ఉన్న గుంటలు గ్రామంలో నివాసాలకు అనుకుని ఉన్నాయి. అక్కడ ఒక సెంటు ధర రూ.లక్ష పలుకుతుండడంతో ఒక్కో గుంట విలువ సుమారు రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు పలుకుతోంది. దీంతో ఆ గుంటలపై ఆక్రమణదారుల కన్ను పడింది. గ్రామంలోని రాములవారి గుడి ముందు ఉన్న గుంటతో పాటు ఓ వ్యక్తి పొలం పక్కన ఉన్న గుంటను చుట్టుపక్కల పొలాల వారు ఆక్రమించారు. ఇక గ్రామంలో నివాసాల మధ్యన ఉన్న గుంటను గత వైసీపీ ప్రభుత్వంలో వైద్యశాల, గ్రామ అవసరాల కోసం అంటూ ఉపాధిహామీ నిధులతో గుంటను పూడ్చివేశారు. ఇప్పుడు అదికూడా గ్రామానికి చెందిన కొందరు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లడంతో దొంగ పట్టాలు సృష్టించి ఆ స్థలం కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. మరో గుంట రోడ్డుకు అనుకుని ఉండడం, ఆ ప్రాంతంలో భూముల ధరకు రెక్కలు రావడంతో ఇటీవల ఓ రాజకీయ పార్టీ నాయకుడు ఆ గుంటను ఆక్రమించి మట్టితోలించి అమ్మకానికి పెట్టాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో ఆక్రమణ చెరలో ఉన్న గుంటల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గ్రామ అవసరాల పేరుతో పూడ్చిన గుంట స్థలం



ఇటీవల ఓ పార్టీ నేత మట్టి తోలి పూడ్చివేసిన గుంట

మా దృష్టికి రాలేదు

గ్రామానికి సమీపంలో, గ్రామంలో నీటి గుంటలు ఆక్రమిస్తున్నారన్న విషయం మా దృష్టికి రాలేదు. గుంటలకు సంబంధించిన స్థలాలను, గుంటలను పరిశీలిస్తాం. అవి ఆక్రమణలకు గురైనట్లు నిర్ధారణకు వస్తే తదుపరి చర్యలు చేపడతాం.

- శ్రావణ్ కుమార్, తహసీల్దారు

న్యూస్ బాక్స్

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

అల్లూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లిలోని బీఎంఆర్ గిరిజన కాలనీవాసులకు ఏఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచు పాటి రంజిత్ కుమార్, సీనియర్ నాయకులు పాపనబోయిన జగన్మోహన్‌రావులు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తెనాలి మురళీకృష్ణ, స్థానిక నాయకులు మక్కి గోపాల్, వీఆర్వో మల్లికార్జున, ఏఆర్‌డీ సిబ్బంది ఏడుకొండలు, అరుణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బోగోలులో గ్రంథాలయ వారోత్సవాలు

బిట్రగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : బోగోలులో 58వ జాతీయ గ్రంథాలయ వార్షికోత్సవం నిర్వాహకులు బీ.శశి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్.హెప్సిబాం ముఖ్య అతిథిగా హాజరై జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ సంస్థ జన విజ్ఞానానికి ఆలయం వంటిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయులు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శంకర్‌రావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు దోమల నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాని తెలిపారు. వాటర్‌ట్యాంకులు క్లోరినేషన్ చేయించాని సూచించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు.

గోకులం షెడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

లింగసముద్రం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్లను నాణ్యతగా నిర్మించాలని ఉపాధి హామీ పథకం కందుకూరు ఏపీడీ శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం మండలంలోని విశ్వనాథపురం, వీఆర్‌కోట గ్రామాల్లో నిర్మిస్తున్న గోకులం షెడ్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులు గోకులం షెడ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయన లింగసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. త్వరగా ఈకేవైసీ పూర్తి చేయాలని, రైతులను ఉద్యాన పంటలను సాగుచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వర్మీ కంపోస్టు పిట్‌లు, ఫారం పాండ్లు లక్ష్యాల మేరకు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో షేక్ సమీర్‌బాషా, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆర్‌ఎస్‌ఆర్'లో వైజ్ఞానిక ఉత్సవ్

కావలిరూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరవరంలో ఉన్న ఆర్‌ఎస్‌ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శుక్రవారం వైజ్ఞానిక ఉత్సవ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆర్‌ఎస్‌ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మేత పోరంబోకు భూములను కాపాడండి



భూమిని పరిశీలిస్తున్న వీఆర్వో

కలిగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పెదకొండూరు రెవెన్యూ పరిధిలోని మేతపోరంబోకు భూములను పలువురు ఆక్రమించుకొని సాగుచేయడానికి ప్రయత్నిస్తున్నారని వారినుంచి ఆ భూములను కాపాడాలని మాజీ సర్పంచు, తెలుగుదేశం పార్టీ నాయకుడు మొక్కా హజరత్ బాబు శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. పశువుల మేతకోసం బీడుగా ఉన్నవాటిని ఎవరూ ఆక్రమించరాదని, గతేడాది రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇటీవల కొంతమంది వ్యక్తులు ఆ బోర్డులను తీసేసి సాగుకు సన్నాహాలు చేయడం జరిగిందన్నారు. దీంతో వీఆర్వో పెంచలయ్య సంబంధిత భూములకు వద్దకు వెళ్లి పరిశీలించారు. నివేదికను తహసీల్దారు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ మాలకొండయ్య, హజరత్‌బాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కావలి ఆర్టీసీ డిపోవద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



కందుకూరు ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల ధర్నా

కావలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం కావలి ఆర్టీసీ డిపోలో ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం డిపో మేనేజరు ఆదినారాయణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ కావలి కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకంలో వస్తున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సిబ్బంది నియామకాలను చేపట్టాలని, 1/2029 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. మహిళా ప్రయాణికులకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలని, సిబ్బందిపై ఎవరైనా దాడిచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పదోన్నతల ప్రకియను త్వరగా పూర్తి చేయాలని, ఆర్టీసీ రూట్లలో ప్రయివేట్ ట్రావెల్స్ అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. బస్సు స్టేషన్ల ప్రయివేటీకరణ విధానాలను మానుకోవాలని, విద్యుత్‌బస్సుల నిర్వహణ ఆర్టీసీలకే ఇవ్వాలని, అక్రమ సస్పెన్షన్లను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పీ.పెంచలయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు రోశయ్య, మధు, కుమార్, అబ్దుల్‌కరీమ్, రాంబాబు, సలీం తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు :** ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం కందుకూరు డిపో గ్యారేజీ వద్ద కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికసంఘం నాయకులు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, మహిళలకు స్మార్ట్‌కార్డులు ఇవ్వాలన్నారు. స్త్రీశక్తి పథకం కారణంగా 50మంది ఎక్కాల్సిన బస్సులో ఒక్కోసారి 150మంది ఎక్కుతున్నారని, అలాంటప్పుడు టికెట్లు కొట్టడంలో జరిగే చిన్న చిన్న పొరపాట్లుకు తమను బలిచేయకుండా చూడాలని కోరారు. కార్మికుల పనిభారాన్ని తగ్గించేందుకు కొత్త ఉద్యోగుల నియామకం చేపట్టాలని, డిపోలో మహిళా ఉద్యోగులకు కనీసం సౌకర్యవంతమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీ.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేఎస్ రావు, కె.నీరజ, డి.మాలకొండయ్య, ఎస్కే బాషా, ఎస్.మహేంద్ర, బీవీ.సుజాత, బాబు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహకాలు

● జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తుందని, పంట సాగు లాభసాటిగా ఉన్నందున రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎంవీ సుబ్బారెడ్డి కోరారు. మండలంలోని కొండముడుసుపాలెం రైతుసేవాకేంద్రంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు మొక్క నాటింది మొదలు పంట చేతికొచ్చేవరకు నాలుగేళ్ల పాటు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, వివిధ దశల్లో హెక్టారుకు మొత్తం రూ.71వేల రాయితీగా అందజేస్తుందని తెలిపారు. ఆయిల్‌పామ్ సాగు అధిక దిగుబడులను ఇవ్వటంతో పాటు మార్కెటింగ్‌కు కూడా ఎలాంటి ఇబ్బంది లేనందున రైతులు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఉద్యానఅధికారి బీ.జ్యోతి, ఆయిల్‌పామ్ సీడ్ కంపెనీ ఎండీ హరీష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానఅధికారి సుబ్బారెడ్డి

మత్తుకు బానిసైతే.. జీవితాలు చిత్తే !

కావలి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసలైతే యువత జీవితాలు చిత్తేనని ఇస్కపల్లి మెరైన్ ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఒట్టూరు మోడల్ స్కూల్‌లో శుక్రవారం కళాశాల విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే యువత భవితకు బంగారు బాటలు వెయ్యటం జరుగుతుందని, ప్రతి ఒక్కరు చక్కగా చదువుకుని ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. చిన్నతనంలో మత్తుకు అలవాటు పడితే జీవితాంతం మత్తుకు బానిసలుగా బతుకుతూ సమాజం లో చీదరింపులకు గురవుతారన్నారు. ఎక్కడైనా గంజాయి, మత్తుపదార్థాలు అమ్ముతున్నట్లయితే 1072 నెంబరుకు సమాచారమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిషోర్‌బాబు, జానకిరామయ్య, ప్రిన్సిపాల్ ఇందిర పాల్గొన్నారు.

● **హెల్మెట్ తప్పనిసరి**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రూరల్ సీఐ రాజేశ్వరరావు పేర్కొన్నారు. ముసునూరు జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్ఐ బాజీబాబు, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్ పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో డిసెంబరు 18 నుంచి సదస్సు

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిసెంబరు 18, 19వ తేదీలలో అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వెబినార్ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అధ్యాపకులతో కలిసి ఆయన మాట్లాడుతూ భాష - సాహిత్యము, రాజకీయ రంగాలలో నూతన ధోరణులు - విశ్లేషణ అనే అంశాలపై నిర్వహిస్తున్న వెబినార్‌లో తెలుగు, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్ విభాగాలకు చెందిన అధ్యాపకులు పరిశోధనా పత్రాలు సమర్పించవచ్చునని తెలిపారు.

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్‌పై అవగాహన

ఉలవపాడు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించి వాహనాలను నడిపి ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని ఉలవపాడు పోలీసులు శుక్రవారం ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ఎస్ఐ అంకమ్మ, పోలీసు సిబ్బంది స్థానికులతో కలిసి గ్రామంలోని వీధుల్లో హెల్మెట్ ధరించి బైక్‌పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్మెట్ ధరించి బైక్ నడుపుతున్న వారికి గులాబీ పుష్పాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. అదేవిధంగా కారులో వెళుతున్న ప్రయాణికులకు సీటు బెల్టుపై అవగాహన కల్పించి గులాబీ పుష్పాలను అందించారు. హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ఆయన సూచించారు.



వాహనదారులతో కలసి హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ అంకమ్మ, పోలీస్ సిబ్బంది

అట్టహాసంగా బాలల దినోత్సవం

కావలి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలిప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ భవనంలో శుక్రవారం బాలల దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తలసేమియా డేకేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు పాల్గొన్నారు. జూనియర్ రెడ్‌క్రాస్ అడ్వయిజర్ బెజవాడ ప్రసన్నకుమార్, కన్వీనర్లు గాదిరెడ్డి హరినాథ్, పీ.సాయికుమార్‌లు చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈకార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు డీ.రవిప్రకాష్, కే.హరినారపరెడ్డి, కలికి శ్రీహరిరెడ్డి, డాక్టర్ షాజియా, కే.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

● **కావలిరూరల్ :** కావలి మండలంలోని సర్వాయిపాలెం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు మ్యూజికల్ ఛైర్, కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్ తదితర ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● **కొండాపురం :** మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడులకు నిర్వహించారు. మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో 1,2 రవికుమార్, అనందరావులు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయిపేట దామా చిన బాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామమోహన్‌రావు జవహర్‌లాల్ నెహ్రూ గురించి వివరించారు. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.

● **కందుకూరు :** బాలల దినోత్సవాన్ని పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్‌లో బాలబాలికల నృత్యప్రదర్శనలు, ఆటపాటలతో అలరించారు. పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో, పాఠశాల పూర్వవిద్యార్థి సుబ్బారెడ్డి పాల్గొని విద్యార్థినీ విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరో ఎంఈవో నాగకుమార శర్మ, హెచ్‌ఎం సుధాకరరావు, స్కూల్‌కాంప్లెక్స్ ఛైర్మన్ షౌకతుల్లా, స్కూల్‌కమిటీ ఛైర్మన్ వేముల నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **ఉలవపాడు :** పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు చిన్నారులతో కలిసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● **వలేటివారిపాలెం :** మండలంలోని బడేవారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాచానెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు దేశనాయకుల విషధారణలో అలరించారు. పాఠశాల హెచ్‌ఎం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



కావలి : రెడ్‌క్రాస్‌లో నెహ్రూకు నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

15 రోజుల్లో కట్టడాలు తొలగించాలి

● ఆక్రమణదారులకు నోటీసులు



నోటీసు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కలిగిరి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి 167బీజీ విస్తరణలో భాగంగా కలిగిరి పట్టణంలో రోడ్డు విస్తరణకు సంబంధించి గ్రామ కంఠం భూములను ఆక్రమించుకొని కట్టడాలు చేపట్టినవారు 15 రోజుల్లోగా మార్కింగ్ చేసిన వరకు స్వచ్ఛందంగా కట్టడాలు తొలగించుకొని ప్రభుత్వానికి సహకరించాలని తహసీల్దారు మొలతాటి గిరీష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కలిగిరి రెవెన్యూ గ్రామ కంఠం సర్వే నెంబర్లు 775/1, 775/2లలో రహదారి వెంబడి భూములు 29.43 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. ఆక్రమణలో ఉన్న మొత్తం 124 మందికి ఐదు టీములుగా 10 మంది రెవెన్యూ సిబ్బంది ఈ నోటీసులు అందజేశారన్నారు. రహదారుల నిర్మాణ ఆవశ్యకత దృష్ట్యా పట్టణంలో రోడ్డు మధ్య నుంచి 50 అడుగులు వంతున రెండు వైపులా ఇటీవల మార్కింగ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, వీఆర్ఏ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బిహార్‌లో ఎన్డీఏ కూటమి విజయంపై సంబరాలు



సంబరాల్లో కావలి బీజేపీ నేతలు

కావలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో కావలిలో బీజేపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ట్రంకు రోడ్డులోని శివాజీ సెంటర్‌లో బీజేపీ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశ సమగ్రాభివృద్ధి, సుస్థిర పాలన సాధ్యమని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారనేందుకు బిహార్ ఫలితాలు నిదర్శనమన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం సేవలందిస్తున్న నితీశ్‌కుమార్ పట్ల ఆ రాష్ట్ర ప్రజలకు ఉన్న అభిమానం చెక్కు చెదరలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు అంచిపాకుల కమల, కుట్టుబోయిన బ్రహ్మానందం, పరుసు వెంకటేశ్వర్లు, బీ.మాల్యాద్రి, పాతపాటి రమణారెడ్డి, నరేంద్ర, మాధవరావు, మురళీశ్రీ, సుజి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అనివేటి మండపం నిర్మాణానికి రూ.25వేల విరాళం

కందుకూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో అనివేటి మండపం నిర్మాణం కోసం పట్టణానికి చెందిన గుర్రం వెంకటేశ్వర్లు, పద్మజ దంపతులు వారి కుమారుడు వేణుగోపాల్, సత్యవతి దంపతులు శుక్రవారం రూ.25,116 విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కొడాలి కోటేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, టెలికాంబోర్డు మెంబరు గుర్రం మాల్యాద్రి, చక్కా కేశవ, దాత వెంకటేశ్వర్లు మనవళ్లు వెంకటసాయిదత్తమోక్షిత్, వెంకటసాయిదత్త జితేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి శుక్రవారం సాయంత్రం జరిగిన అభిషేకం, పల్లకిసేవలోను వీరు పాల్గొని పూజలు నిర్వహించారు.



50 చక్రాల బండి... ఎంత పెద్దదోనండి !

సంగం మండలంలో ముంబాయి రహదారిపై శుక్రవారం 50 చక్రాల వాహనం చూపరులను ఆకట్టుకుంది. భారీ బాయిలర్ డ్రమ్మును ఈ 50 చక్రాల ట్రాలీపై తరలిస్తున్నారు. దీనిని సిమెంట్ ఫ్యాక్టరీలో వినియోగించడానికి చెన్నై నుంచి కర్ణాటకకు తీసుకెళ్తున్నట్లు డ్రైవర్ తెలిపారు. భారీ వాహనం కావడంతో హైవేపై కూడా 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతోనే వాహనాన్ని నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో 15 రోజుల క్రితం చెన్నైలో బయలుదేరినట్లు తెలిపారు.

- సంగం (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు చేరువ కావాలి

● జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు చేరువైతే, ఉన్నత విద్యతోపాటు పోటీ పరీక్షల్లో నెగ్గి, ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జేసీ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా కేంద్రం గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిలతో కలిసి జేసీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, పుస్తకాలు, గ్రంథాలయాల ఆవశ్యకత నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ వారం రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కవి సమ్మేళనం, సాహితీ చర్చలు, ఉపన్యాసాలు నిర్వహించనున్నట్లు వివరించారు. బాలికల శాస్త్రీయ నృత్యంతో ప్రారంభమైన వారోత్సవాలు మొదటి రోజు ఆహ్వానితుల సన్మానంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ చైర్మన్ డీ రామకృష్ణ, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులతో జేసీ


ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, నుడా చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, తదితరులు

నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్

● ఏడు ప్రధాన కూడళ్లలో సిగ్నలింగ్ వ్యవస్థ ● రేపటి నుంచి అమలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ఏడు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆదివారం నుంచి అందుబాటులోకి తెస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆర్ అండ్‌బీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులతో కలిసి ఆయన సమావేశమై, మాట్లాడారు. సుమారు రూ.1.50 కోట్లతో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కంట్రోల్ ప్యానెల్ వ్యవస్థను అనుసంధానించే కార్యక్రమం మరో రెండు రోజుల్లో పూర్తి అవుతుందన్నారు. ట్రాఫిక్ పోలీసుల కంట్రోల్‌తోపాటు కార్పొరేషన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కూడా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలను క్రమశిక్షణగా పాటించాలని తెలిపారు.

● ఈ ప్రాంతాల్లో...

రామలింగాపురం సెంటర్, కనకమహల్‌సెంటర్, వీఆర్సీ, కూరగాయల మార్కెట్, కేవీఆర్, డీకేడబ్ల్యూ కూడలి, హరనాథపురం సర్కిల్ ఒక్కో ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీను దృష్టిలో ఉంచుకొని సిగ్నల్ వ్యవస్థకు సంబంధించిన టైమింగ్‌ను కార్పొరేషన్ శాఖ ఇంజనీరింగ్ విభాగం వారు సెట్ చేస్తారు.


మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ నందన్

● ఫ్లైఓవర్, అండర్‌బ్రిడ్జి మూత

నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఫ్లైఓవర్ మరమ్మతుల కారణంగా ఆదివారం నుంచి మూసేస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. ఫ్లైఓవర్‌పై జాయింట్ల వద్ద రిపేర్లు, ఇతర పనులు ఉండటంతో సుమారు 45 రోజులపాటు మూసివేస్తున్నట్లు తెలిపారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అథారిటీలు సంయుక్తంగా సమర్పించిన నివేదిక ఆధారంగా మంత్రి నారాయణ ఆదేశాల మేరకు ఆత్మకూరు బస్టాండు ఫ్లైఓవర్, ఆత్మకూరు బస్టాండు వద్ద బోసు బొమ్మకు వెళ్లే రైల్వే అండర్ బ్రిడ్జి ఓ వైపు మూసివేయడం జరుగుతుందన్నారు. బోసుబొమ్మ నుంచి పొట్టిశ్రీరాములు బొమ్మ వైపు వచ్చే అండర్‌బ్రిడ్జిలో వాహనాల రాకలు జరుగుతాయన్నారు. ఫ్లైఓవర్ కింద మార్గాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం, కోవూరు నుంచి వచ్చే వాహనదారులు నూతన పెన్నా వారధి పైనుంచి నగరంలోకి రావాలన్నారు. నవాబుపేట, బాలాజీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు విజయమహల్ గేటు, రామలింగాపురం అండర్ బ్రిడ్జి మార్గాలలో నగరంలోకి వెళ్లాలని కోరారు.

పేదింట విరిసిన క్రీడా కుసుమం

పాఠశాల స్థాయి నుంచే ఆటల్లో దిట్ట

క్రీడల్లో మే'ఘనత'

ఏడు ఆటల్లో సత్తా చాటుతున్న యువతి



సాధారణంగా ఒకరు ఒకటి లేదా రెండు, మహా అయితే మూడు క్రీడల్లో రాణిస్తుంటారు. కానీ ఓ అమ్మాయి ఏకంగా ఏడు క్రీడాంశాల్లో ప్రతిభ చాటుతోంది. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆ క్రీడా కుసుమం ఆటలపై ఆసక్తి, నిరంతర సాధనతో వివిధ పోటీల్లో సత్తాచాటింది. అంతర్ విశ్వవిద్యాలయ పోటీలతోపాటు జాతీయ స్థాయిలో రాణిస్తున్న మే'ఘనత'ను తెలుసుకుందాం..

● వీఎస్‌యూ, ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం

● అంతర్ విశ్వవిద్యాలయ, జాతీయ పోటీల్లో రాణిస్తున్న జేబీ విద్యార్థిని

కావలి (టౌన్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విడవలూరు మండలం క్రైస్తవపాళేనికి చెందిన పేద రైతు శ్రీరాములు, సుమతి దంపతుల కుమార్తె పెనమల్లి మేఘన. కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తితో పాఠశాల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంది. ప్రతీ పోటీలోనూ సత్తా చాటి బహుమతులు సొంతం చేసుకుంది. ఈ క్రమంలో ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఏడు రకాల క్రీడల్లో నైపుణ్యం సాధించింది. వాలీబాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, షూటింగ్ బాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో తన ప్రతిభను ప్రదర్శించి ప్రముఖుల ప్రశంసలందుకుంది. క్రీడలకు పెట్టింది పేరైన కావలి జేబీ కళాశాల హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదువుతోంది. నిత్యం క్రీడా సాధన, విశ్వోదయ విద్యా సంస్థ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి సహకారం, కళాశాల పీడీ ప్రసాద్ రెడ్డి శిక్షణతో రాష్ట్ర, అంతర్ విశ్వవిద్యాలయ, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తోంది.

జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం ఇలా..

- 2022లో మధ్యప్రదేశ్‌లో, 2023లో ఢిల్లీలో జరిగిన షూటింగ్ బాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించింది.
- 2023 గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ యూత్ నేషనల్స్‌లో రాష్ట్ర తరఫున పాల్గొని జట్టు విజయాల్లో ప్రధాన భూమిక పోషించింది.
- 2024లో కర్ణాటకలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో వీఎస్‌యూ జట్టు విజయానికి కృషి చేసింది.
- ఈ ఏడాది జైపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ సీనియర్ నేషనల్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఆడి అద్భుత ప్రతిభ కనబరిచింది.
- తాను నైపుణ్యం సాధించిన ఏడు క్రీడాంశాల్లో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం జట్టుకు మేఘన ప్రాతినిధ్యం వహిస్తుండటం ఆమె ప్రతిభకు తార్కాణం.



ఎస్‌ఐ కావడమే లక్ష్యం

చిన్నప్పటి నుంచి నాకు క్రీడల్లో ఆసక్తి ఎక్కువ. ఏడు రకాల ఆటల్లో మెలకువలు నేర్చుకుని ఎన్నో బహుమతులు సాధించాను. జాతీయ స్థాయి పోటీల్లో రాణించడంతోపాటు పోలీస్ శాఖలో ఎస్‌ఐగా చేరాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నా. విశ్వోదయ సంస్థ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి సహకారం, పీడీ ప్రసాద్ రెడ్డి ప్రోత్సాహం నన్ను ఈ స్థాయికి చేర్చాయి. చదువులో రాణిస్తూనే, పట్టుదలతో క్రీడల్లో మరింత సాధన చేసి లక్ష్యాన్ని చేరుకుంటాను.

- మేఘన

పురుగుల బియ్యంతో భోజనమంటూ పుకార్లు

● ఎంఈవో విచారణ ● అవాస్తవమని నిర్ధారణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం పురుగులు పట్టి నెలల తరబడి ముక్కి పోయిన బియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించారనే పుకార్లు శుక్రవారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. దీంతో ఎంఈవో-2 రమణయ్య హుటాహుటిన పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను సమగ్రంగా విచారించి అలాంటి సంఘటన చోటు చేసుకోలేదని నిర్ధారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో మిగిలిన బియ్యం పురుగులు పట్టి ఉన్న విషయం వాస్తవమేనన్నారు. అయితే ఆ బియ్యంతో వంట చేయకుండా ఇటీవల పంపిణీ చేసిన బియ్యాన్నే వినియోగించినట్లు చెప్పారు. బియ్యం సకాలంలో సరఫరా కాకపోవడంతో సమీప తిమ్మారెడ్డిపల్లి పాఠశాల నుంచి తెప్పించారన్నారు. ప్రతీనెల 7వ తేదీ సరఫరా కావాల్సిన బియ్యం ఆలస్యమవడంతో ఇతర పాఠశాలల నుంచి సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోందన్నారు. అనంతరం బియ్యంతో సహా భోజనశాల, పరిసరాలను పరిశీలించి నిల్వ ఉన్న బియ్యాన్ని గదిలో నుంచి తీసి వేయాలని సిబ్బందికి సూచించారు. సర్పంచు దిలీప్‌కుమార్, వినియోగదారుల ఫోరం, మానవ హక్కుల సంఘం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకట మోహన్ సైతం పాఠశాలకు చేరుకొని విచారించారు. ఈ నేపథ్యంలో కొంతమంది విద్యార్థులు గత వారం పురుగులున్న బియ్యంతోనే భోజనం చేశారని విన్నవించారు. అనంతరం వంటకాలను పరిశీలించి కూరలు రుచిగా లేవని నిర్ధారించారు. ఇకపై నాణ్యత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. గతంలో వంటలు సరిగా లేకపోవడంతో కొంతమంది విద్యార్థులు సమీప ఆలయంలో అన్నదానంతో ఆకలి తీర్చుకున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. భవిష్యత్తులో అలాంటివి జరుగకుండా అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని కోరారు.


బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రమణయ్య

ముగిసిన ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల నిరసన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం 11 రోజులుగా నిరసన చేపట్టిన ఆర్ అండ్‌బీ ఉద్యోగులు శుక్రవారం తమ నిరసననువిరమించారు. ఈఎన్‌సీ, డిప్యూటీ ఈఎన్‌సీ ఆదేశాలు ఇవ్వటంతో సమస్యలు కొంత మేరకు పరిష్కారమయ్యాయని ఏపీ జేఏసీ అమరావతి అసోసియేట్ అధ్యక్షుడు శరత్‌బాబు చెప్పారు. దీంతో జేఏసీ నిర్ణయం మేరకు నిరసన కార్యక్రమాన్ని ముగిస్తున్నామని ప్రకటించారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి సారించండి సారూ..

● ఏసీఆర్ఎంయూ ప్రధాన కార్యదర్శికి వినతి

బిట్రగుంట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆల్ ఇండియా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివ గోపాల్ మిశ్రాకు బిట్రగుంట బ్రాంచ్ సభ్యులు వినతిపత్రం అందచేశారు. శుక్రవారం విజయవాడలో జరిగిన సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ కౌన్సిల్ సమావేశం పాల్గొన్న ఆయన దృష్టికి బిట్రగుంట సమస్యలు తీసుకెళ్లారు. రైల్వే కార్మికుల అవసరార్థం విక్రమ సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను బిట్రగుంట స్టేషన్లో నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్‌యూనియన్ బిట్రగుంట అధ్యక్షుడు ఎం.శేఖర్‌యాదవ్, కార్యదర్శి సీహెచ్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బీ.మైకేల్, సభ్యులు శ్రీహరి, ప్రసాద్, నవీన్, మధు, రఘు పాల్గొన్నారు.


ఏసీఆర్ఎంయూ జనరల్ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు


కలిగిరి మండలం వెలగపాడు వద్ద సోమశిల ఉత్తరకాలువ బ్రాంచి కెనాల్‌కు పడిన గండి

అధికారుల నిర్లక్ష్యం

సోమశిల ఉత్తర కాలువకు ముప్పు

నీటి విడుదల ప్రశ్నార్థకం

సోమశిల అధికారుల నిర్లక్ష్యం కారణంగా సోమశిల ఉత్తర కాలువకు ముప్పు పొంచిఉంది. మొంథా తుఫాన్‌కు ఈ కాలువకు మూడు గండ్లు పడినా వాటిని పూడ్చేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఈ క్రమంలో నీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. కాలువ నీరు కిందకు పోకుండా దంటుపాలెం వద్ద బిగించి ఉన్న గేట్లను తుఫాన్ సమయంలో అధికారులు ఎత్తకపోవటంతో ఆ నీరు ముందుకు పోయేందుకు మార్గం లేక కాలువ గట్లు పొంగి ప్రవహించి గండ్లు పడటానికి కారణమైంది. అయితే గండ్లు పడిన తర్వాత కూడా అధికారులు మేల్కొని వాటిని పూడ్చకపోవటంతో ఈనెల 15వ తేదీ నుంచి సోమశిల కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు డీఆర్సీ మీటింగ్‌లో అధికారులు ప్రకటించినా నీరు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. వరి నారుమడులు పోసుకునేందుకు సిద్ధమవుతున్న రైతులు సోమశిల నీటి కోసం ఎదురు చూస్తున్నారు. కలిగిరి శివారులో ఉన్న ఉత్తరకాలువ (గొట్టిపాటి కొండపనాయుడు) కాలువ నుంచి సబ్‌చానల్ ద్వారా మార్గమధ్యంలో అనేక గ్రామాలను కలుపుకుంటూ ఏఎస్‌పేట మండలం శ్రీకొలను గ్రామం చెరవు వరకు సోమశిల నీరు వెళుతోంది. గత వ్యవసాయ సీజన్‌లో కలిగిరి మండలం కావలి ముస్తాపురం పంచాయతీ దంటుపాలెం గ్రామం వద్ద పైనున్న తూమును కట్టేసి నీటిని జమ్మవరం వైపు పంపారు. అయితే రైతుల అవసరాలు తీరిన తర్వాత ఆ తూము గేట్లు ఎత్తకపోవడంతో నీరు ముందుకు వెళ్లేందకు మార్గం లేక మొంథా తుఫాన్‌కు కాలువ మూడు చోట్ల గండ్లు పడింది. వాటిని పూడ్చని నేపథ్యంలో ఉత్తర కాలువలకు ఎలా నీటిని విడుదల చేస్తారో వేసి చూడాల్సిందే.

- కావలి (ఆంధ్రజ్యోతి)


కావలి ముస్తాపురం వద్ద సోమశిల ఉత్తరకాలువ బ్రాంచి కెనాల్‌కు గండి


కలిగిరి మండలం కమ్మవారిపాలెం వద్ద బ్రాంచి కాలువకు పడిన గండి


ఉత్తరకాలువలో నీరు కిందకు పోకుండా దంటుపాలెం వద్ద వేసిన లాక్‌లు

సీసీఆర్‌సీలు అందేనా..!?

(5వ పేజీ తరువాయి)

సుమారుగా 20,451 వరకు కార్డులు పంపి ణీ చేసినట్లు వ్యవసాయశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అల్లూరు, కొడవలూరు, విడవలూరు మండలాల్లో ఇప్పటి వరకు లక్ష్యాలకు మించి సీసీఆర్‌సీలు అందజేశారు. ఇంకా కొన్ని మండలాల్లో లక్ష్యాలకు అనుగుణంగా అందచేయలేదు. అవగాహనలేమితో చాలా మంది రైతులు వీటిని అందుకోలేకపోతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాలో అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్‌సీ అందించేందుకు వ్యవసాయ, రెవెన్యూశాఖల సమన్వయంతో అవసరమైన అన్నీ చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా వ్యవసాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కౌలుకు భూమి ఇచ్చినట్లు అంగీకార పత్రం ఇవ్వడంవల్ల భూయజమానికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అర్హత కలిగిన రైతులందరికీ సీసీఆర్‌సీ ఇప్పించడంతోపాటు వారికి రుణాలు అందేలా బ్యాంకర్లతో మాట్లాడుతున్నాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

ఇంటర్ పరీక్షల్లో సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి)

పరీక్షలు రాసిన విద్యార్థులకు సెకండ్ ఇయర్‌లో కూడా ఇదే కొనసాగిస్తారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే ప్రశ్నపత్రాలుంటాయి.

● ఫస్ట్ ఇయర్‌లో 27వేల మంది

ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఈ ఏడాది 187 కళాశాలల నుంచి 27వేల మంది విద్యార్థులు కొత్త విధానంలో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారని ఆర్ఐఓ వరప్రసాద్‌రావు తెలిపారు. ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఒరియంటల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా బోధన జరుగుతోందని తెలిపారు.

సీడాప్ శిక్షణ పరిశీలన

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీఏ, సీడాప్ ఆధ్వర్యంలో నగరంలోని బీవీ నగర్‌లో నిర్వహిస్తున్న లావా శిక్షణ కేంద్రాన్ని డీఆర్‌డీఏ పీడీ వీ. నాగరాజకుమారి శుక్రవారం పరిశీలించారు. శిక్షణ ఏర్పాట్లను, భోజనం, ఇతర వసతులపై శిక్షార్థులను ప్రశ్నించారు. ఆ సెంటర్‌లో టీవీఎస్ కంపెనీ ద్వారా నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలను పర్యవేక్షించారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్ధంగా నిర్వహించాలి

● రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు ఆదేశం

● కందుకూరు, గుడ్లూరు మండలాల్లోని పలు పాఠశాలల్లో తనిఖీలు

కందుకూరు/గుడ్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలాంటి లోటుపాట్లుకు ఆస్కారం ఇవ్వకుండా సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బీ. కాంతారావు సూచించారు. శుక్రవారం ఆయన కందుకూరు, గుడ్లూరు మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కందుకూరు మండలంలోని మాచవరం జడ్పీ హైస్కూల్, పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, పామూరు రోడ్డులో ఉన్న కేజీబీవీలో ఆయన తనిఖీలు నిర్వహించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడి ప్రతిరోజు భోజన ఏర్పాట్లు జరుగుతున్న తీరు, మెనూ అమలు తదితర అంశాలను ఆరాతీశారు. రికార్డులు పరిశీలించారు. అలాగే గుడ్లూరు మండలంలోని పొట్లూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని, గుడ్లూరు హైస్కూల్, ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుడ్లూరు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రతిరోజు మెనుప్రకారం భోజనం విద్యార్థులకు అందించాలన్నారు. సిద్ధం చేసిన టమోటా జ్యూస్‌ను చూసి దేనికని ప్రశ్నించగా కుకింగ్ ఏజెంట్ రమణమ్మ 10 కేజీల టమాటాలతో కోడిగుడ్లు కూర చేస్తున్నామని చెప్పడంతో ఆయన దానిని సిబ్బంది ద్వారా కాటావేయించారు. అది 8 కేజీలు ఉండడంతో మిగతా 2 కేజీల ఎక్కడని ప్రశ్నించారు. ఇలా చేయడం జరికాదని, విద్యార్థులను తమ ఇంట్లో పిల్లలుగా భావించి భోజనం వండిపెట్టాలని సూచించారు. కాగా గుడ్లూరు రేషన్ షాపుల్లో రేషన్ పంపిణీ ప్రక్రియ పారదర్శికంగా జరగడంలేదని కొందరు గ్రామస్థులు ఆయన దృష్టికి తెచ్చారు. ప్రతి నెల బియ్యం ఇస్తున్నా, చక్కెర, కందిపప్పు, ఇతర పప్పుధాన్యాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోయినా, మెనూ అమలు చేయకపోయినా, రుచిగా శుచిగా లేకపోయినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్‌వో లీలారాణి, డీఎం అర్జున రావు, సమన్వయ అధికారి సైమన్‌బాబు, స్థానిక విద్యాశాఖ అధికారులు ఉన్నారు.


కందుకూరు జడ్పీ పాఠశాలలో భోజనాన్ని రుచి చూస్తున్న కాంతారావు